
మార్గదర్శకులు
రూ|| 120/-
పేజీలు: 130




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 182 | ఆదివారం | 1-06-2025 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## మిస్ వరల్డ్ - 25 విజేతగా ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ

మిస్ వరల్డ్ –2025 విజేతగా థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ నిలిచారు. మిస్ వరల్డ్ – 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరి కిరీటాన్ని ఆమెకు ధరించారు. 3వ రన్నర్ అప్‌గా మిస్ మార్టినిక్, 2వ రన్నర్ అప్‌గా మిస్ పోలాండ్, 1వ రన్నర్ అప్‌గా మిస్ పోలెండ్ నిలిచారు.



# గోశాల ఏర్పాటుకు కమిటీ

- మొదటి దశలో వెటర్నరీ, వ్యవసాయ యూనివర్సిటీల్లో దేవాలయ భూముల్లో గోశాలలు
- కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గొద్దు
- నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

గోశాలల ఏర్పాటుకు సంబంధించి కమిటీని నియమించాలని, నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికను సమర్పించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గోసంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలని సిఎం సూచించారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, వ్యవసాయ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని, అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని, కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరుకు స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు ఏర్పాటు చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గోవుల నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని తరువాయి 2లో

## రాజన్న గోశాలలో 20 కోడెలు మృతి

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం : కలెక్టర్

ప్రజాపక్షం/వేములవాడ

వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో ఉన్న రాజన్న గోశాలలో కోడెల మృత్యువాత కలకలం రేపుతోంది. ఇప్పటికే సుమారు 20కి పైగా కోడెలు మృత్యువాత పడినట్లు సమాచారం. గోశాలలో అధికారుల పనితీరుపై పలు ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం తరువాయి 2లో




# వేగంగా కరోనా విజృంభణ

3000 చేరువలో కేసులు

అత్యధికంగా మహారాష్ట్ర, ఢిల్లీలో నమోదు

గత 24 గంటల్లో ఏడుగురు మృతి



**న్యూఢిల్లీ:** దేశంలో మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. దేశంలో మొత్తం 2,710 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. గత వారం రోజులుగా కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. కేరళలో అత్యధిక కేసులు వస్తున్నట్లు తరువాయి 2లో

## పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపు

# నిర్ణయం పునఃసమీక్షించాలి

- దిగుమతి సుంకాన్ని 27.5 నుంచి 40 శాతానికి పెంచాలని అభ్యర్థిస్తే తగ్గించడం బాధాకరం
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు
- కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖమంత్రి పియూష్ గోయల్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

పామ్ అయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌కు లేఖ రాసినట్లు మంత్రి వెల్లడించారు. క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతులపై సుంకాన్ని తగ్గించాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం సరైంది కాదన్నారు. ఇప్పటికే దేశీయ ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనార్థం దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 40 శాతనికి పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యర్థించినప్పటికి, దీనికి విరుద్ధంగా కేంద్రం దిగుమతి సుంకాన్ని తగ్గించడం బాధాకరమన్నారు. ఈ నిర్ణయం వల్ల ఆయిల్ పామ్ రైతులకు గెలల ధర తగ్గడంతో తరువాయి 2లో

## రైతులపై తీవ్ర ప్రభావం

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



కేంద్ర ప్రభుత్వం పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించడం సరైంది కాదని తెలంగాణ వ్యవసాయం, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. ఈ నిర్ణయం వల్ల పామ్ ఆయిల్ సాగుచేసే రైతులపై తీవ్ర ప్రభావం పడు తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పామ్ ఆయిల్ సాగును విస్తరించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని, దీనితో తరువాయి 2లో




## సంక్షోభ సమయంలో

# దేశం ఐక్యం

ఆ ఘనత రాజ్యాంగానిదే

భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్

**ప్రయాగ్‌రాజ్ (ఉత్తర్‌ప్రదేశ్) :** సంక్షోభాల సమయంలో దేశాన్ని ఐక్యంగా, బలంగాఉంచిన ఘనత రాజ్యాంగానిదేనని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ అన్నారు. ఆయన శనివారం ఇక్కడి అలహాబాద్ హైకోర్టులో మల్టీ లెవల్ పార్కింగ్, అడ్వకేట్ ఛాంబర్స్ ప్రారంభోత్సవ సభలో ప్రసంగించారు. రాజ్యాంగాన్ని తయారుచేసి, దాని తుది ముసాయిదాను రాజ్యాంగసభ ముందు సమర్పించినప్పుడు రాజ్యాంగాన్ని మిక్కిలి సమాఖ్య అని, మరికొంత మంది రాజ్యాంగాన్ని ఏకకేంద్రం అని అన్నారని చెప్పారు. బాబాసాహెబ్ అంబేద్కర్ మాత్రం రాజ్యాంగం పూర్తిగా సమాఖ్య కానీ, పూర్తిగా ఏకకేంద్రం కానీ కాదని సమాధానం ఇచ్చారని బిఆర్.గవాయ్ తెలియజేశారు. శాంతి, యుద్ధ సమయాలలో మనల్ని ఐక్యంగా, తరువాయి 2లో



## వరంగల్ సిటీలో ఉగ్ర కదలికలు

రంగంలోకి ఎన్ఐఎ

అదుపులో ఓ వ్యక్తి

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్

వివిధ రాష్ట్రాల్లో పేలుళ్లకు ఉగ్రవాదులు కుట్ర పన్నినట్టు దర్యాప్తు సంస్థలు గుర్తించగా, ఇప్పటికే హైదరాబాదుకు చెందిన సయ్యద్ సమీర్, విజయనగరానికి చెందిన సిరాజ్‌లను గుర్తించారు. అల్‌హిందూఇత్తెహదుల్ ముసల్మాన్ అనే పేరుతో 38 మంది సభ్యులతో సిగ్నల్ యాప్ లో ఆ సంస్థకు చెం దిన ఒక గ్రూప్ ఏర్పాటు చేయగా సౌదీలో ఉంటున్న అబూ ముసబ్ సూచనల మేరకు తరచుగా వీరంతా ఆ యాప్ లోనే మాట్లాడుకునేవారని అందులో వరంగల్, ఎల్బీనగర్ కు చెందిన పరహన్ మొయినుద్దీన్ కూడా ఉన్నట్లు ఎన్ఐఏ సంస్థ గుర్తించినట్లు తెలుస్తోంది. సిరాజ్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఎస్సై శిక్షణ కోసం హైదరాబాద్ కు వెళ్లి విఫలం అయ్యాడని తెలుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ బోయగూడకు చెందిన తరువాయి 2లో

# యుద్ధ విమానం కోల్పోయాం

- పాకిస్థాన్‌తో జరిగిన సైనిక చర్యల్లో భారత్‌కు నష్టం జరిగింది
- మొదటిసారి అంగీకరించిన సిడిఎస్ చీఫ్ చౌహాన్
- విమానాల నష్టం సంఖ్య చెప్పేందుకు తిరస్కృతి
- భారత్ వ్యూహాలు మెరుగుపడాలని వెల్లడి
- దేశానికి నిజాలు చెప్పండిఃకాంగ్రెస్ డిమాండ్




**సింగపూర్ :** పాకిస్థాన్‌తో ఇటీవల జరిగిన సైనిక చర్యలో భారత్‌కు యుద్ధ విమాన నష్టం జరిగిందని భారత త్రివిధ దళాల ప్రధాన అధిపతి (డిఫెన్స్ స్టాఫ్ చీఫ్) జనరల్ అనిల్ చౌహాన్ మొదటిసారి అంగీకరించారు. ఐతే ఎంత నష్టం అనే విషయం చెప్పలేదు. సింగపూర్‌లో ఏటా జరిగే ''షాంగ్రిలా డైలాగ్'' సమావేశానికి హాజరైన చౌహాన్ బ్లూంబెర్గ్ టి.వికి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ''ఒక మంచి విషయం ఏమిటంటే, వ్యూహాత్మకంగా మేం చేసిన తప్పిదాలను అర్థం చేసుకోగలిగాం, పరిష్కారాలు కనిపెట్టాం, వాటిని సరిదిద్దుకుని రెండు రోజుల తర్వాత ఆ పరిష్కార మార్గాలను అమలు చేశాం, మన యుద్ధ విమానాలన్నీ సుదూరంగా లోలోపల ఉన్న లక్ష్యాలపై మళ్ళీ దాడిచేశాయి'' అని చెప్పారు. మే 7న జరిగిన ఆపరేషన్ సిందూర్–తర్వాత జరిగిన పరస్పర సైనిక చర్యలో జనరల్ చౌహాన్ కీలకపాత్ర పోషించారు. కాగా చౌహాన్ వ్యాఖ్యలపై రాజకీయ విమర్శలు చెలరేగాయి. కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఎంత నష్టం జరిగిందో దేశానికి నిజాలు చెప్పాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. సమీక్షా కమిటీ ఏర్పాటు చేయాలని కోరింది.

''నా దృష్టిలో మన యుద్ధ విమానాన్ని వారు కూల్చివేయడం ముఖ్యం కాదు, అవి ఎందుకు కూలిపోయాయన్నది తెలుసుకోవడం ముఖ్యమైన విషయం, మన నైపుణ్యం పెరగాలి'' అని ఇంటర్వ్యూలో అనిల్ చౌహాన్ అన్నారు. భారత్ యుద్ధ వ్యూహాలు మెరుగుపడాలని అన్నారు. పాకిస్థాన్ లోలోపలికి ప్రవేశించిన భారత యుద్ధ విమానాలు గురిచూసి నిర్దేశిత లక్ష్యాలను దెబ్బతీసిన సమయంలో ఎన్ని విమానాలను భారత్ కోల్పోయిందన్న విషయాన్ని ఆయన ధృవీకరించలేదు. విదేశీగడ్డపై మొదటిసారి ఆయన చెప్పిన పాకిస్థాన్‌ను విజయవంతంగా దెబ్బతీసిన తర్వాత, ఈ సమస్యలను పునఃసమీక్షించుకున్నామన్నారు. ''మే నెలారంభంలో పాకిస్థాన్‌తో నాలుగురోజుల పాటు జరిగిన యుద్ధంలో తరువాయి 2లో

## నిజాలు రాబట్టేందుకు రివ్యూ కమిటీ

కాంగ్రెస్ డిమాండ్

సిడిఎస్ ప్రధానాధిపతి జనరల్ చౌహాన్ బ్లూంబెర్గ్ టీవీ ఇంటర్వ్యూ వెలువడిన కొద్దిసేపటికీ కాంగ్రెస్‌పార్టీ కేంద్ర ప్రభుత్వంపై 'ఎక్స్' వేదికగా ప్రశ్నలు సంధించింది. కార్గిల్ యుద్ధం తర్వాత చేసినట్టే ఇప్పుడు కూడా ఒక రివ్యూ కమిటీ నివేదిక ద్వారా అసలు నిజాలను వెల్లడించాలని కోరింది. నాలుగు రోజుల యుద్ధంలో ఎంత నష్టం జరిగిందో, ఎలాంటి నష్టాలు జరిగాయో దేశానికి నిజాలు వెల్లడించాలని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శనివారంనాడు డిమాండ్ చేశారు. యుద్ధ సమయంలో పాకిస్థాన్ మన విమానాలను కూల్చివేసిందా? కార్గిల్ యుద్ధం గురించి ఆయన గుర్తు చేసుకుంటూ, నాటి వాజ్‌పేయి ప్రభుత్వం 1999 జులైనెలలో కార్గిల్ సమీక్షా సంఘాన్ని నియమించిందని, ఈ కమిటీకి నాటి భారత వ్యూహాత్మక వ్యవహారాల గురు కె.సుబ్రమణ్యం నాయకత్వం వహించారని, ఆయన కుమారుడే ఈనాడు విదేశాంగమంత్రిగా వ్యవహరిస్తున్నారని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధం ముగిసిన మూడు రోజులకే ఈ కమిటీ ఏర్పడిందని, చాలా వివరణాత్మకంగా ఐదు నెలల తరువాయి 2లో

# 50% ఉక్కుపై సుంకం

- ఈనెల 4 నుంచి అమలు
- పిట్స్‌బర్గ్ ఉక్కు కార్మికుల ర్యాలీలో ట్రంప్ ప్రకటన



**పిట్స్‌బర్గ్ :** అమెరికా దేశంలోకి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు రెట్టింపయ్యాయి. కొత్తగా మరో 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. జూన్ నాలుగో తేదీ నుండి ఈ రెట్టింపు సుంకాలు అమలులోకి వస్తాయని పెన్సిల్వేనియా పిట్స్‌బర్గ్‌లో జరిగిన ఒక ర్యాలీలో ట్రంప్ ఈ ప్రకటన చేశారు. ఈ ర్యాలీకి భారీసంఖ్యలో ఉక్కు, అల్యూమినియం రంగాలకు చెందిన కార్మికులు హాజరయ్యారు. రాబోయేకాలంలో ఉక్కురంగ కార్మికులకు 5,000 డాలర్ల బోనస్ పొందడానికి అర్హులు అవుతారని హర్షధ్వానాలమధ్య ట్రంప్ ప్రకటించారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతులకు చైనాపై ఎక్కువ ఆధారపడకుండా దేశీయ ఉక్కు పరిశ్రమకు ఎక్కువ ప్రోత్సాహం ఇవ్వడానికి ఈ రెట్టింపు సుంకాల అమలు ఉపయోగపడుతుందని చెప్పారు. 2018లో మొదటిసారి తాను అధ్యక్షుడుగా ఉన్నప్పుడు 25 శాతం దిగుమతులపై సుంకాలు విధించడం ద్వారా పిట్స్‌బర్గ్‌లో ఉన్న అతిపెద్ద ఉక్కు కర్మాగారాన్ని రక్షించాననీ, ఇప్పుడు కూడా దేశీయ ఉక్కు ఉత్పత్తులను పెంచడానికే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఇప్పటికే స్టీల్ దిగుమతులపై 25 శాతం సుంకాలు అమలులో ఉన్నాయి. కొత్తగా పెంచిన వాటితోకలిపి ఉక్కు దిగుమతులపై సుంకాలు 50 శాతానికి చేరాయి. జపాన్ కేంద్రంగా పనిచేసే నిప్పో ఉక్కు కంపెనీ–అమెరికా ఉక్కు భాగస్వామ్య చర్చల అనంతరం ర్యాలీలో ట్రంప్ మాట్లాడారు. ఉక్కు ఉత్పత్తిని భారీగా పెంచేందుకు ఈ రెండు దేశాలమధ్య కొత్తగా 14 బిలియన్ డాలర్ల ఉక్కు రంగంలో పెట్టుబడులు పెంచుతున్నట్లు చెప్పారు. ఈ విధంగా సుంకాలను రెట్టింపు చేయడంవల్ల దేశంలో ఉక్కు పరిశ్రమకు మరింత భద్రత కలుగుతుందని ఆయన తరువాయి 12లో

## బిఆర్ఎస్, తెలంగాణ జాగృతి

# కెసిఆర్‌కు కళ్లలాంటివి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడి

మాజీ సిఎంకు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తామని ప్రకటన

జూబ్లీహిల్స్‌లో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

కెసిఆర్‌కు బిఆర్ఎస్,తెలంగాణ జాగృతి రెండు కూడా రెండు కళ్లలాంటివని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కెసిఆర్‌కు కాళేశ్వరం విషయంలో నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్టు ప్రకటించారు. జాగృతిని మరింత విస్తరిస్తామని, జాగృతి కమిటీలో కొత్తగా ఎస్‌సి, ఎస్‌టి, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు విభాగాలను ఏర్పాటు చేసి, ఆయా వర్గాల కోసం ఉద్యమిస్తామని ప్రకటించారు



తాను పోరాటాలు చేస్తుంటే కొంత మంది ఓర్వడం లేదని తరువాయి 2లో

# నంబాల మృతి నష్టమే

జూన్ 11 నుంచి ఆగస్టు మూడు వరకు స్మారక సభలు

**జూన్ 10న బంద్‌కు మావోయిస్టుల పిలుపు**



ప్రజాపక్షం/ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ మృతి విప్లవోద్యమానికి తీవ్ర నష్టమేనని కానీ నష్టం శాశ్వతం కాదని మావోయిస్టు పార్టీ తెలిపింది. పలుమార్లు నాయకత్వాన్ని హతమార్చి రాజ్యం విప్లవోద్యమ పని అయిపోయిందని ప్రకటించిందని, కానీ అది నిజం కాలేదని ఇప్పుడు విప్లవోద్యమం బలపడుతున్నదని తెలిపారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో మీడియాకు ఒక లేఖను విడుదల చేశారు. మే 21న భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటి రోజని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బసవరాజ్ సహా 27 మంది వివిధ స్థాయిల్లో ఉన్న నాయకత్వాన్ని, సభ్యులను భారత సైన్యం, పారామిలటరి, కమాండో బలగాలు హత్య చేశాయని ఆ లేఖలో తరువాయి 12లో




# ఆహారం, మందులు అడ్డుకోవడం దుర్మార్గం

- ఆకలితో అలమటిస్తున్న గాజా వాసులకు వెంటనే సాయం అందేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తేవాలి
- పాలస్తీనా ప్రజలపై అమానవీయ బాంబు దాడులు తక్షణం నిలిపివేయాలి
- రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలస్తీనా ప్రజలపై కొనసాగిస్తున్న అమానవీయ బాంబుల దాడిని తక్షణమే ని లిపివేయాలని, ఆకలితో ఆలమటిస్తున్న ప్రజలకు తక్షణ సహాయం అందే విధంగా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. యుద్ధం పేరుతో గాజాలో పౌర నివాసాలు, ఆసుపత్రులపై తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పాకిస్థాన్‌లో 34 మంది ఉగ్రవాదులు అరెస్ట్

**లాహోర్ :** పాకిస్థాన్‌లో భారీ దాడి సన్నద్ధమవుతున్న ఉగ్రవాదుల ప్రయత్నం విఫలమైంది. వివిధ భద్రతావిభాగాలు చేసిన గాలింపు చర్యల్లో 34 మంది ఉగ్రవాదులను అరెస్టు చేశారు. పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో శాంతిభద్రతల సంస్థలు గూఢచారి కార్యకలాపాలను ఆధారంగా చేసుకుని వివిధ జిల్లాలలో 415 ఆపరేషన్స్ చేశాయి. ఈ దాడుల్లో అరెస్టయిన ఉగ్రవాదులలో ఎక్కువమంది నిషేధిత తెహ్రిక్ ఏ లాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) గ్రూప్‌కు చెందినవారే. అరెస్టయిన వారిలో ముగ్గురు అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాదులుగా పాకిస్థాన్ ఉగ్రవాద వ్యతిరేక విభాగం ప్రకటించింది. భద్రతాదళాలు, ఇతర రక్షణ వి భాగాలకు చెందినవారిపై దాడులు చేయడం లక్ష్యంగా ఉగ్రవాదులు భావించినప్పటికీ గాలింపు చర్యలవల్ల వారి ప్రయత్నం విఫలమైంది. వివిధ జిల్లాలలో శాంతి భద్రతల అధికారులు, ముఖ్యమైన భవనాలపై దాడులు చేయాలని ఉగ్రవాదులు ప్రణాళిక చేసుకున్నారని అధికారులు చెప్పారు. ఈ దాడుల్లో 5,841 గ్రాముల పేలుడు పదార్థాలను, 19 డెటొనేటర్లను, 51 అడుగుల సేఫ్టీ ఫ్యూజ్ వైర్‌ను, చేతి బాంబులను స్వాధీనం చేసుకున్నారు.

# నిందలు, సందేహాల మధ్య ఇస్తాంబుల్‌లో రేపు ఉక్రేన్–రష్యా చర్చలు





**ఇస్తాంబుల్ :** సందేహాలు, పరస్పర నిందలు, అనుమానాస్పద వాతావరణం మధ్య ఉక్రేన్–రష్యా మధ్య సోమవారం నాడు ఇస్తాంబుల్‌లో రెండో విడత ముఖాముఖీ చర్చలకు రంగం సిద్ధమైంది. ఇస్తాంబుల్‌లో తగిన ఏర్పాట్లు కూడా చేశారు. ఐతే తుర్కియే (టర్కీ) మధ్యవర్తిత్వాన్ని, చర్చల్లో జోక్యాన్ని అనుమతించేదిలేదని రష్యా నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ఈ చర్చల్లో పాల్గొనేందుకు ఉక్రేన్ సుముఖత వ్యక్తం చేస్తున్నప్పటికీ అనేక సందేహాలు వ్యక్తం చేస్తోంది. ఉక్రేన్‌లో సమస్య మూలకారణాలు పరిష్కరించేందుకు రష్యా ఒక పూర్తిస్థాయి మెమొరాండంను సిద్ధం చేసింది. ఉక్రేన్ కూడా రెండో విడత చర్చలకు సంసిద్ధత ప్రకటించింది. రెండో విడత చర్చలను కూడా ఫలితం లేకుండా చేసేందుకు రష్యా ప్రయత్నం చేస్తోందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ముందుగానే ఆరోపణలు ప్రారంభించారు. ఇస్తాంబుల్‌లో చర్చలకు సంబంధించిన షరతులు, నిబంధనలు సంబంధిత లిఖితపూర్వక మెమొరాండంను ఇప్పటివరకూ రష్యా తమకు ఇవ్వలేదని జెలెన్స్కీ విమర్శించారు. ''ఏదైనా ఒక సమావేశం అర్థవంతంగా జరగాలి, ఎజెండా స్పష్టంగా ఉండాలి, సంప్రదింపులకు సంబంధించిన ఎజెండాను స్పష్టంగా రూపొందించాలి, ఉక్రేన్ తన సంసిద్ధతను, ప్రతిపాదనలను రష్యాకు పంపింది, కాల్పుల విరమణకు సంసిద్ధత ప్రకటించింది'' అని జెలెన్స్కీ పేర్కొన్నారు. 2022 ఫిబవరిలో ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించింది. 2014లో రష్యా స్వాధీనం చేసుకున్న దక్షిణ క్రిమియా పెనిన్‌సులా ప్రాంతంలోసహా ఇప్పటివరకూ 20 శాతం ఉక్రేన్ భూభాగం రష్యా ఆక్రమణలో ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిగా రష్యాను ఒప్పించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఐతే చర్చలకు పుతిన్ పెద్ద ఆటంకంగా ఉన్నారన్న విషయాన్ని ట్రంప్ తిరస్కరించారు.

**24 గంటల్లో 1425 మంది ఉక్రేన్ దళాలు మృతి**

గడచిన ఇరవైనాలుగు గంటల్లో ఉక్రేన్‌పై చేసిన దాడుల్లో 1,425 మంది ఆ దేశ సైనికులు మరణించి ఉంటారనిఇ రష్యా రక్షణశాఖ ప్రకటించింది. టాస్ వార్తాసంస్థ శనివారం నాడు ఈ ఈ విషయం వెల్లడించింది. ఈ దాడుల్లో రెండు యుద్ధ టాంకులు, 18 సాయుధబలగాల వాహనాలు కూడా ధ్వంసమైనట్లు తెలిపింది. దాడుల్లో భాగంగా ఉత్తర ప్రాంతంలో 225 మంది ఉక్రేన్ సైనికులను వధించినట్లు పేర్కొంది. ఉక్రేన్‌పై రష్యా శనివారంనాడు చేసిన దాడుల్లో ఇద్దరు పౌరులు మరణించారు. వీరిలో తొమ్మిదేళ్ళ బాలిక ఉంది. ఒకవైపు చర్చలకు సన్నాహాలు జరుగుతుండగా మరోవైపు దాడులు కొనసాగుతున్న దశలో ఉక్రేన్ ప్రతినిధులు ఇస్లాంబుల్ చర్చలకు హాజరవుతారన్న విషయంపై సందిగ్ధత ఏర్పడింది. రష్యా దళాలు 109 డ్రోన్లు, 5 క్షిపణులను ఉక్రేన్‌పై ప్రయోగించింది. వీటిల్లో 42 డ్రోన్లను ఉక్రేన్ కూల్చివేసింది. డోనెట్స్క్ ప్రాంతంలోని ఉక్రేన్ గ్రామం నోవోపిల్, సుమీ రీజియన్‌లోని ఒడొలాగీ గ్రామాలను విముక్తి చేసినట్లు రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది.

# భూగోళ ఆకలిరాజ్యం పాలస్తీనా

### ఐక్యరాజ్యసమితి ఆందోళన



**గాజా :** భూగోళంపై ఒక పూర్తి ఆకలిరాజ్యం పాలస్తీనా భూభాగమేనని, అక్కడి ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో పాలస్తినా ప్రజలు నూటికి నూరు శాతం ఆకలితో అలమటిస్తున్నారని పేర్కొంది. గాజా ప్రాంతం పూర్తిగా దిగ్బంధనంలో ఉందని, ఆహార సరఫరా లోపలికి వెళ్ళడంలేదని, వెళ్ళిన ఆహార సరఫరాలు కేవలం పరిమితంగానే ఉన్నాయని ఐక్యరాజ్యసమితి మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం (ఓసిహెచ్ఎ) ఒక ప్రకటనలో పేర్కొంది. గాజాలో యుద్ధాన్ని నివారించేందుకు గడచిన ఇరవై నెలలుగా సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయనీ, కానీ వాటికి అంతూదరీ లేకుండా పోయిందనీ, ఇప్పుడు గాజా ప్రాంతం భూగోళంపై ఒక ఆకలి రాజ్యంగా మారిందని పేర్కొంది. మార్చి ఒకటో తేదీతో ఇజ్రాయెల్–హమాస్ మధ్య 45 రోజుల కాల్పుల విరమన ఒప్పందం ముగిసిపోయిన తర్వాత తిరిగి చర్చల ద్వారా ఒప్పందాన్ని పునరుద్ధరించాలని హమాస్ కోరింది. కానీ ఇజ్రాయెల్ అందుకు తిరస్కరించింది. యథాతథంగా కాల్పుల విరమణను కొనసాగించాలని కోరింది. ఈ విషయంలో విభేదాలు తలెత్తాయి. మధ్యలో ఇజ్రాయెల్–హమాస్ కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడుతూ పరస్పర ఆరోపణలు చేసుకుంటూ వచ్చాయి. అతికష్టంమీద 45 రోజుల కాల్పుల విరమణ గడువు పూర్తయ్యాక మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఆహారసరఫరాను నిలిపివేస్తూ ఇజ్రాయెల్ నిఘాను పెంచింది. అప్పటినుండీ ఈనాటి వరకూ గాజాలోకి ఆహార సరఫరా లేకపోవడంతో 20.30 లక్షలమంది ప్రజలు కరువు కాటక పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఇజ్రాయెల్ దయతలచినప్పటికీ ఆహారసరఫరా మాత్రం సరిగ్గా జరగడంలేదు. బయట నుండి అంతర్జాతీయ ఆహార సరఫరాను అడ్డుకోవడం ఒక యుద్ధవ్యూహంగా ఇజ్రాయెల్ అమలు చేస్తున్నది. ఇదిలా ఉండగా గడచిన 24 గంటల్లో గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 60 మంది పాలస్తీనియన్లు మరణించారు.

# తైవాన్ స్వాధీనానికి చైనా యత్నాలు

### ఆసియా దేశాలు రక్షణ బడ్జెట్ పెంచాలిఃహెగ్సెత్



**సింగపూర్ :** తైవాన్‌కు చైనాదేశం అతిపెద్ద బెడదగా మారిందని ఈ పూర్వరంగంలో ఆసియా దేశాలు తమ తమ రక్షణ బడ్జెట్‌లను గణనీయంగా పెంచాలని అమెరికా రక్షణశాఖామంత్రి పీట్ హెగ్సెత్ అన్నారు. 2027 నాటికి తైవాన్‌పై దాడిచేసి స్వాధీనం చేసుకోవాలని చైనా సైన్యానికి ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఒక తుది గడువు తేదీ నిర్ణయించారని, ఆసియా దేశాలు అప్రమత్తం కావాలని హెచ్చరించారు. సింగపూర్‌లో జరిగిన ఆసియా దేశాల సైనికాధికారుల ఉన్నతస్థాయి సమావేశం హెగ్సెత్ మాట్లాడుతూ, ఆసియా ప్రాంతంలో చైనా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. హెగ్సెత్ విమర్శలకు చైనా ఇంకా ప్రతిస్పందించలేదు. తైవాన్‌తో చైనా యుద్ధాన్ని నివారించేందుకు ఆసియా దేశాలు రక్షణ బడ్జెట్‌లను పెంచుకోవాలనీ, ఈ విషయంలో అమెరికాతో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. చైనా గొంతు నొక్కేయాలనో, ఆధిపత్యం చెలాయించాలనో అమెరికా ప్రయత్నం చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. తైవాన్ స్వాతంత్ర్యానికి చైనా పెద్ద సమస్యగా మారిందన్నారు. ఆసియానుండి వైదొలగేందుకు అమెరికా సిద్ధంగా లేదని, అదే సమయంలో ఆసియాలో అమెరికా మిత్రదేశాలకు ఎలాంటి బెదిరింపులు ఎదురైనా సహించబోమని ఆయన హెచ్చరించారు. ఏటా జరిగే 'షాంగ్రిలా డైలాగ్' సదస్సులో హెగ్సెత్ మాట్లాడుతూ, స్వయంపాలిత తైవాన్ ద్వీపం తనదేనని చైనా వాదిస్తోందని, తైవాన్‌పై గనుక చైనా దాడి చేస్తే అస్థిరపరిస్థితి ఏర్పడుతుందని చాలా దేశాల భయపడుతున్న విషయాన్ని చైనా ప్రభుత్వం కూడా తోసిపుచ్చడంలేదని ఆయన అన్నారు. కాగా అమెరికా అధికారులు చాలాకాలంగా 2027లోపు తైవాన్‌పై చైనా దాడి అంటూ ప్రచారం చేస్తున్నారు. కానీ చైనా మాత్రం దానిపై స్పందించడంలేదు.

# నైజీరియాలో వరదలుః123 మంది మృతి



**అబుజ :** నైజీరియాలో వరదలవల్ల 123 మంది మరణించారు. ఉత్తర నైజీరియాలో ఆకస్మిక వాతావరణ మార్పులవల్ల శుక్రవారం తెల్లవారు జామునుండీ ఆకస్మికంగా కురిసిన భారీవర్షాలతో ఆ ప్రాంతమంతా నీరు వరదలెత్తింది. మార్కెట్ ప్రాంతం మునిగిపోవడంతో రైతుల సరుకులన్నీ కొట్టుకుపోయాయి. ఈ వరదలకు 123 మంది మరణించినట్లు అధికారులు చెప్పారు. ఈ మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. రైతులు తమ సరుకులను వ్యాపారులకు విక్రయించేందుకు దక్షిణ నైజీరియా నుండి ఉత్తర నైజీరియా ప్రాంతానికి తీసుకువస్తారు.సోషల్‌మీడియాలో ఈ భారీ వర్షాలకు సంబంధించిన వీడియోలో, వార్తలు వరదలా వస్తున్నాయి. ప్రజలు ఒకరికి మరొకరు సహాయం చేసుకుంటున్న దృశ్యాలు వీడియోల్లో పోస్టింగులు చేశారు. ''మేం అందరం చాలా ఆస్తులు పోగొట్టుకున్నాం, ప్రాణాలు పోగొట్టుకున్నాం, మా రైతు ఉత్పత్తులన్నీ నాశనమయ్యాయి, తీవ్రంగా నష్టపోయాం అని మోక్వా నివాసి కజీమ్ మహ్మద్ వాపోయారు. మోక్వాలో వ్యాపారులందరూ ఉంటారు. అక్కడే రైతుల ఆహార పంటలను కొనుగోలు చేస్తారు.

## యుద్ధ విమానం కోల్పోయాం
(మొదటి పేజీ తరువాయి)

భారత్ యుద్ధ విమానాలను కోల్పోయిందా?'' అని బ్లూంబెర్గ్ ఇంటర్వ్యూలో చౌహాన్‌ను ప్రశ్నించినప్పుడు ఆయన పైవిధంగా స్పందించారు. 'ఆపరేషన్ సిందూర్'లో ఆరు భారత్ యుద్ధ విమానాలను కూల్చివేశామని పాకిస్థాన్ చేస్తున్న ప్రచారం ''పూర్తి అబద్ధం'' అన్నారు. ఐతే ఎన్ని యుద్ధ విమానాలను భారత్ కోల్పోయిందన్న సంఖ్యను చెప్పడానికి ఆయన తిరస్కరించారు. పాకిస్థాన్ చెబుతున్న సంఖ్యను ఆయన ఖండించారు. ఎందుకు యుద్ధవిమానాన్ని నష్టపోయామన్న విషయమే మనకు చాలా ముఖ్యమైన విషయమని అన్నారు.భారతదేశం తన యుద్ధవ్యూహాలను మెరుగుపరచుకోవాలి, తిరిగి పాకిస్థాన్‌ను దెబ్బతీయాల్సిన అవసరం ఉందని సిడిఎస్ జనరల్ చౌహాన్ అన్నారు. ఇంతకుముందు కూడా భారత వైమానికదళ డైరెక్టర్ జనరల్ (ఎయిర్ ఆపరేషన్స్) ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి మాట్లాడుతూ, ''నష్టాలు అనేవి పోరాటంలో ఒక భాగం, ఐతే మన వైమానికదళ పైలట్లు అందరూ సురక్షితంగా దేశానికి తిరిగి వచ్చారు'' అని మే 11వ తేదీన మీడియావద్ద వ్యాఖ్యానించారు. చౌహాన్ మాటలను పాకిస్థాన్,చైనా మీడియా వక్రీకరించి ప్రచారం చేయడం ప్రారంభించింది. లెక్కకు మించినన్ని యుద్ధ విమానాలను కోల్పోయినట్లు భారతదేశ ఉన్నత సైనికాధికారి బ్లూంబెర్గ్ ఇంటర్వ్యూలో మొదటిసారి అంగీకరించారని చైనా మీడియా ప్రకటించింది. పాకిస్థాన్ మీడియా చేస్తున్న ప్రచారం ప్రకారం, ఫ్రాన్స్‌కు చెందిన మూడు అడ్వాన్స్‌డ్ రాఫెల్ విమానాలతోపాటు ఆరు యుద్ధవిమానాలను పాకిస్థాన్ కూల్చివేసిందని డాన్ పత్రిక గడచిన ఇరవై రోజులుగా ప్రచారం చేస్తోంది. దీంతో భారతదేశంలో 'డాన్ పత్రిక' ఛానల్ కార్యకలాపాలను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఇప్పుడూ బ్లూంబెర్గ్ ఇంటర్వ్యూలో చౌహాన్ చేసిన వ్యాఖ్యలను కూడా దాయాది మీడియా, దాని మిత్రదేశాలు వక్రీకరించడం ప్రారంభించాయి.

## నిజాలు రాబట్టేందుకు సమీక్షా కమిటీ
(మొదటి పేజీ తరువాయి)

తర్వాత కమిటీ తన నివేదికను సమర్పించిందని గుర్తుచేశారు. 2000 సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీన ఈ కమిటీ కార్గిల్ నష్టం నివేదికను పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రవేశపెట్టిందని, ఇప్పుడు కూడా అదే తరహాలో మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐతే'ద ఎకనామిస్ట్' డిఫెన్స్ ఎడిటర్ శశాంక్ జోషి ఈ రాజకీయ విమర్శలపై వ్యాఖ్యానిస్తూ, సరైన ముందస్తు ఏర్పాట్లు లేకపోవడంవల్ల భారత వైమానిక దళం బహుశా ఆపరేషన్ సిందూర్ మొదటిరోజు రాత్రే ఒక యుద్ధ విమానాన్ని కోల్పోయి ఉంటుందని అన్నారు. పాశ్చాత్యదేశాల విశ్లేషణకు అనుగుణంగా జోషీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ చేస్తూ, చౌహాన్‌తో ఏకీభవించారు. మొదట జరిగిన నష్టాలపై సమీక్ష జరగాలన్నారు.

**ప్రభుత్వం జవాబుదారీ వహించాలి**

కాంగ్రెస్ నాయకుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి సిడిఎస్ ప్రధానాధిపతి చౌహాన్ లక్ష్యంగా విమర్శలు చేశారు. ఈ యుద్ధ విమానం సైనిక చర్య సమయంలో కూలిపోయిందా? లేక ఆపరేషన్ సిందూర్ నిర్దేశిత దాడుల సందర్భంగా కూలిపోయిందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ విషయంలో జవాబుదారీ వహించాలన్నారు. ఎంతో బాహాటంగా దాపరికం లేకుండా ప్రభుత్వం నిజాలు చెప్పాలన్నారు. ''ఇది దేశభక్తికి సంబంధించిన విషయం కాదు, మేం అంతకంటే దేశభక్తులం, దేశంకోసం, దేశ సమగ్రతకోసం గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసింది, ఎన్నో కష్టాలు పడింది, ఇప్పుడు చెబుతున్న విషయాలు దిగ్భ్రాంతికరం గా ఉన్నాయి, ఇలాంటివాళ్ళు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు'' అని ఉత్తమ్ కుమార్‌రె డ్డి విమర్శించారు. మన సైన్యం ఎంతో గొప్ప సేవలు చేసిందని, వారి కృషి గర్వకారణమని, వారికి శాల్యూట్ చేస్తూ కాంగ్రెస్ అభినందనలు తెలియజేస్తోందన్నారు.

## ఉగ్ర కదలికలు (మొదటి పేజీ తరువాయి)

సయ్యద్ సమీర్‌తో పరిచయం ఏర్పడింది. కాగా, సమీర్ ద్వారా వరంగల్ కు చెందిన పరహాన్ మొయినుద్దీన్ కు కూడా పరిచయం ఏర్పడిందన్నారు. వీరంతా జిహాది చర్యల్లో భాగంగా అవసరమైతే ప్రాణ త్యాగం చేయాలని నిర్ణయించుకున్నట్లు ఎన్ఐఏ తనిఖీల్లో వెలుగు చూసినట్లు సమాచారం. అయితే ఎన్ఐఏ దర్యాప్తులో వరంగల్‌కు చెందిన పరహన్ మొయినుద్దీన్, వరంగల్‌కు చెందిన మరో ఇద్దరి పేరు చెప్పాడని, వారి ఇళ్లలో కూడా శుక్రవారం తనిఖీలు చేసినట్టు సమాచారం.

## దేశం ఐక్యం
(మొదటి పేజీ తరువాయి)

బలంగా ఉంచే రాజ్యాంగాన్ని మనం దేశానికి ఇచ్చామని మాత్రం నేను మీకు చెప్పదలచానని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగం కారణంగా భారతదేశం అభివృద్ధిపథంలో పయనించిందని గవాయ్ చెప్పారు.'ఈ రోజు మనం మన పొరుగు దేశాల పరిస్థితి చూస్తున్నాం. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం అభివృద్ధిపథం వైపు ప్రయాణిస్తుందన్నది వాస్తవం. ఈ ఘనత రాజ్యాంగానికి మాత్రమే దక్కాలి' అని సిజెఐ ఆకాంక్షించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75ఏళ్ల ప్రస్థానం సాగిస్తున్న నేపథ్యంలో శాసనసభ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థలు సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని తీసుకురావడానికి అవి చాలా దోహదపడ్డాయని గవాయ్ చెప్పారు. 'న్యాయం అవసరమైన చివరి పౌర దేశాన్ని చేరుకోవడం మన ప్రాథమిక కర్తవ్యం. అది శాసనవ్యవస్థ అయినా, కార్యనిర్వాహక వ్యవస్థ అయినా, న్యాయవ్యవస్థ అయినా ప్రతీ ఒక్కరూ ఆ పౌరుడని చేరుకోవాల్సిందే' అని సిజెఐ సభను ఉద్దేశించి అన్నారు. భూసంస్కరణల గురించి ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. భూస్వాముల నుంచి భూమిని తీసుకుని ఆ భూమిని భూమిలేని వ్యక్తులకు ఇవ్వడమే భూసంస్కరణల ముఖ్యోద్దేశమని బిఆర్.గవాయ్ వివరించారు. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రెండూ రాజ్యాంగానికి ఆత్మ అని ఈ ధర్మాసనం కూడా చెప్పిందని సిజెఐ చెప్పారు. ఈ రెండు రాజ్యాంగం అనే బంగారు రథానికి రెండు చక్రాలు. మీరు ఈ రథంలోని ఒక చక్రాన్ని ఆపివేస్తే మొత్తం రథమే ఆగిపోతుంది అని గవాయ్ తెలియజేవారు. ఈ రోజు అలహాబాద్ హైకోర్టు మొత్తం దేశానికే ఒక మంచి రోల్ మోడల్‌గా నిలిచిందని, జడ్జిలు తమ 12 బంగళాలను న్యాయవాద సోదరుల బార్ కోసం (కాంప్లెక్స్ నిర్మాణం) ఖాళీ చేసి ఆదర్శంగా ని లిచారని సిజెఐ ప్రస్తుతించారు.

## కెసిఆర్‌కు కళ్లలాంటివి
(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని తన నివాసం పక్కనే 'తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని' కవిత శనివారం ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన తర్వాత అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం కార్యాలయంలో మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ గోదావరి జలాల్లో తెలంగాణకు 200 టిఎంసిల హక్కు ఉండాలనే కెసిఆర్ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని వివరించారు. ప్రతీ ఏడాది 20 లక్షల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా నీళ్లు అందించినందుకు కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారా ? , లేదా కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసినందుకు నోటీసులు ఇచ్చారా ? అని ఆమె ప్రశ్నించారు. అది కాళేశ్వరం కమిషనా..?, లేదా కాంగ్రెస్ కమిషనా ? అని అన్నారు. కెసిఆర్‌పై ఈగ వాలినా ఊరుకోబోమని హెచ్చరించారు. జై తెలంగాణ అని నినాదం చేయని రేవంత్ రెడ్డి సిఎం కావడం మన ఖర్మ అని, కనీసం ఇప్పటికైనా జూన్ 2న జై తెలంగాణ అని అనాలని, అమరులకు నివాళులర్పించాలని డిమాండ్ చేశారు. జై తెలంగాణ అనని వారికి, అమర వీరులకు నివాళులు అర్పించని వారు సిఎం కుర్చీలో కూర్చునే అర్హత లేదన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న పథకానికి 'రాజీవ్ యువ వికాసం' అని రాజీవ్ పేరు ఎందుకు పెట్టారని, రాజీవ్‌గాంధీకి తెలంగాణకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజీవ్ వికాసం పేరును మార్చి, అమరులైన శ్రీకాంత చారి లేదా యాది రెడ్డి లేదా ప్రజాకవి కాళోజి, మాజీ ప్రధాని పివి.నరసింహా రావు పేరు పెట్టాలని కవిత సూచించారు. తెలంగాణ వాటాగా ఉన్న నీటిని ఎపి తరలించుకుపోతుంటే సిఎం రేవంత్ రెడ్డి మాట్లడని పరిస్థితి ఏర్పడిందని, ఎపి సిఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టును నిర్మించి నీళ్లు తరలించాలనుకుంటున్నా తెలంగాణ సిఎం కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. సిఎం ఎందుకు అంత బలహీనంగా ఉన్నారన్నారు. పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డిని కవిత ప్రశ్నించారు. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టాలని ప్రతిపాదించారని, కానీ ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్ఛంపల్లి నుంచి చేపడుతామని చెప్పిందని కవిత వివరించారు. ప్రస్తుతం పోలవరం నుంచి 200 టిఎంసిల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గోదావరి నీళ్లను తెలంగాణకు శాశ్వతంగా దూరంకానున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి విషయంలో జూన్ 2న సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని,అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని సిఎం డిమాండ్ చేయాలని సూచించారు.

**బిసి బిల్లును డీఫ్రీడ్జ్‌లో పెడితే బిజెపికి సెగ తప్పదు**

బిసి బిల్లును డీ ఫ్రిడ్జ్‌లో పెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తే బిజెపికి సెగ తాకే విధంగా, రైల్ రోకో వంటి కార్యక్రమాలను చేడుతామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు,మహిళలకు రూ 2500, ఆడపిల్లలకు స్కూటీలు సాధించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని తెలిపారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్‌ను చూపిస్తామని హెచ్చరించారు.

## నిర్ణయం పునఃసమీక్షించాలి
(మొదటి పేజీ తరువాయి)

పాటు దీర్ఘకాలికంగా దేశీయ ఆయిల్ పామ్ సాగుపై తీవ్రం ప్రభావం చూపనుందన్నారు. ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రాలు, రైతులకు తగిన ప్రోత్సాహం కల్పిస్తూ, ఈ పంట సాగు పెంపుపై దృష్టిసారిస్తున్న తరుణంలో, కేంద్ర నిర్ణయం రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా ఉందని మంత్రి తెలిపారు. ఈ దిగుమతి సుంకం తగ్గింపు వల్ల కొత్తగా ఆయిల్ పామ్ సాగు ప్రారంభించాలనుకునే రైతులు వెనక్కి తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం స్వదేశీ నూనె ఉత్పత్తిని ప్రోత్సహించాలన్నా కేంద్ర రాష్ట్రాల ఉద్దేశ్యాలకు పూర్తిగా విరుద్ధమని ఉంటుం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పాము సాగును ప్రోత్సహించేందుకు పలు ప్రోత్సాహక కార్యక్రమాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెద్ద ఎత్తున రైతుల అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిగుమతి సుంకాన్ని తగ్గించాలన్న నిర్ణయంతో ఈ కార్యక్రమాలన్ని వృధా అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో,క్రూడ్ పామ్ ఆయిల్ పై దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు. ఈ అంశంపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కు సైతం లేఖ రాశామని తెలిపారు. రైతుల ఆకాంక్షలు నిలబెట్టడంకోసం, దేశ ఆత్మనిర్భరత లక్ష్యాన్ని సాధించేందుకు ఆయిల్ పామ్ వంటి నూనె పంటల ఉత్పత్తికి భరోసా కల్పించే విధానాలను అమలు చేయాలని కేంద్రాన్ని కోరామని మంత్రి తెలిపారు.

**ఆయిల్ పామ్‌ను విత్తన చట్టంలోకి తేవాలి : ఉమామహేశ్వర రెడ్డి**

ఆయిల్ పామ్ మొక్కలను కూడా విత్తన చట్టం పరిధిలోకి తీసుకురావాలని తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షులు ఉమామహేశ్వర రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. టిజి ఆయిల్ ఫెడ్ అన్ని కంపెని కార్యకలాపాలపై, అక్రమ ఆర్థిక లావాదేవీలపై కేంద్రప్రభుత్వ సంస్థలతో విచారణ జరిపించాలని కోరారు. 2016 నుంచి 2023 కాలంలో సరఫరా చేసిన విత్తనాల వల్ల నష్టపోయిన ఆయిల్‌పామ్ రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం పలువురు రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ కొంతమంది అధికారులు ఆయిల్ ఫెడ్‌ను నిర్వీర్యం చేసి నష్టాలపాలు చేసే కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్ పరిశ్రమ అభివృద్ధి, ఆయిల్ పామ్ రైతుల శ్రేయస్సు కోసం తమ సమాఖ్య కృషి చేస్తున్నదన్నారు. ఆయిల్ పామ్ విస్తరణకు ఆయిల్ ఫెడ్ కొత్త విత్తనాలతో నర్సరీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ వ్యవస్థను టిజి ఆయిల్ ఫెడ్ నర్సరీల నుంచి తొలగించాలన్నారు. ఆయిల్ పామ్ రిఫైనరీని భద్రాద్రి కొత్తగూడం జిల్లాలోనే నిర్మించాలని, ఆయిల్ పామ్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. 2016–2022 ఆయిల్ ఫెడ్ నర్సరీలలో కాంట్రాక్ట్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని కర్లింగ్ మొక్కలను రైతుల తోటలోకి రావటానికి కారణమైన కాంట్రాక్టర్, అధికారులపై విచారణ చేపట్టాలని, వారిని ఆయిల్ ఫెడ్ నుంచి తొలగించడంతో పాటు రైతులకు వాటిల్లిన నష్టాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

## తీవ్ర ప్రభావం (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో రైతులు పామ్ ఆయిల్ సాగు చేయడానికి ముందుకొస్తున్న తరుణంలో కేంద్రం పామ్ ఆయిల్ దిగుమతిపై సుంకం తగ్గించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఇది దిగుమతి చేసుకునే పరిశ్రమలకు మాత్రం లాభం చేరుకుర్చనుందని తెలిపారు. ఒకపక్కన రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ, సబ్సీడీలు ఇస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం పిడుగులాంటి ఈ నిర్ణయం పామ్ ఆయిల్ తోటల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం గతంలో కూడా మల్టీనేషనల్ కంపెనీలకు దిగుమతి సుంకం తగ్గించి కంపెనీలకు లాభాలు చేకూర్చిపెట్టింది. ఈ దిగుమతి, ఎగుమతి పాలసీ.. పామ్ ఆయిల్ తోటల వ్యవసాయంపైన ప్రభావం పడకుండా ఉండాలి అంటే .. కేంద్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి, రైతులను కూడా భాగసామ్యం చేసి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు.

## విజృంభణ (మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. మహారాష్ట్ర, ఢిల్లీ తరువాత స్థానంలో ఉన్నాయి. నాలుగు రోజుల్లోనే కేసులు వేగంగా పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. దేశంలో మే 26న మొత్తం 1,010 కేసులు నమోదవగా... మే 30 నాటికి మొత్తం 2,710కు పెరిగినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ శనివారం వెల్లడించింది. కరోనా కొత్త వేరియంట్లపై భయాందోళనలు అవసరం లేదని, ఇన్ఫెక్షన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 2,710గా ఉండగా, కేరళలో అత్యధికంగా 1,147 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో 424, ఢిల్లీలో 294, గుజరాత్‌లో 223, తమిళనాడులో 148, కర్నాటకలో 148, పశ్చిమబెంగాల్‌లో 116, రాజస్థాన్‌లో 51 కేసులు, ఉత్తరప్రదేశ్‌లో 42, పుదుచ్చేరిలో 25, హర్యానాలో 20, ఆంధ్రప్రదేశ్‌లో 16, మధ్యప్రదేశ్‌లో 10, గోవాలో 7, ఒడిశా, పంజాబ్, జమ్మూకశ్మీర్‌లో నాలుగు చొప్పున కేసులు నమోదయ్యాయి. తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాలలో మూడు కేసుల వంతున నమోదవగా... మిజోరం, అసోంలో చెరో ఇద్దరు ఈ ఇన్ఫెక్షన్ బారిన పడినట్లు తెలుస్తోంది. మే 25తో ముగిసిన వారంలో ఇన్ఫెక్షన్లు ఐదు రెట్లు పెరిగి 1,000 మార్క్‌ను దాటినట్లు వెల్లడించింది. మరోవైపు వైరస్ వ్యాప్తితోపాటు మరణాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. గత 24 గంటల వ్యవధిలో ఏడు మరణాలు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. మహారాష్ట్రలో రెండు మరణాలు సంభవించగా, ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక్కొక్కటి చొప్పున మరణాలు నమోదయ్యాయి.

## 20 కోడెలు మృతి (మొదటి పేజీ తరువాయి)

ఆకస్మికంగా గోశాలను తనిఖీ చేశారు. కోడెల స్థితిగతులను చూసిన వెంటనే వెటర్నరీ వైద్య బృందాన్ని గోశాలకు తరలించి, మిగిలిన గోవులకు తగిన వైద్యం అందింస్తున్నట్లు కలెక్టర్ ఆదేశించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన మొక్కు కోడె మోక్కు భక్తులు చెల్లించే కోడెలకే ఇలాంటి దుస్థితి రావడం బాధాకరం. దీనిపై అధికార స్థాయిలో పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం, అని పేర్కొన్నారు. కోడెల మరణాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. గోశాలలో మౌలిక సదుపాయాల లేమి, పోషకాహార లోపం వంటి అంశాలపై అధికారులను నిలదీశారు. విచారణ నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం గోశాలలో పరిస్థితి ఉద్విగ్నంగా ఉండగా భక్తులు ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఏర్పాటుకు కమిటీ (మొదటి పేజీ తరువాయి)

పరిశీలించాలన్నారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను సిఎం పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ఖరారు చేయనున్నట్లు సిఎం చెప్పారు. సమావేశంలో సిఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్‌రాజ్, అజిత్‌రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, హెచ్ఎండిఎ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎనిమిది మంది మావోయిస్టుల లొంగుబాటు

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి : ములుగు జిల్లాలో ఎనిమిది మంది మావోయిస్టులు శుక్రవారం ములుగు జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీష్ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. శాంతి మార్గాన్ని ఆశ్రయించిన వారికి ములుగు ఎస్‌పి తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25వేలు చెల్లించి ప్రభుత్వ పునరావాస పథకాల ద్వారా భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పోరు కన్నా... ఊరు మిన్న అనే పేరుతో లొంగిన మావోయిస్టులకు ఆర్థికసాయం అందిస్తుందని,



మరల తమ ఊరికి వెళ్ళాలని ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు.


తెలంగాణ ప్రభుత్వము,
రెవెన్యూ (భూ సేకరణ)శాఖ
ఫారం-6, (ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016 లోని చాప్టర్ III ఎ లోని 10ఎ అనుసరించి) (చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు) (నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం. 29/2025/ . తేది: 24.05.2025
జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి
ఫైల్ నెం. G/2414/2025. తేది: 24.05.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA), యాదాద్రి భువనగిరి
ఫైల్ నెం. A/15/2025, తేది: .05.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవల్లి గ్రామములో విస్తీర్ణం ఎ.16.21 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 108 I & CAD (LA.R&R/A2) Department, Dt:31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాది కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం- 2013 లోని చాప్టర్-11 (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్ - III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి ప్రాజెక్టు పునరావాసం మరియు పునరుపాది కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్ గా) నియమించనైనది.

కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం వీరవల్లి గ్రామములో విస్తీర్ణం ఎ.16.21 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా : యాదాద్రి భువనగిరి మండలం : భువనగిరి గ్రామం : వీరవల్లి

| సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం) | [illegible] |
|---|---|---|---|---|
| 286 ఖుష్కి/ పట్టా 0.24 | సామ పార్వతి భర్త సత్యనారాయణ రెడ్డి | సామ పార్వతి భర్త సత్యనారాయణ రెడ్డి | 0-03 | - |
| | కుండే శ్రీశైలం తండ్రి యాదగిరి | కుండే శ్రీశైలం తండ్రి యాదగిరి | 0-02 | - |
| | జీడిమెట్ల రాజీ రెడ్డి తండ్రి నాగి రెడ్డి | జీడిమెట్ల రాజీ రెడ్డి తండ్రి నాగి రెడ్డి | 0-05 1/4 | - |
| | తోటకురి చంద్రకళ భర్త నర్సయ్య | తోటకూరి చంద్రకళ భర్త నర్సయ్య | 0-04 1/2 | - |
| | జీడిమెట్ల ఆనంద్ రెడ్డి తండ్రి నాగి రెడ్డి | జీడిమెట్ల ఆనంద్ రెడ్డి తండ్రి నాగి రెడ్డి | 0-07 1/4 | - |
| | కుండే అనిత భర్త శ్రీరాములు | కుండే అనిత భర్త శ్రీరాములు | 0.02 | - |
| 287 ఖుష్కి/ లావుని పట్టా 0.13 | మొగిలిపాక చంద్రయ్య తండ్రి ముత్తయ్య | కుండే శ్రీశైలం తండ్రి యాదగిరి | 0.01 | - |
| | మొగిలిపాక చంద్రయ్య తండ్రి ముత్తయ్య | మొగిలిపాక చంద్రయ్య తండ్రి ముత్తయ్య | 0-01 1/4 | - |
| | మొగిలిపాక శ్రీకాంత్ తండ్రి యాదయ్య | మొగిలిపాక శ్రీకాంత్ తండ్రి యాదయ్య | 0-01 1/4 | - |
| | నల్ల బాలయ్య తండ్రి జమ్మయ్య | నల్ల బాలయ్య తండ్రి జమ్మయ్య | 0-01 1/4 | - |
| | మొగిలిపాక యాదయ్య తండ్రి లక్ష్మయ్య | మొగిలిపాక యాదయ్య తండ్రి లక్ష్మయ్య | 0-01 1/4 | - |
| | మొగిలిపాక కిష్టయ్య తండ్రి లక్ష్మయ్య | మొగిలిపాక కిష్టయ్య తండ్రి లక్ష్మయ్య | 0-04 | - |
| | మహమ్మద్ మహబూబ్ అలీ తండ్రి జమాల్ సబ్ | మహమ్మద్ మహబూబ్ అలీ తండ్రి జమాల్ సబ్ | 0-03 | - |
| 305 ఖుష్కి/ పట్టా 0.18 | రాచమళ్ళ లక్ష్మి భర్త రాములు | రాచమళ్ళ లక్ష్మి భర్త రాములు | 0-10 | - |
| | రాచమళ్ళ లక్ష్మి భర్త రాములు | కంచు లక్ష్మయ్య తండ్రి నర్సయ్య | 0-08 | - |
| 306 ఖుష్కి/ పట్టా 0.13 | యాట సరోజిని భర్త రవి | యాట సరోజిని భర్త రవి | 0-06 1/4 | - |
| | యాట లక్ష్మి భర్త నాగరాజు | యాట లక్ష్మి భర్త నాగరాజు | | |
| | కంచి లక్ష్మయ్య తండ్రి నర్సయ్య | కంచి లక్ష్మయ్య తండ్రి నర్సయ్య | 0-06 3/4 | - |
| 353 ఖుష్కి/ పట్టా 1.05 | పాల్వంచ పద్మభర్త విట్టల్ | పాల్వంచ పద్మభర్త విట్టల్ | 0-16 1/4 | - |
| | బండారు స్వప్న భర్త స్వామి | బండారు స్వప్న భర్త స్వామి | 0-06 1/4 | - |
| | తలసాని రవీందర్ యాదవ్ తండ్రి వేంకటేశం యాదవ్ | తలసాని రవీందర్ యాదవ్ తండ్రి వేంకటేశం యాదవ్ | 0-05 | - |
| | బండారు పెంటమ్మ భర్త భిక్షపతి | బండారు పెంటమ్మ భర్త భిక్షపతి | 0-03 | - |
| | రేపాక రాజమ్మ భర్త సాయిలు | రేపాక రాజమ్మ భర్త సాయిలు | 0-01 | - |
| | నల్ల ఎల్లమ్మ భర్త నర్సింహా | నల్ల ఎల్లమ్మ భర్త నర్సింహా | 0-00 1/2 | - |
| | వలబోజు వెంకటేష్ తండ్రి సిద్ధయ్య | వలబోజు వెంకటేష్ తండ్రి సిద్ధయ్య | 0-07 | - |
| | కర్తాల శ్రీనివాస్ తండ్రి యాదగిరి | బుగ్గ ఇలయ్య తండ్రి బుచ్చయ్య | 0-03 | - |
| | రేపాక స్వామి తండ్రి నర్సింహా | యాట సరోజిని భర్త రవి | 0-03 | - |
| 355 ఖుష్కి/ పట్టా 0.32 | బుగ్గ అయిలయ్య తండ్రి బుచ్చయ్య | బుగ్గ అయిలయ్య తండ్రి బుచ్చయ్య | 0-13 | - |
| | బుగ్గ భిక్షపతి తండ్రి నర్సయ్య | బుగ్గ భిక్షపతి తండ్రి నర్సయ్య | 0-05 | - |
| | మంగ ప్రభంద భర్త ఉపేందర్ | మంగ ప్రభంద భర్త ఉపేందర్ | 0-05 1/2 | - |
| | బుగ్గ మనెమ్మ భర్త సత్తయ్య | బుగ్గ మనెమ్మ భర్త సత్తయ్య | 0-05 | - |
| | బుగ్గ రాములు తండ్రి ధర్మయ్య | బుగ్గ రాములు తండ్రి ధర్మయ్య | 0-02 | - |
| | బుగ్గ శ్రీనివాస్ తండ్రి ఎల్లయ్య | బుగ్గ శ్రీనివాస్ తండ్రి ఎల్లయ్య | 0-01 1/2 | - |
| 359 మొష్కి / పట్టా 0.07 | కంచి నవీన్ తండ్రి మల్లయ్య | కంచి నవీన్ తండ్రి మల్లయ్య | 0-04 1/4 | - |
| | కంచి పద్మ భర్త లక్ష్మయ్య | కంచి పద్మ భర్త లక్ష్మయ్య | 0-02 3/4 | - |
| 373 ఖుష్కి/ లావుని పట్టా 0.33 | చందుపట్ల స్వామి తండ్రి శివయ్య | నల్ల రామయ్య తండ్రి జమ్మయ్య | 0-02 | - |
| | చందుపట్ల స్వామి తండ్రి శివయ్య | నల్ల రమేష్ తండ్రి ఇస్తారి | 0-05 1/2 | - |
| | చందుపట్ల స్వామి తండ్రి శివయ్య | చందుపట్ల స్వామి తండ్రి శివయ్య | 0-09 1/2 | - |
| | చందుపట్ల భుచక్రం తండ్రి శివయ్య | చందుపట్ల భుచక్రం తండ్రి శివయ్య | 0-16 | - |
| 374 ఖుష్కి/ లావుని పట్టా 1.15 | నల్ల యెల్లయ్య తండ్రి ఇస్తారి | నల్ల శంకరయ్య తండ్రి ఎల్లయ్య | 0-10 | - |
| | చిట్టిగొల్ల గౌరయ్య తండ్రి పెంటయ్య | బుగ్గ పరందన్న తండ్రి బుచ్చయ్య | 0-07 | - |
| | నల్ల యెల్లయ్య తండ్రి ఇస్తారి | నల్ల యెల్లయ్య తండ్రి ఇస్తారి | 0-38 | - |
| 375 ఖుష్కి / లావుని పట్టా 1.26 | నల్ల రమేష్ తండ్రి సోమయ్య | నల్ల రమేష్ తండ్రి సోమయ్య | 0-30 | - |
| | నల్ల జహంగీర్ తండ్రి నర్సయ్య | నల్ల జహంగీర్ తండ్రి నర్సయ్య | 0-36 | - |
| | నల్ల పెంటయ్య తండ్రి నర్సయ్య | నల్ల పెంటయ్య తండ్రి నర్సయ్య | | |
| | నల్ల యాదగిరి తండ్రి నర్సయ్య | నల్ల యాదగిరి తండ్రి నర్సయ్య | | |
| 378 ఖుష్కి/ పట్టా 0.17 | బుగ్గ పరందమ తండ్రి బుచ్చయ్య | బుగ్గ పరందమ తండ్రి బుచ్చయ్య | 0-17 | - |
| 385 ఖుష్కి/ పట్టా 0.14 | కొమ్మిడి వెంకట్ రెడ్డి తండ్రి నర్సి రెడ్డి | కొమ్మిడి వెంకట్ రెడ్డి తండ్రి నర్సి రెడ్డి | 0-14 | - |
| 386 ఖుష్కి/ పట్టా 0.09 | కందాడి మల్లరెడ్డి తండ్రి చంద్రరెడ్డి | కందాడి మల్లరెడ్డి తండ్రి చంద్రరెడ్డి | 0-09 | - |
| 388 ఖుష్కి/పట్టా 0.31 | కందాడి మల్లరెడ్డి తండ్రి చంద్రరెడ్డి | కందాడి మల్లరెడ్డి తండ్రి చంద్రరెడ్డి | 0-16 | - |
| | కీసరి ఉపేందర్ రెడ్డి రవీందర్ తండ్రి | కీసరి ఉపేందర్ రెడ్డి రవీందర్ తండ్రి | 0-11 | - |
| | పీసరి సావిత్రి భర్త రవీందర్ రెడ్డి | పల్లెపటి నర్సయ్య తండ్రి కిష్టయ్య | 0-04 | - |
| 390 ఖుష్కి/ పట్టా 0.01 | కందడి భుచ్చిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి | కందడి భుచ్చిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి | 0-00 1/2 | - |
| | పల్లెపటి పద్మావతి భర్త నర్సింహా | పల్లెపటి పద్మావతి భర్త నర్సింహా | 0-00 1/2 | - |
| 392 ఖుష్కి/ పట్టా 0.17 | కందడి బుచ్చిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి | కందడి బుచ్చిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి | 0-03 1/2 | - |
| | సోలిపురం ముత్యంరెడ్డి తండ్రి హన్మరెడ్డి | సోలిపురం ముత్యంరెడ్డి తండ్రి హన్మరెడ్డి | 0-13 1/2 | - |
| 407 ఖుష్కి/ లావుని పట్టా 6.26 | బీరకాయల నర్సయ్య తండ్రి బాలయ్య | జమ్ముల భిక్షపతి | 0-32 | - |
| | మారబోయిన పద్మ భర్త యాదగిరి | మారబోయిన పద్మ భర్త యాదగిరి | 0-20 | - |
| | కాలువ | కాలువ | 05-14 | - |
| | | మొత్తం | 16-21 | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్నిపొందే హక్కు ( తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియుప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/ తాకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), ఆర్ అండ్ ఆర్, విభాగము-2 ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి
DIPR RO NO.178/LA/PP/Advt/Pub/2025-26


## బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతే..
# దళితులు, మైనారిటీలపై దాడులు

జనసేవాదళ్ శిక్షణ ముగింపు సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సత్య సాయి గ్రామర్ హైస్కూల్లో ఈనెల 26వ తేదీ నుండి 31వరకు తెలంగాణ రాష్ట్ర జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమాలు ఆరు రోజులపాటు నిర్వహించారు. ఆదివారం జనసేవ దళ్ శిక్షణ శిబిరం ముగింపు సభ సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల మాకుల జంగయ్య అధ్యక్షతన చేవెళ్ల మండల కేంద్రం లోని శంకర్పల్లి చౌరస్తాలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నేతృతంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ఆపి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని, మతం పేరుతో మతోన్మాద మూకలు చెలరేగిపోతు ప్రజలను నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతూ ఉంటే భారతదేశంలో మాత్రం దానికి భిన్నంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నానాటికి పెరుగుతున్నాయని, దీని ద్వారా పరోక్షంగా ప్రజలపై పన్నుల భారం పడుతుందని, పెరుగుతున్న అధిక ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని హేమంతరావు డిమాండ్ చేశారు. సభకు ముందుగా ప్రధాన రహదారుల వెంట సేవాదళ్ కార్యకర్తలు వారి కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.రామస్వామి, పానుగంటి పర్వతాలు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం, టి.రామకృష్ణ, ఆర్ యాదగిరి, జనసేవ దళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్, కో కన్వీనర్ అనిల్ కుమార్, ఇన్‌స్ట్రక్టర్ మురళిమోహన్, కర్ణ కుమార్, ఎఐటియూసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, చందు యాదవ్, సిపిఐ మండలాల కార్యదర్శులు ఏం.సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, నక్కలి జంగయ్య, నర్రగిరి, స్వామి, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మీనాక్షి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, రైతు సంఘం నాయకులు సుభాన్ రెడ్డి, సుధాకర్ గౌడ్, ఎఐటియూసి మండలాధ్యక్షుడు శివ, బాబురావు, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జనసేవాదళ్ కీలకం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ప్రజాపక్షం/హైదరాబాద్ : జనసేవా దళ్ ద్వారా సుశిక్షితులైన కార్యకర్తలంతా సమాజ సేవలో క్రియాశీలక పాత్ర పోషించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. ఈ నెల 26 నుండి 31 వరకు చేవెళ్లలో జరిగిన జనసేవా దళ్ రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాలు విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో శనివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో రాష్ట్రస్థాయి జనసేవాదళ్ శిక్షకులు రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ జనసేవ దళ్ శిక్షణ శిబిరాలు జిల్లాస్థాయిలో కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జనసేవాదళ్ శిబిరంలో శిక్షణ పొందిన పలువురిని కూనంనేని అభినందించారు. ఈ కార్యక్రమంలో మారుపాక అనిల్ కుమార్, గోశిక మోహన్ ఉన్నారు.

# సింగరేణిని ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తాం



జిఎం కార్యాలయం, వర్క్‌షాపు ప్రారంభించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వందేళ్లకుపైగా సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు సంబంధించిన నివేదికలు రాగానే కార్యచరణ చేపడతామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కొత్తగూడెంలో శనివారం సింగరేణి జిఎం కార్యాలయం, వర్క్‌షాపును ఆయన స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే రామ్‌దాస్ నాయక్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సింగరేణి సిఎండి బలరామ్‌తో కలిసి ప్రారంభించారు. ముందుగా ఆ పరిసరాల్లో భట్టి, కూనంనేని తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల రక్షణ, భద్రతే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని. సింగరేణి సంస్థ కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.1 కోటి ప్రమాదబీమాతో పాటు కారుణ్య నియామకం చేపడుతున్నామని, ఇది దేశ చరిత్రలోనే అరుదైన రికార్డు అన్నారు. సంస్థను పలు రంగాల్లో విస్తరించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని, ఇందుకు అవసమైన సమాచార, సూచనల కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ నివేదికలు రాగానే యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ చేపడతామన్నారు. రానున్న 30 ఏళ్లలో కొత్త గనుల ద్వారా 22 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ మనుగడ సాగించేందుకు కార్మికులు చేస్తున్న కష్టాన్ని చూస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక పక్షపాతి అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్‌వి సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, సెంట్రల్ సెక్రెటరీ వంగా వెంకట్, ఐఎన్‌టియుసి జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, గడిపల్లి కవిత, సింగరేణి ఉద్యోగులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆత్మగౌరవం, సమసమాజ స్థాపన కాంగ్రెస్‌తోనే సాధ్యం

డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క



గిరిజనులకు ఆత్మగౌరవం, సమసమాజస్థాపన జరగాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పాల్వంచ కిన్నెరసానిలో జరుగుతున్న తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళానికి ఆయన శనివారం విచ్చేశారు. ఆయనకు గిరిజన సంప్రాదాయాల నడుమ ప్రత్యేక స్వాగతం పలికారు. గిరిజన నృత్యాలు, ఆటాపాట ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజన సబ్‌ప్లాన్ నిధులు ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. కానీ ఈ ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులు తూచా తప్పకుండా ఖర్చు చేస్తామని, ఇందు కోసం రూ.17.169 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అంతేకాకుండా గతంలో ఖర్చు చేయని రూ.1.296 కోట్లను కూడా క్యారీఫార్వర్డ్ పద్ధతిలో వెచ్చిస్తామన్నారు. అందరికీ సమానత్వం దక్కాలనే ఉద్దేశ్యంతో ప్రతీఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ప్రభుత్వం ఎంతఖర్చు చేస్తుందో పూర్తి వివరాలతో త్వరలో ప్రతీ ఇంటికీ పంపిస్తామన్నారు. ధరణి పేరుతో అసైన్డ్ భూములను హస్తగతం చేసుకుంటే అందోళనలు చేశామని, ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పి అధికారంలోనికి వచ్చిన తర్వాత భూ భారతి చట్టాన్ని తెచ్చామన్నారు. రాజీవ్ యువవికాసం స్వయం ఉపాధి పథకంలో గిరిజనుల కోసం ప్రత్యేకంగా రూ.1వెయ్యి కోట్లు కేటాయించామని, ఇది దేశచరిత్రలోనే ఓ రికార్డు అన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో బతికేందుకు ఇందిరా సౌర గిరివికాసం ద్వారా 6.70 లక్షల ఎకరాలను రూ.12500 కోట్లు ఖర్చు చేసి సాగులోనికి తీసుకొస్తామన్నారు. అనంతరం ఈ సమ్మేళనానికి హాజరైన వారికి ఆయన మెప్పుకోలు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎంఎల్‌ఏ రామ్‌దాస్ నాయక్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, గడిపల్లి కవిత, కోనేరు చిన్నితో పాలు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల సంక్షేమానికి పెద్దపీట

హక్కుల పరిరక్షణకు కృషి : మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఆదివాసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, వారి హక్కుల పరిరక్షణకు కట్టుబడి కృషి చేస్తోందని రెవెన్యూ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని క్రీడ ఆశ్రమ పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ బునియాడి కార్యకర్తల శిక్షణా తరగతులు శనివారం నాటితో ముగిశాయి. ఈ సందర్భంగా హాజరై మంత్రి మాట్లాడుతూ ఇందిరా గాంధీ పాలనలో గిరిజనుల అభివృద్ధి కోసం 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పంపిణీ చేశారని చెప్పారు. ఈ భూములను ధరణి పేరుతో బిఆర్‌ఎస్ నాయకులు స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. భూభారతి చట్టం ద్వారా ఆ భూములను సర్వే చేసి తిరిగి గిరిజనులకు స్వాధీనం చేస్తామన్నారు. గిరిజన వర్గాల సంక్షేమానికి అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నూతన విధానాలతో పలు రకాల పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. ప్రభుత్వం ప్రజల భూములను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు ధరణి స్థానంలో భూభారతిని అమలు చేస్తుందని, కాంగ్రెస్ పార్టీతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమన్నారు. ముందుగా ఏఐసిసి సభ్యులు, రాష్ట్రవ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నాటరాజన్‌తో కలిసి మంత్రి, ఎంపిలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు శ్రమదానం చేశారు.

### కిన్నెరసానిలో మంత్రి పొంగులేటి శ్రమదానం
### మొక్క నాటిన మీనాక్షీ నటరాజన్



కిన్నెరసాని గిరిజన బాలుర వసతి గృహంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను ఆయనతో కలిసి ఎంపిలు రామసహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరామ్ నాయక్, ఎంఎల్‌ఏలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, డోర్నకల్ ఎంఎల్‌ఏ బాణోత్ రామచందర్, ఏఐసిసి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లు తొలగించారు. అనంతరం మంత్రితో కలిసి మినాక్షీనటరాజన్ పాఠశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఒక గ్రామం నుండి మరో గ్రామానికి, ఒక పట్టణం నుండి మరో పట్టణానికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గత రోజులను జ్ఞాపకం చేసుకుంటూ పెద్ద ఎత్తున బాపూజీ, జై భీం ఆశయాలను నెరవేర్చేందుకు ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతమైన కిన్నెరసాని బాలురు గిరిజన ఆశ్రమ పాఠశాల్లో ఈ ప్రాంతంలో ఉండే ప్రజాప్రతినిధులంతా కలిసి శ్రమదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దోపిడీ పీడన ఉన్నంతవరకూ ఎర్రజెండాల రెపరెపలు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : దోపిడి పీడన ఉన్నంతకాలం ఎర్రజెండాలు రెపరెపలాడుతుంటాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సుల్తానాబాద్ మండల నాలుగవ మహాసభ కనుకుల గ్రామం గోపికృష్ణ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. మహాసభకు ముందు అరుణ పతాకాన్ని సిపిఐ జాతీయ నాయకులు కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. మహాసభ అమరవీరులకు సంతాపం ప్రకటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ మహాసభకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ కడారి సునీల్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ నాయకులు మాజీ శాసనసభ ఫ్లోర్ లీడర్ కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం మహాసభలో పాల్గొని ప్రసంగించారు. మహాసభ ముఖ్య అతిథిగా విచ్చేసిన కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ దేశంలో దోపిడీ పీడన వ్యవస్థ ఉన్నంతకాలం నక్సలిజాన్ని వామపక్షాన్ని అంతం చేయడం నిర్మూలించడం ఎవరికి సాధ్యపడదని నరేంద్ర మోడీ అనుసరిస్తున్న నరహంతక ఫాసిస్ట్ రాక్షస విధానాన్ని తీవ్రంగా ఖండించారు. నక్సలిజాన్ని వామపక్షాన్ని అంతం చేయడానికి ముందు వారు ఏ ఆశయ సాధన కోసం ఏ సమసమాజ సాధన కోసం దశాబ్దాల కాలం నుంచి పోరాటం చేస్తున్నారో ముందు ఆ సమస్యలు నిర్మూలించండి అని మోడీ ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ మహాసభలో పూసల రమేష్ మినుగు సధాకర్, వెంకటేష్, రాజమల్లు, పెరిక కనకయ్య, జెట్టి సంపత్, బొజ్జ రవి, బొజ్జ సతీష్, మర్రి రాజు, సొల్లురి శ్రీనివాస్, సుఖ మల్లయ్య, శారద, లక్ష్మి , కేతమ్మ, కొమురక్క, కనకమ్మ, 23 గ్రామాల నుండి పార్టీ కార్యకర్తలు యూనియన్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

## ఎసిబికి చిక్కిన అవినీతి జలగ

లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ ఎల్లారెడ్డిపేట సర్వేయర్



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : పదివేలు లంచం తీసుకుంటుండగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట సర్వేయర్ నాగరాజు ఎసిబికి చిక్కి అడ్డంగా బుక్కయ్యారు. భూమి కొలతల పంచనామ ధృవపత్రం జారీ కోసం లక్ష రూపాయలు డిమాండ్ చేసినట్లుగా జక్కాపురం మల్లేషం గతంలో రూ.22 వేలు సర్వేయర్ మల్లోజుల నాగరాజుకు ఇచ్చారని భాధితుడి ఫిర్యాదు మేరకు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. పక్కా సమాచారంతో చంద్రంపేట గ్రామరైతు వేదిక వద్ద ఎల్లారెడ్డిపేట సర్వేయర్‌కు భాధితుడు రూ.15 వేలు ఇస్తుండగా వలపన్ని ఏసీబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్కడి నుండి ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి విచారించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎసిబి డిఎస్పీ రమణమూర్తి మాట్లాడారు. అవినీతికి పాల్పడుతున్న ఎంతటివారైనా అధికారులను సహించేది లేదని డీఎస్పీ రమణమూర్తి హెచ్చరించారు. లంచం అనే మహమ్మరి అవినీతికి పాల్పడుతున్న అధికారుల భరతం పడుతామన్నారు. లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లై తే సమాచారం కోసం 1064కు లేదా వాట్సాప్ నంబర్ 9440446 106కు సమాచారం అందించాలని కోరారు. ఈదాడుల్లో ఎసిబి సీఐలు తిరుపతి, కృష్ణకుమార్ ఉన్నారు. పట్టుబడ్డ సర్వేయర్ నాగరాజును ఎసిబి కోర్టుకు తీసుకువెళ్ళి రిమాండ్‌కు పంపుతామని ప్రెస్‌మీట్‌లో తెలిపారు.

## ప్రజలు ఉన్నంత వరకూ బిఆర్‌ఎస్ ఉంటుంది

రేపు 'కాళేశ్వరం'పై హరీశ్‌రావు పవర్‌పాయింట్ : మధుసూదనాచారి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ప్రజలు ఉన్నంత వరకు బిఆర్‌ఎస్ ఉంటుందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. జూన్ 2వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తారని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు తమకు ఎక్కువగానే తెలుసని, పార్టీలో ఏ నిర్ణయమైనా కెసిఆర్ తీసుకుంటారని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు తమ భాషను, వారి పాలనను ప్రజలు అసహ్యించుకునే విధంగా ఉన్నదని మధుసూదనాచారి ఎద్దేవా చేశారు.


దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ)
SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED
టెండర్ నోటీస్ (పత్రికా ప్రకటన - 04/25-26)
1) Sp.No.03/25-26 (డిసి పని): ''డిసి పనుల కింద హైదరాబాద్ సౌత్ సర్కిల్‌కు సంబంధించిన బేగం బజార్ డివిజన్, బేగం బజార్ సబ్ డివిజన్, ఐసిఎస్‌సి ట్రూప్ బజార్‌లోని ప్రస్తుత 33/11 కెవి గోషామహల్ సబ్ స్టేషన్ మరియు కార్యాలయ భవనాల తరలింపు'' (బిడ్ ప్రారంభ తేది: 04.06.2025న 15:00గం.లకు, బిడ్ అప్‌లోడ్‌కు ఆఖరి తేది: 18.06.2025న 15:00గం.లకు & హార్డ్ కాపీల దాఖలు తేది: 19.06.2025న 12:00గం.లకు)
గమనిక: దీనికి సంబంధించి ఏవైన ఇతర సమాచారం వెబ్‌సైట్ https://tgsouthernpower.org/generaltenders లో పొందవచ్చు.
సం/- చీఫ్ ఇంజనీర్, మాస్టర్ ప్లాన్ జోన్, టిజిఎస్‌పిడిసిఎల్, మింట్ కాంపౌండ్, హైదరాబాద్.
DIPR R.O. No. : 2892-PP/CL/ADVT/1/2025-26, Date: 31-05-2025



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.
NIT No. 12/EE-Div.29/SBZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేది: 31.05.2025
పని పేరు: జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్, డివిజన్ 29, తార్నాక వార్డ్-143, టిప్పు ఖాన్ మసీదు ఈద్గా వద్ద ఉన్న ఈద్గాలో తెల్లటి పందల్, కార్పెట్, కుర్చీలు, టేబుళ్లు మొదలైనవి (2025 బక్రీద్ పండుగ దృష్ట్యా) అందించడం. అంచనా విలువ / ఇసివి : రూ.2.10లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 02.06.2025న ఉ.10.30గం.ల నుండి 05.06.2025న ఉ.10.30గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్. సెల్ నం. 7995468066. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 2902-PP/CL/ADVT/1/2025-26, Date: 31-05-2025



శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ఫోన్ నం. 08743-232428
ఆర్.సి నం. డి6/194/2017 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన ది. .05.2025
ది. 10.07.2025 నుండి ది. 09.07.2026 వరకు ఒక సం.ర కాలమునకు దేవస్థానమునకు నిత్యాన్నదాన సత్రము మరియు పడితరమునకు అవసరమైన పాలు, పెరుగు సరఫరా చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. ఇ-టెండరు డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది: 02.06.2025 ఉదయం గం.11.00ల నుండి, టెండరు దాఖలుచేయు చివరి తేది: 16.06.2025 ఉదయం గం.11.00వరకు, టెక్నికల్ బిడ్ తెరచు తేది: 16.06.2025 ఉదయం గం.11.30లకు, ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది: 16.06.2025 మధ్యాహ్నం గం.12.00లకు. ఇతర వివరములకు https://tender.telangana.gov.in మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును. లేదా ఈ కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.
సం/- కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 2857-PP/CL/ADVT/1/2025-26, Date: 31-05-2025





## బెల్జియం గాలి చౌర్యం!



బెల్జియం దేశం గాలిని దొంగిలిస్తున్నదట. బెల్జియంలోని విండ్ ఫామ్స్ తమ దేశ గాలిని దొంగిలిస్తున్నాయని నెదర్లాండ్స్ వాపోతున్న ది. ప్రపంచ దేశాలను ఆకర్షిస్తున్న ఈ వివాదంపై ఐరోపా వాతావరణ శాస్త్రవేత్తలు చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే, నెదర్లాండ్స్‌కు చెందిన 'వెదర్ ఇంపాక్ట్' అనే వాతావరణ పరిశోధనా సంస్థ ఇసిఓ రెమ్కో వెర్జిజిల్‌బెర్గ్ ఓ గణనాత్మక పరిశోధనలో ఒక ఆసక్తికర విషయాన్ని గుర్తించాడు. అతని అభిప్రాయం ప్రకారం, బెల్జియం సముద్ర తీర ప్రాంతం లో ఉన్న విండ్ ఫామ్స్ నెదర్లాండ్స్ తీరానికి వచ్చే గాలిని మళ్లిస్తున్నాయి. దీనితో నెదర్లాండ్స్‌కు వచ్చే గాలులు మూడుశాతం వరకు తగ్గిపోతున్నాయి. ఎలాగంటే, గాలి ముందుగా బెల్జియం విండ్ టర్బయిన్లను తాకి, వాటి శక్తి కొంత వాడబడిన తర్వాత మిగిలిన గాలి నెదర్లాండ్స్ టర్బయిన్లకు చేరుతుంది. ఫలితంగా నెదర్లాండ్స్ విండ్ ఫామ్స్ పవర్ ఉత్పత్తి తగ్గిపోతున్నది. శాస్త్రీయ కోణంలో ఆలోచిస్తే, ఇది 'వేక్ ఎఫెక్ట్' అనే సైద్ధాంతిక భావనకు సంబంధించింది. అంటే, విండ్ టర్బయిన్ల ద్వారా గాలి వెళ్లిన తర్వాత, ఆ మార్గంలో వాయుగతిని ప్రభావితం చేస్తుంది. కాలివేగం, దిశ, స్థిరత్వం వంటిని ఈ 'వేక్' ద్వారా మారే అవకాశాలు ఉంటాయి. కాగా, రెమ్కో వెర్జిజిల్‌బెర్గ్ చేసిన ఆరోపణ రాజకీయ, ఆర్థిక రంగాల్లోనూ చర్చకు దారితీసింది. బెల్జియం, నెదర్లాండ్స్ మధ్య సరిహద్దు వనరుల వినియోగాన్ని పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని తెరపైకి తెచ్చింది. పునరుత్పాదక శక్తిపై ఆధారపడే దేశాలు, ఇతరత్రా సహజ వనరులను పంచుకునే ఒప్పందాలు చేసుకుంటా యి. కానీ, తాజా అధ్యయనం కారణంగా, ఇప్పుడు గాలిని కూడా అలాంటి వనరుల జాబితాలో చేర్చాల్సిన అవసరం, దానిని పంచుకోవడానికి శాస్త్రీయ ప్రణాళికను రూపొందించాల్సిన ఆవశ్యకత ఏర్పడ్డాయి. ఒకప్పుడు సంపదకోసం యుద్ధాలు జరిగేవి. నీటి పంపిణీలో వివాదాలు, ఘర్షణలేకాదు... యుద్ధాలు కూడా చూశాం. ఇకపై 'గాలి యుద్ధాలు' కూడా చూడాల్సి వస్తుందేమో!

## రోబోట్స్ ఫైటింగ్!



బాక్సింగ్, మార్షల్ ఆర్ట్స్ వంటి పోటీల్లో మనుషులు పోటీపడడం, ఫైట్ చేయడం చూశాం. కానీ, ఇటీవల చైనాలోని హాంగ్‌జౌ నగరంలో విచిత్రమైన పోటీ జరిగింది. ప్రపంచంలోనే మొట్టమొదటిసారి హ్యూమనాయిడ్ రోబోట్‌లు ఈ ఫైటింగ్‌లో పాల్గొన్నాయి. చైనా మీడియా గ్రూప్ (సిఎంజి) ఆధ్వర్యంలో ఈ పోటీని నిర్వహించారు. ఇందులో, యూనిట్రీ రోబోటిక్స్ సంస్థ అభివృద్ధి చేసిన జి1 మోడల్ రోబోట్లు పాల్గొన్నాయి. ప్రతి రోబోట్ సుమారు 1.32 మీటర్ల ఎత్తు, 35 కిలో ల బరువు కలిగి ఉంది. రోబోట్లు మానవ నియంత్రణలో ఉండి, మూడు రెండు నిమిషాల రౌండ్ల లో కిక్‌బాక్సింగ్ పోటీలో పాల్గొన్నాయి. విజేతలను పాయింట్ల ఆధారంగా నిర్ణయించారు. ఈ రోబోట్లు మోషన్ క్యాప్చర్ సాంకేతికత ద్వారా మానవ యోధుల కదలికలను నేర్చుకున్నాయి. అలాగే, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఎఐ) ఆధారంగా రోబోట్‌లను అభివృద్ధి చేశారు. ఈ పోటీలు విజయవంతం కావడంతో, ఈ ఏడాది డిసెంబర్‌లో పూర్తిస్థాయి హ్యూమనాయిడ్ రోబోట్‌ల ఫైటింగ్‌ను డిసెంబర్ మాసంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నరు. మొత్తం మీద ఇటీవల జరిగిన ఫైటింగ్ చైనాలో రోబోటిక్స్, ఎఐ రంగాల్లో చోటు చేసుకుంటున్న వేగవంతమైన అభివృద్ధిని ప్రతిబింబిస్తున్నది.

## 'యాప్స్' ఉన్నాయి జాగ్రత్త!



ఎవరూ చూడడం లేదు... ఎవరూ గమనించడం లేదు.. అనుకుంటూ పిచ్చివేషాలు వేసేవారు, ముఖ్యంగా భర్తలు ఇకపై 'యాప్స్' గురించి కూడా జాగ్రత్తలు తీసుకోక తప్పదు. సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, పురుషులకు పరోక్ష హెచ్చరికలు చేస్తున్న ఓ ఘటన యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లో చోటు చేసుకుంది. వివరాలను పరిశీలిస్తే, తన భర్తకు మరో స్త్రీతో అక్రమ సంబంధం ఉందని ఓ మహిళకు అనుమానం. ఆ అనుమానం నిజమేనని ఆమె ఉపయోగిస్తున్న స్మార్ట్‌ఫోన్ ద్వారా బయటపడింది. ఆమె తన పిల్లల దంతాల శుభ్రతను పర్యవేక్షించేందుకు ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్ యాప్ వాడుతున్నది. పిల్లలకు దంతాలు శుభ్రపరచాల్సిన సమయాన్ని ముందుగానే ఫీడ్ చేసింది. పిల్లలు ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్‌ను ఎప్పుడు వాడారన్నది యాప్‌లో నమోదవుతుంది. అయితే, వేరువేరు సమయాల్లో బ్రష్ వాడినట్టు కనిపించడం, అది కూడా భర్త కార్యాలయంలో ఉండాల్సిన సమయాలే కావడంతో అనుమానం వచ్చిన ఆమె విచారిస్తే, అతను తన సహోద్యోగినతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న వైనం బయటపడింది. యాప్‌లో రోజు, సమయంతో సహా అన్ని వివరాలు ఉండడంతో, ఆ భర్తకు తప్పించుకునే అవకాశం లేకపోయింది. స్మార్ట్ ఫోన్లు, ఇతర పరికరాలు వ్యక్తిగత జీవితాల్లో ఎలాంటి కీలక పాత్ర పోషిస్తాయన్నది ఈ ఘటన రుజువు చేసింది. ఎవరికీ అనుమానం రాని విషయాలు కూడా యాప్స్ ద్వారా బయటపడుతున్న వైనం అందరికీ జాగ్రత్తలు నేర్పుతున్నది.

## ఎలిఫెంట్ సీల్ విహారం!




దక్షిణాఫ్రికాలోని గోర్డన్స్ బే పట్టణంలో ఒక భారీ ఎలిఫెంట్ సీల్ వీధుల్లో సంచరించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వణ్య ప్రాణులు అప్పుడప్పుడు జనావాసాల్లోకి రావడం తెలుసుగానీ, ఇలా ఎలిఫెంట్ సీల్ వీధుల్లో కనిపించడం అరుదు. సుమారు రెండు టన్నుల మరువుగల మగ సీల్ సముద్రం నుండి దారితప్పి, సుమారు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న పట్టణ వీధుల్లోకి వచ్చి, రహదారులపై నడుచుకుంటూ, కొన్ని వాహనాలపై తలపెట్టి విశ్రాంతి తీసుకుంటూ కనిపించింది. సమాచారం అందుకున్న వెంటనే, రెస్క్యూ సిబ్బంది, పోలీసులతోపాటు సముద్ర జీవుల నిపుణులు, నగర వెటర్నరీ సిబ్బంది కూడా స్పందించారు. మత్తుమందు ఇచ్చి దానిని మళ్లీ సముద్రంలోకి వదిలారు. సోషల్ మీడియాలో ఈ ఘటన వైరల్‌గా మారింది. చాలామంది 'మళ్లీ కలుద్దాం' అంటూ కాప్షన్‌తో ఫొటోలు అప్‌లోడ్ చేశారు. సాధారణంగా సబ్ అంటార్కిటిక్ ప్రాంతాల్లో కనిపించే సముద్ర జీవి ఎలిఫెంట్ సీల్ కేప్ టౌన్ సమీపంలోని గోర్డన్స్ బే వీధుల్లో దర్శనం ఇవ్వడం ఒక రకంగా సరదా సన్నివేశంగా కనిపించినా, మారుతున్న పర్యావరణ కాలుష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. జలచరాలు కూడా జనావాసాల్లోకి వచ్చే పరిస్థితులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అంతా మత్తు మహిమ



న్యూయార్క్‌లోని అడిరోండాక్ పర్వత ప్రాంతం నుంచి ఫారెస్ట్ రేంజర్ రాబ్ ప్రాక్జో లోకు ఎమర్జెన్సీ ఫోన్‌కాల్ వచ్చింది. ఎత్తయిన ప్రదేశాలకు వెళ్లే హైకర్ ఒకరు కనిపించడం లేదని, వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ఆ ఫోన్ సారాంశం. హుటాహుటిన తన బృందంలో కలిసి బయలుదేరిన రాబ్‌ప్రాక్జో లో, అతి కష్టంమీద ఫోన్ చేసిన ఇద్దరు హైకర్లను కనుగొన్నాడు. అత్యవసర సర్వీస్ 911కు ఫోన్ చేసింది వారేనని గుర్తించాడు. తమతో వచ్చిన మరో హైకర్ పర్వత ప్రాంత అడవుల్లో తప్పిపోయాడని ఆ ఇద్దరు హైకర్లు నమ్మకంగా చెప్పడంతో గాలింపు చర్యలు మొదలుపెట్టాడు. అయితే, ఆ మూడో హైకర్ నుంచి కూడా 911కు అలాంటిదే కాల్ ఒకటి వెళ్లింది. తనతో వచ్చిన ఇద్దరు హైకర్లు కనిపించడం లేదని, సాయం చేయాలని అతను కోరాడు. నిజానికి మొదట ఫోన్ చేసిన ఇద్దరు హైకర్లు తాము తప్పిపోయిన విషయాన్ని గ్రహించకుండా, తమ స్నేహితుడు తప్పిపోయాడని భయపడ్డారు. అందుకు కారణం వారు తిన్న హెల్యూసినోజెనిక్ మష్రూమ్స్ (సైలోసైబిన్ కలిగిన మష్రూమ్స్) అని ఫారెస్ట్ రేంజర్‌కు అర్థమైంది. ఈ పదార్థం మనిషిని మత్తులోకి పంపుతుంది. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు భ్రమలు పుట్టిస్తుంది. ఆ మత్తులోనే వారు తమ స్నేహితుడు తప్పిపోయాడని భ్రమపడ్డారు. అడవిలో దారితప్పింది తామేనన్న విషయాన్ని నమ్మకుండా, రెస్క్యూ బృందంతో వాదనకు కూడా దిగారు. వారిని క్షేమంగా కిందకి తీసుకొచ్చిన బృందం, వెంటనే వైద్యసేవల కోసం ఆ ఇద్దరినీ ఆసుపత్రికి తరలించారు.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# తెలుగు 'సినీ' అవార్డులు

పదకొండు సంవత్సరాలక్రితం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన – తెలంగాణ రాష్ట్రం అవతరణతో నిలిచిపోయిన, సినీ పరిశ్రమను గౌరవించుకునే, సన్మానించుకునే, ప్రోత్సహించే నంది అవార్డుల ప్రదానాన్ని ప్రజాగాయకుడు గద్దర్ పేరుమీద తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరించటం అభినందనీయం. 10 సంవత్సరాల అవార్డులను సీనియర్ నటుడు మురళీమోహన్ కమిటీ ప్రకటించగా, 2014 అవార్డులను సహజనటి జయసుధ జ్యూరీ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది అవార్డులను పునరుద్ధరించాలని సంబంధిత ప్రభుత్వాలకు చాలాకాలంగా విజ్ఞప్తులున్నా అవి కార్యరూపం ధరించలేదు. అది పరిశ్రమ పట్ల అభిమానం లేకకాదు — రాజకీయాలు సహా ఇతర త్రా కారణాలుండవచ్చు. చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, అందులో సినీరంగ ప్రముఖుడు పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా ఉన్నందున, సినీ పరిశ్రమ సరైన రీతిలో వ్యవహారాలు సాగించి ఉంటే నంది అవార్డుల పునరుద్ధరణ జరిగేది. తొలి సంవత్సరంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు అమరావతి, పోలవరం వగైరాలపై కేంద్రీకరించినందున సినీపరిశ్రమవైపు దృష్టి సారించే అవకాశం కూడా లేదు. తెలంగాణ ప్రభుత్వం అవార్డుల ప్రకటనలతో ముందడుగు వేయటంతో ఇప్పుడొక చిక్కు సమస్య ఎదురు కావచ్చు. తెలంగాణ ప్రభుత్వం ఒక చిత్రానికి, నటునికి ఉత్తమ అవార్డు ఇస్తే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జ్యూరీ మరో చిత్రాన్ని, హీరోని అదే కేటగిరీలో ఎంపిక చేస్తే స్పర్ధలకు దారితీసే ప్రమాదం ఉంటుంది. అది పరిశ్రమలోనేగాక అభిమానుల్లో వైరాలు పెంచవచ్చు. తెలంగాణలో 2014 నుంచి 2023 సంవత్సరం వరకు ఏటా వరుస క్రమంలో మూడేసి ఉత్తమ చిత్రాల ను ప్రకటించిన సీనియర్ నటుడు మురళీమోహన్, నంది అవార్డుల పునరుద్ధరణకై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు ప్రభుత్వాలు వేర్వేరుగా అవార్డులు ప్రకటిస్తే రాగల సమస్యలను ఊహించిన ఆయన పరిశీలించదగ్గ సూచన చేశారు. తెలుగు సినీ పరిశ్రమకు తెలుగు ప్రజలంతా సమానమేనంటూ, రెండు ప్రభుత్వాలు సమన్వయం చేసుకుని ఒక్కో ప్రభుత్వం సంవత్సరం విడిచి సంవత్సరం(రెండు సంవత్సరాల కొకసారి) అవార్డుల ఇస్తే బాగుంటుందని అన్నారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది అవార్డుల పునరుద్ధరణ నిర్ణయం తీసుకోవాలి. ఆ తర్వాత పరిశ్రమ పెద్దలతో చర్చించి రెండు రాష్ట్రాల సమన్వయంపై ఆలోచించవచ్చు.

**ప్రజాపక్షం**
**01-06-2025, ఆదివారం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో నాటకరంగానికి కూడా నంది అవార్డుల ప్రదాన కార్యక్రమం ఉండింది. దాన్ని కూడా పునరుద్ధరించి ఔత్సాహిక నాటకరంగాన్ని ప్రోత్సహించాలి.

తెలుగు సినీ పరిశ్రమ సహా అన్ని ప్రధాన భాషా చిత్రపరిశ్రమలు ఇవాళ పాన్ ఇండియా మార్కెట్‌కు ఉద్దేశించబడ్డాయి. దాంతోపాటు అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యం చేసుకుంటున్నాయి. దీనితో ప్రధాన హీరోల సినిమాలు సంవత్సరానికి ఒకటీ విడుదలకాని పరిస్థితి. బడ్జెట్ సినిమాలు చూడటానికి ప్రేక్షకులు రావటం లేదు. ఏ సినిమాకైనా వారాంతం రెండ్రోజులే కలెక్షన్‌లు. దీనితో నిర్మాతలు, బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పాన్ ఇండియా మార్కెట్ పేరుతో ముఖ్య నటీనటులు, దర్శకులు ఇతర సాంకేతిక నిపుణుల రెమ్యూనరేషన్ తారాస్థాయికి చేరింది. పర్యవసానంగా వందలకోట్లు ఖర్చుపెట్టగల బహుకొద్ది నిర్మాతలు లేదా నిర్మాతల కూటమి పెద్ద హీరోల సినిమాలు తీయగలుగుతున్నారు. మరోవైపున రెండు – మూడు దశాబ్దాలుగా థియేటర్ల గుత్త విధానం చిన్న సినిమాను చంపేస్తున్నది. ఆ గుత్తాధిపతులు దయతలిస్తేనే చిన్న సినిమాకు థియేటర్ దొరుకుతుంది. అట్టి చిత్రాలు మంచిగా ఆడుతున్నా, పెద్ద సినిమా వస్తుందంటే ఆ బొమ్మను తీసేయాల్సిందే! ఈ పరిస్థితి వికటించి ఈ రోజున థియేటర్లకు సినిమాలు లేక పాత సినిమాల రీరిలీజ్ మొదలైంది. ఇది సంక్షోభానికి ప్రబల సంకేతం. కొద్దిరోజులుగా మీడియాలో గగ్గోలు రేపుతున్న థియేటర్ల బంద్ ఆలోచన పెద్ద వివాదంగా తయారైంది. పవన్ కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లు విడుదలకు ముందు ఈ సమస్య తలెత్త టం చినికిచినికి గాలివానగా తయారైంది. ఆ నలుగురెవరో బయటకు రాక నిర్మాతలు సంజాయిషీలమీద సంజాయిషీలతో గుంజిళ్లు తీస్తున్నారు. ఈ చర్చకు మూలాలు ఎక్కడున్నా అవి సినీ పరిశ్రమలో కుతకుతలాడుతున్న సంక్షోభాన్ని బయటకు లాగాయి. టిక్కెట్ రేట్లు పెంచి, తినుబండారాల రేట్లు విపరీతంగా పెంచి ప్రేక్షకులను దోచుకోవటం కూడా ఈ సంక్షోభంలో ఒక పార్శ్వం. ఇవాళ వినోదానికి ఒటిటి సహా పలు మార్గాలున్నాయి – సినిమాహాలుకే రానక్కర్లేదు. సినిమా హాళ్లను ఫంక్షన్ హాళ్లుగా మార్చే పరిస్థితులను అరికట్టలేకపోతే సినీ పరిశ్రమ భవిష్యత్‌లో పెద్ద ప్రమాదంలో పడుతుంది. ఇది లోతుగా, సమగ్రంగా ఆలోచించాల్సిన సమస్య. పర్సంటేజి పద్ధతికై ఎగ్జిబిటర్ల డిమాండ్‌ను నిర్మాతలు ఈ నేపథ్యంలో చూడాలి.

## గోదావరి జలాలను కొల్లగొట్టే

# బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ఆపాలి




ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

గోదావరి నదీజలాలపై అంతర్ రాష్ట్ర వివాదం నడుస్తుండగానే.. బచావత్ ట్రిబ్యునల్ 1980 ఒప్పందానికి విరుద్ధంగా 2014 రాష్ట్ర విభజన చట్టానికి వ్యతిరేకంగా గోదావరి జలాల మళ్ళింపునకు ఆంధప్రదేశ్ ప్రభుత్వం చేబడుతున్న బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును తక్షణమే ఆపాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. సముద్రంలోకి వృథాగా పోతున్న 2వేల టిఎంసిల గోదావరినదీ జలాలను రాయలసీమ జిల్లాలకు, పెన్నానది పరీవాహక ప్రాంతానికి తరలించే విధంగా గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేపడుతున్నట్లు ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

2023లోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గోదావరి–పెన్నా–కావేరి నదుల అనుసంధానం పేరుతో గోదావరి నదిపై ఇచ్చంపల్లి దగ్గర బ్యారేజ్ నిర్మించి గోదావరి జలాలను కావేరికి అనుసంధానం చేస్తూ డిపిఆర్ ను రూపొందించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వాల అనుమతి కోరింది. దీనిని ఆనాడు అధికారంలో ఉన్న బిఆర్ఎస్..ఆ తరువాత అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయా? లేవా? తేల్చకుండా, ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం చేపట్టకుండా ఏకపక్షంగా ప్రాజెక్టును ఎలా చేపడతారంటూ తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నిక లు, ఎపిలో చంద్రబాబు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం.. కేంద్రానికి చంద్రబాబు పూర్తి మద్దతు ఇవ్వడంతో మోడీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చింది. తాజాగా చంద్రబాబు సహకారంతో గోదావరి – కావేరి అనుసంధాన ప్రాజెక్టును మరో రూపంలో కేంద్రం చేపట్టేందుకు పథకం రచించింది. ఇచ్చంపల్లి నుండి గోదావరి జలాలను తరలించే ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించడంతో గోదావరి జలాలు దిగువకుపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ పరిధిలో పోలవరం నుంచి నీటిని తరలించవచ్చని కేంద్రం స్కెచ్ వేసింది. దీనికి తోడు చంద్రబాబు పనిలో పనిగా ఇందులో తన రాష్ట్ర ప్రయోజనాన్ని కూడా చూసుకున్నారు. గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా వృథాగా సముద్రం పాలవుతున్న గోదావరి జలాలను కృష్ణ పెన్నా బేసిన్‌కు తరలించవచ్చని పథకం రూపొందించారు. ఆపై కేంద్రం పెన్నా బేసిన్ నుంచి నేరుగా తమిళనాడులోని కావేరికి కూడా గోదావరి జలాలు తరలించడం సులభమవుతుందని కేంద్రం భావిస్తుంది.

**బనకచర్ల లింకు**

శ్రీశైలం కుడిగట్టు ప్రధానకాలువ పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుండి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ఉంటది. దీని ద్వారానే రాయలసీమ ప్రాంతంలోని జిల్లాలకు కృష్ణా జలాలను అందిస్తున్నారు. ఇప్పుడు గోదావరి జలాలను పోలవరపు నుండి బనకచర్లకు రోజుకు 2 టిఎంసిలు చొప్పున తీసుకుపోయే విధంగా రూ.81వేల కోట్లతోఎత్తిపోతల కాలువలద్వారా తీసుకువెళ్లే విధంగా ప్రాజెక్టును రూపకల్పన చేశారు. దీనికి పర్యావరణం, కేంద్ర జల వనరుల అనుమతులు ఏవీ ఇంకా లేవు. అయితే కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి చంద్రబాబు ప్రభుత్వం అండ అవసరం ఉండటంతో ఈ ప్రాజెక్టుకు అనుమతులతో పాటు ఆర్థిక సహకారం అందించే విధంగా చంద్రబాబు పావులు కదుపుతున్నాడు. ఇక ప్రాజెక్టు పట్టాలెక్కితే నాగార్జునసాగర్ కుడి కాల్వతో పాటు రాయలసీమలోని పెన్నా బేసిన్‌కు కూడా గోదావరి జలాలు పరుగులు పెడుతోంది. పనిలోపనిగా జలాలను కావేరికి అనుసంధానం పేరిట తమిళనాడుకు గూడా తరలించవచ్చనే పథకానికి తోడ్పడుతుందనే మోదీ ఆశ నెరవేర్చుకోవచ్చు.'ఏటా సముద్రంలోకి 4 వేల టిఎంసిల గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. ఆ జలాలను వినియోగించేందుకే పోలవరం నుంచి సాగర్ మీదుగా బనకచర్లకు గోదావరి జలాలను తరలించే గోదావరి కృష్ణా పెన్నా



నిర్మాణంలోని పోలవరం ప్రాజెక్టు

అనుసంధాన ప్రాజెక్టు చేపడుతున్నామని కొన్ని నెలల కిందట ఎపిసిఎం చంద్రబాబు ప్రకటించారు.

**చకచకా కదులుతున్న లింకులు**

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులతో పాటు కృష్ణాజలాల్లో న్యాయమైన వాటాను దాదాపు పుష్కర కాలంగా సాగదీస్తున్న మోదీ ప్రభుత్వం చంద్రబాబు తెరపైకి తెచ్చిన గోదావరి, కృష్ణా, పెన్నా అంతర్రాష్ట్ర రివర్ లింక్ ప్రాజెక్టును మాత్రం వేగంగా ముందుకు తీసుకపోతున్నది. ఈ మేరకు చంద్రబాబు ప్రభుత్వం జలహారతి పేరిట స్పెషల్ పర్పస్ వెహికల్ కార్పొరేషన్‌ను కూడా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వాలని జాతీయ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు కోరుతున్నారని తెలుస్తుంది. దీంతో కేంద్రం ఈ ప్రాజెక్టు పై అధ్యయనానికి చర్యలు చేపట్టింది. కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాల మేరకు కృష్ణా, గోదావరి నది యజమాన్య బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పిపిఎ)కి లేఖలు రాసింది. చంద్రబాబు ప్రతిపాదించిన ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టాలని అందులో ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు రూ.3వేల కోట్లు సమకూర్చేందుకు ప్రధాని మోదీ సైతం సూత్రప్రాయంగా అంగీకరించినట్టు సమాచారం. ఇందుకుగాను ప్రాజెక్టుకు ఆమోదం కూడా తెలిపేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. త్వరలోనే దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రధాని సూత్ర అంగీకారంతో ప్రాజెక్టు పనులను ఈ ఏడాది పట్టాలు ఎక్కించేందుకు ఎపి సర్కార్ సిద్ధమవుతున్నట్లు ఇరిగేషన్ వర్గాలలో చర్చ కొనసాగుతుంది.

**గోదావరి జలాలపై అంతర్ రాష్ట్ర వివాదం**

కృష్ణ, గోదావరి నదుల జలాల వివాదంపైన విచారణ జరిపిన బచావత్ ట్రిబ్యునల్ 1979 నవంబర్ 27న తీర్పు ప్రకటించింది . ఈ తీర్పుపై ఫర్ దర్ రిపోర్టు 1980 జులై 7న ప్రకటించింది. గోదావరి నది దక్షిణ భారతదేశంలోనే పెద్దది. ఇది మహారాష్ట్ర నాసిక్ జిల్లాలో సముద్రమట్టానికి 3500 అడుగుల ఎత్తులో త్రయంబకేశ్వరం వద్ద, అరేబియా సముద్రానికి 241.39కి.మీ దూరంలో ప్రారంభమై మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా ల గుండా 1464.46 కి.మీ ప్రవహించి రాజమండ్రికి 96.55కి.మీ దూరంలో బంగాళాఖాతంలో కలుస్తుంది. చత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాల నుండి ఉపనదులు వచ్చి చేరుతాయి. గోదావరి నదికి తెలంగాణలో పరివాహక ప్రాంతం 80 శాతం ఉండగా, ఎపిలో20 శాతం మాత్రమే ఉంటుంది.

**బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపు**

గోదావరినదిలో 3000 టిఎంసిల వరకు జలాలు అందుబాటులో ఉంటాయని వాటిని ఐదు రాష్ట్రాలకు పంపిణీ చేయడం జరిగింది. ఎపి ఉమ్మడి రాష్ట్రానికి 1479 టిఎంసిల నీటిని కేటాయించింది. 1975 నుండి 1980 వరకు 5 రాష్ట్రాలు గోదావరి జలాల పంపిణీపై 10 ఒప్పందాలు కుదుర్చుకున్నవి. ఈ ఒప్పందాలను అన్ని రాష్ట్రాలు అమలు పరచాలి. పోలవరం ద్వారా గోదావరి నుంచి 80 టిఎంసిల నీటిని తుమ్మిడిహట్టి నుంచి ఎపి కృష్ణా డెల్టాకు తీసుకుంటున్నందున, కృష్ణానదికి ఎగువ ఉన్న పై రాష్ట్రాలకు 80 టిఎంసిల కృష్ణా నీటిని ఉపయోగించాలని బచావత్ ట్రిబ్యునల్ పేర్కొంది. ఇందులో ఉమ్మడి ఎపికి 45 టిఎంసిలు, కర్నాటకకు 21 టిఎంసిలు, మహారాష్ట్రకు 14 టిఎంసిల చొప్పున హక్కు కల్పించారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగినందున న్యాయబద్ధంగా ఆ 45 టిఎంసిలు తెలంగాణకు దగ్గాలి. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు విడిపోవడంతో గోదావరి జలాలను పునఃపంపిణీ చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

గోదావరి నదీ పరివాహక ప్రాంతాన్నిబట్టి తెలంగాణకు 1184 టిఎంసిల పైగానే నీటి వాటా రావాలి. రెండు రాష్ట్రాలకు నదీ జలాల పునఃపంపిణీ కానందు న బచావత్ ట్రిబ్యునల్ 1980 ప్రకారం, 2014 రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఎపి ప్రభుత్వం గోదావరి బనకచర్ల ప్రాజెక్టు చేపట్టటం చట్ట వ్యతిరేకమని, దీనిని వెంటనే ఆపాలని గోదావరి నది జలాల ట్రిబ్యునల్‌ను తెలంగాణ ప్రభుత్వం కోరింది. కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎటూ తేల్చకుండా పెండింగ్‌లో ఉంచినందున అనుమతులు ఇవ్వటం విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

ఈ నేపథ్యంలో తక్షణమే గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని అది కేంద్రాన్ని కోరింది.. గోదావరి నదిపై చేపడుతున్న తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని డిమాండు చేసింది.

# టిడిపి మహానాడు : తెలంగాణ

ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగు దేశం పార్టీ మహానాడును కడపలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించుకున్నారు. మూడు దశాబ్దాల క్రితం పార్టీ పగ్గాలు చేపట్టిన టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడునే మరో రెండేళ్ళు పాటు జాతీయాధ్యక్షుడిగా మహానాడు ఏకగ్రీవంగా ఎన్నుకుంది. చివరి రోజున జరిగిన బహిరంగ సభలో లక్షల మంది కార్యకర్తలు హాజరయ్యారు. ఎన్నికల్లో తన ప్రధాన ప్రత్యర్థి, వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి స్వంత ఇలాఖా కడపలో మహానాడు పెట్టడం ద్వారా తన బలాన్ని చంద్రబాబు చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్ టిడిపి కార్యకర్తలకు మహానాడు మంచి టానిక్కును ఇచ్చిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఎటొచ్చి తెలంగాణ టిడిపి కార్యకర్తలకు మాత్రం మరోసారి నిరాశే ఎదురైందని చెప్పొచ్చు. ఆ పార్టీ లెక్కల ప్రకారం టిడిపి మొత్తం సభ్యత్వం 1.02 కోట్లు కాగా, అందులో ఆంధ్రప్రదేశ్‌లోనే అధికభాగం 1.01 కోట్లు ఉండగా, తెలంగాణలో 1.78 లక్షలు, అండమాన్‌లో 4,268 మంది సభ్యులుగా ఉన్నారు. గత కొన్నేళ్ళుగా తెలంగాణలో టిడిపిని పట్టించుకున్న దాఖలాలు లేవు. తెలంగాణలో శాసనసభ ఎన్నికలకు ఏడాది ముందు ఖమ్మంలో పెద్ద బహిరంగ సభను ఏర్పాటు చేసి తెలంగాణలో పోటీకి సన్నద్ధమవుతున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత మరికొన్ని సభలు నిర్వహిస్తామని చెప్పినప్పటికీ ముందడుగు పడలేదు. శాసననసభ ఎన్నికల్లో పోటీ చేయబోమని నిర్ణయించుకోవడంతో ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేసి తన దారేదో తాను చూసుకున్నారు. రాష్ట్రానికి కొత్త అధ్యక్షుడిని నియమించలేదు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపైనే ఫోకస్ పెట్టిన చంద్రబాబు అక్కడ గెలిచాక తెలంగాణలో కూడా పార్టీ పునరుద్ధరిస్తారేమోనని తెలంగాణ తెలుగు తమ్ముళ్ళు భావించారు. జనవరి మాసంలో హైదరాబాద్‌లో తెలంగాణ నాయకులతో సమావేశమైనప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి పార్టీని బలోపేతం చేసుకుందామని చెప్పిన మాటలు ఉన్న అతి కొద్ది మంది నాయకులలో ఆశలు చిగురింపజేశాయి. ఆ దిశగా అడుగులు పడకపోవడం, కనీసం ఇక్కడ మినీ మహానాడును కూడా నిర్వహించకపోవడంతో నిరాశ చెందారు. మహానాడు నుంచి ఈ సారైనా తమకు దిశానిర్దేశం చేస్తారని తెలంగాణ తెలుగు తమ్ముళ్ళు భావించినప్పటికీ కడపలో ఆ సంకేతాలు వెలువడలేదు.

**ఆంధ్రప్రదేశ్‌కే ప్రాధాన్యం**

అధికారంలో ఉన్న రాష్ట్రంగా అక్కడ ప్రాధాన్యత ఇవ్వడం తప్పు బట్టలేము. తెలంగాణలో పుట్టిన పార్టీ అని, రెండు రాష్ట్రాలు రెండు కళ్ళు అని చెప్పినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌కే టిడిపి మొగ్గు అని మహానాడు ద్వారా మరోసారి రూఢీ అయింది. అయితే, మహానాడు తీర్మానాలలో మాత్రం టిడిపి తెలంగాణకు చోటు కల్పించింది. మొత్తం 15 తీర్మానాలలో నాలుగు ఇక్కడికి సంబంధించినవి ఉన్నాయి. తీర్మానాల చివరలో తెలంగాణ తీర్మానాలు పేరిట 1. కుదేలైన వ్యవసాయం,

**రాజధాని సందడి**
**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

సాగునీటి రంగాలు, 2.కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు – వైఫల్యాలు, 3. సంక్షోభంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ, 4.ప్రజాసంక్షేమం పట్టని కాంగ్రెస్ పాలకులు అనే నాలుగు తీర్మానాలను మహానాడులో చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అమలు చేయాలని, ఇచ్చిన ప్రతి ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేసింది. తెలంగాణలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ప్రభుత్వం ఏర్పడడానికి ఆరు నెలలే తేడా. అక్కడి ఆర్థిక పరిస్థితి దారుణంగానే ఉన్నా, ఎన్నికల హామీలను అన్నిటినీ అమలులోకి తీసుకురాకున్నా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై మహానాడు తీర్మానాలలో ఎత్తిచూపడం విడ్డూరం. టిడిపి కీలక మద్దతుతోనే కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారాన్ని మూడవసారి నిలుపుకోగలిగింది. అందుకు కేంద్ర ప్రభు త్వం నుంచి కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక ఆసరా, ఇతర పథకాలు, ప్రాజెక్టులు దేశంలో ఇతర రాష్ట్రాలకంటే మెండుగా లభిస్తున్నాయి. తెలంగాణకు మాత్రం రావాల్సినవి రాకపోగా, మునుపెన్నడూ లేనివిధంగా ఇక్కడ నుంచి బిజెపికి 8 ఎంపిలను ఇచ్చినా రాష్ట్రానికి పెద్దగా దక్కిందేమి లేదు.

**గత మహానాడులో నయం**

ఒంగోలులో 20 జరిగిన గత టిడిపి మహానాడు(2022)లో కాస్త నయం. అమలు కాని విభజన హామీలు అనే తీర్మానం కింద బయ్యారం స్టీల్ ప్లాంట్, ఖాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, వెనుబడిన జిల్లాల అభివృద్ధి, అసెంబ్లీ సీట్ల పెంపుదల అంశాలను ప్రస్తావించింది.

అన్నిటికి మించి తెలంగాణకు ఒక ప్రాజెక్టుకు జాతీయా హోదా ఇవ్వాలనే పునర్విభజన హామీ చట్టాన్ని ఉటంకిస్తూ కాళేశ్వరం లేదా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలన్న డిమాండ్‌పై కేంద్రం ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శపెట్టింది. అలాగే తెలంగాణకు నిధులు ఇవ్వడంపై కేంద్రం చిన్న చూపు చూస్తుందని కూడా తెలిపింది. ఇవి రెండు కీలక అంశాలను ఇప్పుడు కేంద్రంలో తమ ఆసరాతో మనుగడ సాగిస్తున్న ఎన్‌డిఏ ప్రభుత్వం ఉన్న సందర్భంలో టిడిపి తాజా మహానాడులో ప్రస్తావించలేదు.

సరికదా, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి రూ.80 వేల కోట్లతో మూడు దశల్లో 3 వేల టిఎంసిల గోదావరి వరద నీటి నుంచి 200 టిఎంసిల నీటిని రాయలసీమకు తరలిస్తామని మహానాడు తీర్మానంలో పేర్కొన్నారు. ఇది పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించిందే. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తన అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నది. అంతటి భారీ ఖర్చుతో నిర్మించడంపై ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొన్ని పార్టీలు, సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. పెండింగ్ ప్రాజెక్టులను వదిలేసి, ఇంత పెద్ద మొత్తంతో చేయడమేమిటని ప్రశ్నిస్తున్నాయి.

ఒకదశలో వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ తరహాలోనే తెలంగాణలో కూడా టిడిపి, బిజెపి, జనసేన కూటమిగా పోటీ చేస్తాయనే ప్రచారం జరిగింది. అది కాస్త తగ్గుముఖం పట్టింది. ఆ పార్టీకి హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లో ఇప్పటికీ కొంత మంది అభిమానులు ఉన్నారు. టిడిపి అవసరం లేకుండానే స్వంతంగానే బలపడే రాష్ట్రం తెలంగాణ అని బిజెపి భావిస్తోంది. తానెందుకు అవరోధం కావాలని టిడిపి అనుకుందేమో అందుకే అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌పైనే మొత్తం ఫోకస్ పెట్టినట్లు మహానాడు ద్వారా మరోసారి స్పష్టమైంది. అందుకే రెండు కళ్ళలో ఒక కన్నైన తెలంగాణ అంశాలను పెద్దగా పట్టించుకోలేదు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఫలించిన భారత్ దౌత్యం

### కొలంబియా ప్రకటన వెనక్కి

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ప్రాణాలు కోల్పో యిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడంపై కాంగ్రెస్ నాయ కుడు శశిథరూర్ వ్యక్తం చేసిన అసహనం ఫలితాన్నిచ్చింది. తమ సంతాప ప్రకటనను కొలంబియా వెనక్కి తీసుకుంది. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరి స్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అందులోభాగంగా థరూర్ నేతత్వంలోని బందం కొలంబియాకు వెళ్లింది. ఆ దేశ విదేశాంగ శాఖ ఉప మంత్రి రోసా యెలాండ్ విల్లావిసెన్సియోతో థరూర్ భేటీ అయ్యారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పూర్తి విషయాలు ఆయన తెలియజేశారు. అనం తరం యెలాండ్ మీడియాతో మాట్లాడుతూ తమ ప్రకటనను వెనక్కి తీసుకుం టున్నట్లు తెలిపారు. 'ఈ రోజు భారత బందం మాకు అన్ని విషయాలు తెలి యజేసింది. కశ్మీర్‌లో ఏం జరిగిందనేది పూర్తిగా తెలుసుకున్నాం. దాడులకు దారితీసిన పరిస్థితిపై అవగాహన వచ్చింది' అని వెల్లడించారు.

# సిందూర్ శౌర్యానికి చిహ్నం

### బుల్లెట్లతో దాడి చేస్తే ఫిరంగిగుండ్లతో సమాదానం ఇస్తాం

### పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించిన ప్రధాని మోదీ



**భోపాల్ :** పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన 'సిందూర్' శౌర్యానికి చిహ్నంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బుల్లెట్లకు ఫిరంగి గుండ్లతో సమాధానం ఇస్తామని పాకిస్థాన్‌ను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. 'ఆపరేషన్ సిందూర్'ను దేశ చరిత్రలోనే అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ఉగ్రవాద వ్యతిరేక ఆప రేషన్‌గా ఆయన అభివర్ణించారు. 'సిందూర్ ఇప్పుడు దేశంలో శౌర్యానికి చిహ్నంగా మారింది... మీరు బుల్లెట్లను పేల్చితే, వాటికి ఫిరంగి గుండ్లతో సమాధానం ఇస్తామని గుర్తుంచుకోవాలని పాక్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేరు ప్రఖ్యాతలు పొందిన రాణి 300వ జయంతి సంద ర్భంగా భోపాల్‌లో శనివారం జరిగిన లోక్‌మాతా దేవి అహ ల్యాబాయి మహిళా సశక్తీకరణ్ మహా సమ్మేళనంలో మోదీ పాల్గొని మాట్లాడారు. భారతదేశం సంస్కృతి, సంప్రదాయా లకు నిలయమని, సిందూరం మన సంప్రదాయంలో మహిళా శక్తికి చిహ్నమని అ'అ్నరు. రామభక్తిలో మునిగిపోయిన హను మాన్ జీ సిందూరాన్ని కూడా ఆస్వాదిస్తారని, శక్తి పూజలో మనం సిందూరాన్ని ఉపయోగిస్తామన్నారు. ఈ సిందూరం ధైర్యానికి చిహ్నంగా మారిందని ఆయన అన్నారు. మే ప్రారం భంలో భారత సాయుధ దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై క్షిపణి దాడులు చేసిన విషయం తెలిసిందే. వాటిలో జైషే మొహమ్మద్ బలమైన బహవల్పూర్, లష్కరే తోయిబా స్థావరం మురిద్కే ఉన్నాయి. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పౌరులను ఊచ కోత కోసిన రెండు వారాల తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో సైనిక దాడులు జరిగాయి. కాగా, పహల్గామ్‌లో, ఉగ్ర వాదులు భారతీయుల రక్తాన్ని చిందించడమే కాకుండా, మన సంస్కృతిపై కూడా దాడి చేశారని, వారు మన సమాజాన్ని విభ జించడానికి ప్రయత్నించారని మోదీ అన్నారు. అతి పెద్ద విషయం ఏమిటంటే ఉగ్రవాదులు భారతదేశ మహిళా శక్తిని సవాలు చేశారని అన్నారు. ఈ సవాలు ఉగ్రవాదులకు, వారి నిర్వాహకులకు చరమగీతంలా మారిందని చెప్పారు. ఆపరే షన్ సిందూర్ భారతదేశ చరిత్రలో ఉగ్రవాదులపై జరిగిన అతి పెద్ద, అత్యంత విజయవంతమైన ఆపరేషన్ అని, పాక్ సైన్యం ఊహించలేకపోయినా, మన సైన్యం ఉగ్రవాదుల స్థావరాలను నాశనం చేసిందని స్పష్టం చేశారు. ఈసారి 75 మంది మహి ళలు పార్లమెంటు సభ్యులు అయ్యారని, ఈ సంఖ్యను పెంచ డమే మాతమ ప్రయత్నమని తెలిపారు. నారీ శక్తి వందన్ అధి నియం వెనుక ఉన్న స్ఫూర్తి ఇదేనన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్ అంశాన్ని సాధించామన్నారు. దేశ రక్షణలో భార తదేశ కుమార్తెల సామర్థ్యాన్ని ప్రపంచం నేడు చూస్తోందని ప్రధానమంత్రి అన్నారు. సెయిలింగ్ బోట్‌లో ప్రపంచాన్ని విజ యవంతంగా చుట్టి వచ్చిన తర్వాత గోవాకు తిరిగి వచ్చిన భారత నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ రూప ఎ, ఆమె భాగస్వామి లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా కె గురించి ప్రస్తావిస్తూ, నేవీకి చెందిన ఇద్దరు ధైర్యవంతులైన కుమార్తెలు సుమారు 250 రోజుల సముద్ర ప్రయాణాన్ని పూర్తి చేశారని ప్రధాని అన్నారు. 'వారు మోటారుపై కాకుండా గాలిపై నడిచే పడవలో వేల కిలోమీటర్లు ప్రయాణించి భూమిని చుట్టి వచ్చా రని, 250 రోజులు సముద్రంలో ఉండడాన్ని ఒక సారి ఊహిం చుకోండని సూచించారు. అహిల్యాబాయి హోల్కర్ భారతదేశ వారసత్వ సంరక్షకురాలిగా ఉన్నారని, దేశ దేవాలయాలు, తీర్థ యాత్ర ప్రదేశాలు దాడికి గురైనప్పుడు వాటిని రక్షించారని కూడా ఆయన అన్నారు. 18వ శతాబ్దపు మాల్వాలోని హోల్కర్ రాజవంశానికి రాణి హోల్కర్. ఆమె అసాధారణ పాలన, సామాజిక సంక్షేమం పట్ల నిబద్ధత, సంస్కృతి, ఆధ్యా త్మికతకు చేసిన కృషి గుర్తుండిపోతుందన్నారు. కాగా, ప్రధాని మోదీ ముందుగా ఆమె 300వ జయంతిని పురస్కరించుకుని స్మారక స్టాంపు, రూ.300 నాణెంను విడుదల చేశారు.

# బిఎస్ఎఫ్ ధీర నారీ.. అసిస్టెంట్ కమాండర్ నేహా భండారీ

### అసాధారణ ధైర్యం ప్రదర్శించారని ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేదీ కితాబు

### 'ప్రశంస డిస్క్' ప్రదానంతో నేహాకు సత్కారం




**జమ్ము :** ఆపరేషన్ సిందూర్ సమయంలో అసాధా రణ ధైర్యాన్ని, కార్యచరణ నైపుణ్యాన్ని ప్రదర్శించిన సరిహద్దు భద్రతాదళం (బిఎస్ఎఫ్) అసిస్టెంట్ కమాండర్ నేహా భండారీని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ ప్రశంసాపత్రంతో సత్కరించారని శనివారం ఆర్మీ తెలిపింది.ఆపరేషన్ సిందూర్ సమ యంలో పారామిలిటరీ దళం, మాజీ సైనికుల పాత్రను కూడా ద్వివేదీ ప్రశంసించారని పేర్కొన్నది. చీఫ్ ఆర్మీ స్టాఫ్ (సిఓఎస్) ఉపేంద్ర ద్వివేదీ గురువారం తన రెండు రోజులు పర్యటన కోసం జమ్మూకు వచ్చారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అధ్యక్షత వహించిన అత్యు న్నత భద్రత సమీక్ష సమావేశానికి ఆయన హాజరయ్యారు. జమ్ముకశ్మీర్‌లోని పర్గ్వాల్ సెక్టార్‌లో కార్యాచరణ సంసి ద్ధతను ద్వివేదీ ఈ సందర్భంగా సమీక్షించారు. ఆయన ఆజ్ఞాపించిన దళాలున్న టైగర్ డివిజన్‌ను సందర్శించారు. ఆపరేషన్ సిందూర్‌లో అత్యద్భుత సామర్థ్యాలను ప్రదర్శిం చారని వారిని ప్రశంసించారు. 'భద్రతా దృక్పథంలో మార్పు చెందుతూ అప్రమత్తంగా ఉండాల్సిన ప్రాముఖ్య తను ఆయన నొక్కిచెప్పారు' అని భారత ఆర్మీకి చెందిన అడిషనల్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ (ఎడిజిపిఐ) శనివారం నాడు 'ఎక్స్'పోస్ట్‌లో రాశారు. ఈ సందర్భంగా ఉపేంద్ర ద్వివేదీ సైన్యంతో సరిహద్దు భద్రతా బలగాల సన్నిహిత కార్యాచరణ ఏకీకరణను ప్రశంసించారు. అంతేకాకుండా జమ్ములోని అఖ్నూర్ సెక్టార్‌లోని తన ఫార్వర్డ్ పోస్టులను రక్షించడంలో ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించిన అసిస్టెంట్ కమాం డర్ నేహా భండారీని కూడా ఆయన ప్రశంసించారని తెలియజేశారు. జనరల్ ద్వివేదీ సందర్శనకు సంబంధిం చిన అనేక చిత్రాలను ప్రదర్శిస్తూ ఆర్మీ ఈ విషయాన్ని వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భద్రతా బలగాలకు మాజీ సైనికులు ఇచ్చిన మద్దతు వెలకట్టలేని దని ఉపేంద్ర ద్వివేదీ ప్రశంసించినట్లు తెలియజేసింది. శుక్రవారం నాడు ఆర్మీచీఫ్ ఢిల్లీకి తిరిగివెళ్లేటప్పుడు సరి హద్దు భద్రతా దళం అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారీని ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆమె తన ఆపరేషనల్ సమర్థ తను ప్రదర్శించినందుకు ఆర్మీచీఫ్ అవార్డు ప్రదానం చేశారు. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న పాకి స్థాన్ పోస్ట్‌పై కనురెప్పవాల్చకుండా సరిహద్దును సంరక్షిం చేందుకు తన బృందాన్ని కమాండ్ చేయడంలో నేహా భండారీ అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారని ద్వివేదీ నేహా భండారీని ప్రశంసించారు. జీరోలైన్ వెంబడి శత్రుభూభాగానికి దగ్గరగా ఉన్న మూడు శత్రుశిబిరాలను శత్రుదేశ బలగాల చర్యలను బలంగా తిప్పికొట్టడంలో విజయం సాధించేలా నేహాభండారీ ధైర్యంగా తన బృందాన్ని నడిపించారు.సవాళ్లతో కూడిన పరిస్థితులలో కూడా ముందుకు మోహరించబడిన బిఎస్ఎఫ్ దళానికి నేహా భండారీ ధైర్యంగా నాయకత్వం వహించారని ప్రశం సించినట్లు ఆర్మీ తెలిపింది.

#### ఎవరీ నేహా భండారీ..?

ఉత్తరాఖండ్‌లోని మూడవ తరానికి చెందిన కుంటుంబం నుంచి అధికారిణిగా వచ్చిన నేహా ఆపరే షన్ సిందూర్ సమయంలో జమ్ము జిల్లాలోని అఖ్నూర్ సెక్టార్ యొక్క పర్గ్వాల్ ముందు భాగాన ఉన్న సరి హద్దు ఔట్‌పోస్ట్‌ను కమాండింగ్ చేయడానికి సరిహద్దు భద్రతా దళం తరపున సారథ్యం వహించారు. నేహా భండారీ తాత భారత సైన్యంలో పనిచేశారు. ఆమె తల్లి దండ్రులు ఇద్దరూ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్ పిఎఫ్)లో పనిచేశారు. నేహా భండారీ ఆమె కుటుంబం నుంచి వచ్చిన మూడవ తరం ఆఫీసర్‌గా ఇప్పుడు సైన్యం ప్రశంసలు అందుకుంటున్నారు. 'నా దళాలతో అంతర్జా తీయ సరిహద్దు వెంబడి ఒక పోస్ట్‌ను నిర్వహిస్తున్నందుకు నాకు ఎంతో గర్వంగాఉంది. నేను నిర్వహిస్తున్న పోస్ట్ అఖ్నూర్‌పర్గ్వాల్ ప్రాంతంలోని పాకిస్తాన్ పోస్ట్ నుండి దాదాపు 150మీటర్ల దూరంలో ఉంది' అని నేహా భండారీ 'పిటిఐ'కి చెప్పారు.

# అమెరికా సుంకాలతో ప్రతికూల ప్రభావం: జిటిఆర్ఐ



**న్యూఢిల్లీ:** ఉక్కు, అల్యూమినియంపై అమెరికా సుంకాలు రెట్టింపు చేయడంతో భారత ఎగుమతులు తీవ్రంగా ప్రభావిత మవుతాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జిటిఆర్ఐ) శని వారం పేర్కొంది. ఈ చర్య భారత ఉత్పత్తిదారులు, ఎగుమతిదా రుల లాభదాయకతను దెబ్బతీస్తుందని జీటీఆర్ఐ వ్యవస్థాప కుడు అజయ్ శ్రీవాస్తవ అన్నారు. భారత్‌పై ఈ పరిణామం ప్రత్యక్షంగా ఉంటుందని అన్నారు. ఈ సుంకాలకు ప్రతిస్పంద నగా అమెరికా ఎగుమతులపై భారత్ ప్రతీకార సుంకాలు విధి స్తుందో లేదో చూడాలని అన్నారు. గతంలో విధించిన ఉక్కు సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించే ఉద్దేశాన్ని సూచిస్తూ భారత్ ఇప్పటికే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో అధికారిక నోటీసు జారీ చేసిందని అన్నారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతు లపై ప్రస్తుతం ఉన్న 25 శాతం సుంకాలను రెట్టింపు చేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. 1962 నాటి అమెరికా వాణిజ్య విస్తరణ చట్టంలోని సెక్షన్ 232 కింద ఈ పెంపుదల చేశారు. విదేశాల నుండి దిగు మతులు జాతీయ భద్రతకు ప్రమాదంగా భావిస్తే సుంకాలు లేదా ఇతర వాణిజ్య పరిమితులు విధించడానికి ఈ చట్టం అను మతిస్తుంది. 2018లో ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకాలు విధించేందుకు ట్రంప్ మొదట ఈ సెక్షన్ వినియోగించారు. తిరిగి 2025 ఫిబ్రవరిలో ఉక్కు, అల్యూమిని యంపై సుంకాలను 25 శాతానికి పెంచారు. 202425లో, భారతదేశం అమెరికాకు 4.56 బిలియన్ డాలర్ల విలువైన ఇనుము, ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులు ఎగుమతి చేసింది. వీటిలో 587.5 మిలియన్ డాలర్ల ఇనుము, ఉక్కు, 3.1 బిలియన్ డాలర్ల ఇనుము లేదా ఉక్కు వస్తువులు, 860 మిలియన్ డాలర్ల అల్యూమినియం, సంబంధిత వస్తువులు ఉన్నాయి.

# మోదీ మౌనం వీడేదెప్పుడు?

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ నిలదీత



**న్యూఢిల్లీ :** తాజా పోరాటంలో భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహిం చింది తానేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెప్పుకుంటుండడపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎప్పుడు స్పందిసారని కాంగ్రెస్ ప్రశ్నించింది. కాంగ్రెస్ ప్రధాన కార్య దర్శి జైరామ్ రమేష్ ట్రంప్ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో ట్యాగ్ చేస్తూ, రెండు పొరుగు దేశాల మధ్య కాల్పుల విరమణలో తన పాత్ర ఉందని మోదీ గొప్ప స్నేహితుడు 21 రోజుల్లో 11వ సార్లు చెప్పుకున్నారన్నారు. దీనిపై మోదీ ఎప్పుడు స్పందిస్తారని నిలదీశారు. '20 రోజుల్లో 3 దేశా ల్లోని 3 నగరాల్లో ఇది 9వ సారి. డొనాల్డ్ భాయ్ 4 రోజుల భారత్–పాకిస్థాన్ యుద్ధాన్ని ఎలా ఆపారో అదే ఘటనల క్రమాన్ని పునరావృతం చేస్తూనే ఉన్నారు. మే 23న న్యూయార్క్‌లోని కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌కు సమర్పించిన పిటిష న్‌లో ట్రంప్ వాణిజ్య కార్యదర్శి సరిగ్గా అదే వాద నలు చేశారని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'కానీ డోనాల్డ్ భాయ్ స్నేహితుడు నరేంద్ర మోదీ తన వాదనలను పూర్తిగా మౌనంగా విస్మరిస్తూనే ఉన్నారు. ప్రధానమంత్రి ఎందుకు మాట్లాడరు? అని నిలదీశారు. ట్రంప్ వాదనలను స్పష్టం చేయాలని, భారత్, పాకిస్తాన్‌లను ఆయన హైఫన్ చేయడాన్ని వ్యతిరేకించాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ కోరుతోంది. భారత్, పాకిస్థాన్ మధ్య సమస్యలు ద్వైపాక్షికంగా, మూడవ పక్ష జోక్యం లేకుండా పరిష్కరించబడతాయని ప్రభుత్వం పేర్కొంది.

**మోదీ సమాధానం చెప్పాలి**

భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణకు మధ్యవ ర్తిత్వం వహించడానికి వాణిజ్య ఒప్పందం ప్రతిపా దించబడిందని అమెరికా పరిపాలన ఉన్నతాధి కారి ఒకరు యుఎస్ కోర్టుకు చెప్పిన తర్వాత, ప్రధాని నరేంద్ర మోడీ దేశం కంటే 'వాణిజ్యం' ఎందుకు ఎంచుకున్నారో సమాధానాలు చెప్పా లని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.. కాల్పుల విరమ ణకు మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ 11 సార్లు చెప్పినప్పటికీ, మోదీ దానిని ఒక్కసారి కూడా తిరస్కరించలేదని రణదీప్ సుర్జేవాలా అన్నారు. ఇప్పుడు, అఫిడవిట్ రూపంలో డాక్యు మెంటరీ ఆధారాలు కూడా అందుబాటులో ఉన్నా యని ఆయన అన్నారు. '... అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకుని పూర్తి స్థాయి యుద్ధాన్ని నివారిం చడానికి రెండు దేశాలు అమెరికాతో వాణిజ్య ప్రవే శాన్ని అందించిన తర్వాతే ఈ కాల్పుల విరమణ సాధ్యమైంది. ఈ సందర్భంలో అధ్యక్ష అధికా రాన్ని పరిమితం చేసే ప్రతికూల తీర్పు భారత్, పాకిస్తాన్ అధ్యక్షుడు ట్రంప్ ఆఫర్ చెల్లుబాటును ప్రశ్నించడానికి దారితీస్తుంది. ఇది మొత్తం ప్రాంతం భద్రతకు, లక్షలాది మంది జీవితాలకు ముప్పు కలిగిస్తుంది' అని సుర్జేవాలా పేర్కొన్నారు. ప్రధానిపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'మోదీ జీ, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి.

# కేరళ, అసోంలో వర్ష బీభత్సం

### వరద పోటుతో తీవ్ర నష్టం

### అసోంలో కొండచరియలు పడి ఐదుగురి మృతి




**తిరువనంతపురం:** ఈశాన్య, దక్షిణ రా ష్ట్రాల్లో వర్షాలు బీభత్సం సృష్టించగా... వరదలతో నష్టం వాటిల్లింది. నదులు పో టెత్తడంతో ఇళ్లు, రోడ్లు కొట్టుకుపోయి జనజీవనం అస్తవ్యస్థ మైంది. అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయలోనూ భారీ వర్షాలు కురిశాయి. 24 గంటలుగా ఎడతెరిపి లే కుండా కురిసిన వర్షా లతో అసోంలో కొండ చరియలు విరిగిపడి ఐదుగురు చనిపో యారు. చిరాంగ్, బక్సా, బరాపేట, బోంగైగావ్, బాజాలి, తము ల్పూర్, దర్రాంగ్, ఉదల్గురిలో శనివారం రెడ్ అలర్ట్ ప్రకటిం చారు. ఆరు జిల్లాలకు వరదకు రాగా 10 వేల మందికిపైగా నిరాశ్రయులయ్యారు. కామరూప్, కామరూప్ మెట్రోపాలిటన్ జిల్లాల్లో శనివారం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ఇచ్చారు. విద్యా సంస్థలన్నింటిని మూసివేశారు. ఈ మేరకు అసోం రాష్ట్ర విపత్తు వివారణ యంత్రాంగం (ఏఎస్‌డీఎంఏ) తెలిపింది. దక్షిణాది రాష్ట్రమైన కేరళను వరదలు ముంచెత్తాయి. చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీ వర్షా లతో రోడ్లన్నీ చెరువులయ్యాయి. నదుల ఉధృతికి ఆయా ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. కాసార్‌గాడ్‌లో మధువా హిని నది పోటెత్తింది. పరివాహక ప్రాంతాల్లో ఇళ్లు, రోడ్లు కొట్టు కుపోయాయి. కోజికోడ్, కన్నూర్ జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది. కొట్టాయంలో 46 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,136 మంది అక్కడ ఆశ్రయం పొందుతున్నారు.అలప్పుజా జిల్లా పరిసరాల్లోని 26 కేంద్రాలలో 851 మందికి పునరావాసం కల్పించారు. శుక్రవారం 19 ఇళ్లు దెబ్బతిన్నాయి. తిరువనంత పురం, కొల్లాం, పఠాన్‌మిట్ట, అలప్పుజా, కొట్టాయం, ఇడుక్కీ, ఎర్నాకులం, త్రిస్సూర్, మలప్పురం, కోజికోడ్, కన్నూర్ జిల్లాల్లో గంటకు 50 కిమీల వేగంతో గాలులు వీస్తూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. అసోంలో 24 గంటల్లో కురిసిన వర్షాల వల్ల కొండ చరియలు విరిగి పడి ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు కామరూప్ మెట్రోపాలిటన్ జిల్లా నివేదించింది. పట్టణ వ్యవహారాల మంత్రి జయంత మల్ల బరువా మాట్లాడుతూ గువహటి శివార్లలోని బొండా ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి శుక్రవారం ముగ్గురు మహిళలు చనిపోయారన్నారు. సహాయ, పునరావాస పనులు వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. కామరూప్ మెట్రోపాలిటన్, కామరూప్, కచ్చర్ జిల్లాల్లోని వరదలు సంభవించి, 10,150 మందిని రెండు శిబిరాలకు తరలించినట్లు ఏఎస్‌డీఎంఏ పేర్కొంది. ధీమాంజి, లఖింపూర్, గోలాఘాట్ జిల్లాలు ముంపు నకు గురైనట్లు తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో వరదలతో రెండు వేల మంది ప్రభావితం కాగా, ముంపు ప్రజలను తరలించ డంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ నిమగ్నమైనట్లు ఏఎస్‌డీ ఎంఏ వెల్లడించింది.

## లాలూకు దక్కని ఊరట



**న్యూఢిల్లీ:** ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. ఉద్యోగా లకు భూములు కేసులో సిబిఐ విచారణ నిలుపుదల కోరుతూ ఆయన వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరిం చింది. ఇప్పటికే ఈ అంశం ప్రత్యేక న్యాయమూర్తి ముందు వాదనలకు సిద్ధంగా ఉందని, ఈ తరుణంలో స్టే కుదరదని స్పష్టం చేసింది.

## విద్వేష ప్రసంగం కేసులో ఎమ్మెల్యే అబ్బాస్‌కు రెండేళ్ల జైలు



**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా విద్వేషపూరిత ప్రసంగం చేసిన కేసులో ఎమ్మెల్యేకి కోర్టు శిక్ష విధించింది. ఉత్త రప్రదేశ్‌లోని మావు జిల్లాలో ఎంపి/ఎమ్మెల్యే కోర్టు సుహల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీకి రెండేళ్ల జైలుశిక్ష విధిం చింది. ఇదే కేసులో దోషిగా తేలిన అబ్బాస్ అన్సారీ సన్నిహితుడు మన్సూర్ అన్సారీకి కూడా కోర్టు ఆరు నెలల జైలుశిక్ష విధిం చింది. విద్వేషపూరిత ప్రసంగం, ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులలో ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీ, అతడి సన్నిహితుడు మన్సూర్ అన్సారీలను ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు శనివారం దోషులుగా తేల్చింది. అబ్బాస్ అన్సారీకి రెండేళ్ల జైలుశిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించింది. మన్సూర్ అన్సారీకి ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

## తాజ్‌మహల్ రక్షణకు యాంటీ డ్రోన్ వ్యవస్థ

**ఆగ్రా:** తాజ్‌మహల్ రక్షణకు ప్రత్యేక యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేసి నట్లు అధికారులు పేర్కొన్నారు. అదనపు భద్రతలో భాగంగా పాలరాతి కట్ట డం వద్ద ఈ ఏర్పాట్లు చేశారు. తాజ్ సెక్యూర్టీకి చెందిన ఏసీపీ సయ్యద్ ఆరిబ్ అహ్మద్ మాట్లాడుతూ... తాజ్‌మహల్ పరిసరాల్లో ఎటువంటి డ్రోన్లను రాని వ్వకుండా యంటీ డ్రోన్ వ్యవస్థను అమర్చినట్లు చెప్పారు. చుట్టూ 500 మీ టర్ల మేర యాంటీ డ్రోన్ వ్యవస్థ నిఘా ఉంటుందన్నారు. ఎటువంటి డ్రోన్ కని పించినా దాన్ని గుర్తించి, ధ్వంసం చేస్తుందని ఆరిబ్ చెప్పారు. వాస్తవానికి యాంటీ డ్రోన్ వ్యవస్థ... సుమారు ఎనిమిది కిలోమీటర్ల పరిధి వరకు పనిచే స్తుందని, కానీ తాజ్ పరిసరాలను సెక్యూర్టీ సున్నిత ప్రదేశంగా భావిస్తూ కేవ లం 500 మీటర్ల పరిధికే పరిమితం చేసినట్లు అహ్మద్ తెలిపారు. రేడియో ఫ్రీ క్వెన్సీ, జీపీఎస్ సిగ్నల్ జామ్ టెక్నాలజీ ద్వారా యాంటీ డ్రోన్ వ్యవస్థ... డ్రో న్లను కూల్చుతుందని వివరించారు. డ్రోన్ కూలిపోగానే అక్కడకు ర్యాపిడ్ రెస్పాన్స్ బందం వెళ్తుందని, తర్వాత ఆ లొకేషన్‌ను ఆధీనంలోకి తీసుకుంటా రని చెప్పారు. డ్రోన్‌ను ఆపరేట్ చేసిన వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకోను న్నట్లు తెలిపారు.

# తొమ్మిది మంది ఉగ్రవాదుల అరెస్ట్



**ఇంఫాల్:** మణిపూర్‌లోని వివిధ నిషేధిత సంస్థ లకు చెందిన తొమ్మిదిమంది ఉగ్రవాదులను భద్ర తా దళాలు అరెస్ట్ చేశాయని శనివారం పోలీసులు తెలిపారు. దోపిడీ కార్యకలాపాలకు పాల్పడుతు న్నారనే ఆరోపణలపై బిష్ణుపూర్ జిల్లాలోని లీమా పోక్‌పామ్ నుండి నిషేధిత కాంగ్లీ యావోల్ కన్న లూప్ (కేవైకేఎల్)కు చెందిన ముగ్గురు క్రియాశీల కార్యకర్తలను గురువారం అదుపులోకి తీసుకున్న ట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. వారి నుం డి రెండు తుపాకులు, మందుగుండు సామగ్రి స్వా ధీనం చేసుకున్నామని అన్నారు. శుక్రవారం తెం గ్నౌపాల్ జిల్లాలోని గ్యాంగ్‌పిజాంగ్ గ్రామం నుం డి నిషేధిత పీఎల్ఏకు చెందిన ముగ్గురు కార్యకర్త లను, ఇద్దరు సభ్యులను భద్రతా దళాలు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిషేధిత కేసీపీ (పీడబ్ల్యూజీ)కి చెందిన క్రియాశీల కార్యకర్తను ఇంఫాల్‌లోని వెస్ట్ జిల్లా యమ్నామ్ హుయిద్రోమ్ ప్రాం తం నుండి అరెస్ట్ చేశామన్నారు. లోయ ప్రాం తాల్లో దోపిడీ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు అతనిపై ఆరో పణలు వచ్చాయని పోలీసులు తెలిపారు.

## టర్కీతో లీజు ముగించాలి... 'ఇండిగో'కు కేంద్రం ఆదేశం

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు టర్కీ మద్దతు ఇవ్వడాన్ని కేంద్రం జీర్ణించుకోలేకపోతోంది. దీంతో టర్కీకి షాకుల మీద షాకులిస్తోంది. ఇండిగోను టర్కిష్ ఎయిర్ లైన్స్‌తో తన విమానాల లీజు ఒప్పందాన్ని మూడు నెలల్లోగా ముగించాలని కేంద్రం ఆదేశించింది. ఢిల్లీతో సహా భారత్ లోని తొమ్మిది కీలక విమానాశ్రయాలలో సేవలను నిర్వహించిన టర్కీ సంబంధిత సంస్థ సెలెబి ఏవియేషన్‌కు భద్రతా అనుమతిని ప్రభుత్వం రద్దు చేసిన కొ న్ని వారాల తర్వాత టర్కీకి మరో దెబ్బ తగిలేలా చేసింది. ఇండిగో 'డంప్ లీ జు' ఒప్పందాన్ని ఆగస్టు 31, 2025 నాటికి రద్దు చేస్తామని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. ప్రస్తుతం, ఇండిగో టర్కిష్ ఎయిర్‌లైన్స్ నుంచి డంప్ లీజుకు రెండు బోయింగ్ 777300 ఈఆర్ విమానాల ను తీసుకొని దిల్లీ, ముంబై నుంచి ఇస్తాంబు ల్‌కు విమానాలను నడుపుతోంది. వాస్తవానికి ఈ లీజు గడువు మే 31న ముగియాల్సి ఉండగా, ఇండిగో అభ్యర్థన మేరకు డీజీ సీఏ దానిని మరో మూడు నెలలు పొడిగించింది. లీజును ఆరు నెలలు పొడిగించాలని ఇండిగో కోరగా డీజీసీఏ దానిని తిరస్క రించింది.

## దేశ సంక్షేమం కోసమే డిఎంకెతో పొత్తు: కమల్



**చెన్నై:** దేశ సంక్షేమం కోసమే డీఎంకే కూటమిలో చేరా మని మక్కల్ నీదిమయ్యం(ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ చెప్పారు. డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులను మర్యాదపూర్వకంగా ఆయన కలుసుకున్నారు. జూన్ 19న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీకి ఓ సీటిచ్చి నందుకుగాను ఆయన స్టాలిన్, డీఎంకే నేతలకు ధన్యవా దాలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కుదిరిన పొత్తుల ప్రకారం లభించిన రాజ్యసభ స్థానానికి కమల్ పోటీ చేయనున్న విషయం విదితమే. ఈ భేటీ అనంతరం కమల్‌హాసన్ అన్నా అరివాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. మక్కల్ నీది మయ్యంకు రాజ్యసభ స్థానం కేటాయించినందుకుగాను ముఖ్య మంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులను కలుసుకుని కతజ్ఞతలు తెలిపానని చెప్పారు. రాజ్యసభ ఎన్నికల ముందస్తు ఏర్పాట్ల గురించి స్టాలిన్ తనకు సమగ్రంగా వివరించారని తెలిపారు. దేశ సంక్షేమానికి అవసరమై నందున డీఎంకే కూటమిలో చేరినట్లు ఆయన చెప్పారు. ఇకపై రాజ్యసభలో రాష్ట్రానికి సంబంధించిన సమస్య లపై మాట్లాడి పరిష్కరించేందుకు దోహదపడతానని చెప్పారు. రాష్ట్ర సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని కమల్ హాసన్ అన్నారు.

## 'టైగర్ మ్యాన్' వాల్మీక్ థాపర్ కన్నుమూత



**న్యూఢిల్లీ:** ప్రఖ్యాత పులుల సంరక్షణ కారుడు, రచయిత వాల్మీక్ థాపర్ (73) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన శనివారం ఉదయం దిల్లీలోని కౌటిల్య మార్గ్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. థాపర్... తన జీవితాన్ని నాలుగు దశాబ్దాలకు పైగా వన్యప్రాణుల సంరక్షణకు అంకితం చేశారు. ముఖ్యంగా పులుల రక్షణలో వాల్మీక్ థాపర్ ప్రత్యేక దష్టి సారించారు. ఆయన దిల్లీ విశ్వవిద్యాలయంలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి సోషియా లజీలో గోల్డ్‌మెడల్ సాధించారు. లివింగ్ విత్ టైగర్స్, ది సీక్రెట్ లైఫ్ ఆఫ్ టైగర్స్ వంటి దాదాపు 30కి పైగా పుస్తకాలు రచిం చారు. ఆయనకు 'ఇండియన్ టైగర్ మ్యాన్'గా మంచి గుర్తింపు ఉంది. వాల్మీక్ థాపర్ మతి వార్త తెలుసుకున్న రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలియజేస్తు న్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ఆయన చేసిన కషిని కొనియాడారు. లోధి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు దరఖాస్తులు

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** ఎస్సీ విద్యార్థిని, విద్యార్థుల కోసం 2025/26 విద్యా సంవత్సరానికి గానూ బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఇంగ్లీష్ మీడియం ఒకటవ తరగతి (డేస్కాలర్), ఐదవ తరగతి (రెసిడెన్షియల్) చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారిణి కె.దయానందరాణి ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తిగల విద్యార్థి, విద్యార్థులు వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 1 ఏప్రిల్ 2025 వరకు గ్రామీణ ప్రాంతాల వారు (రూ.లక్ష యాభైవేల లోపు ఆదాయం), పట్టణ ప్రాంత వాసులు (రూ.రెండు లక్షల లోపు) ఆదాయం కలిగి ఉండాలని అన్నారు. కుల, ఆదాయ, నివాస పత్రాలు, జనన, రేషన్, ఆధార్, చదువుతున్న పాఠశాల బోనోఫైడ్, రెండు పాస్‌ఫోటోలతో జూన్ 2వ తేదీ వరకు తమ కార్యాలయంలోని రూమ్ నెంబర్ ఎస్3లో అందజేయాలన్నారు. 16 జూలై 2025 సాయంత్రం ఐదు గంటల వరకు వీటిని సమర్పించవచ్చని తెలిపారు. 20వ తేదీన ఉదయం 11 గంటలకు డ్రా ద్వారా స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. దీనిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సమాజంలో డ్రగ్స్, గంజాయి అనేవి వినాశకాలని, యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని, డ్రగ్స్ నిర్మూలనతో ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. శనివారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై యువత జీవితాలను నాశనం చేస్తున్న మహమ్మారిపై శ్రద్ధ వహించి నిర్మూలించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరించిన వారిలో




అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణరావు, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

## దిక్కు మొక్కూ లేకుండా పోయిన బిసి డిక్లరేషన్ : ధూళిపాళ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** గత శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో బీసీ డిక్లరేషన్ దిక్కు, మొక్కు లేకుండా పోయిందని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ్ నాయుడు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని బీసీ కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కమిటి సభ్యులు సోమగాని కృష్ణ,జడ వెంకన్నలతో కలిసి మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించాలని కులగణన చేపట్టినప్పటికి దానిని షెడ్యూల్ తొమ్మిదిలో చేర్పించడంలో వైఫల్యం చెందారన్నారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నల్ల బ్యాడ్జీలతో నిరసన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** 2023లో రెగ్యులర్ అయిన జూనియర్ లెక్చరర్లకు రెండవ వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ శనివారం కేపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న స్పాట్ వాల్యుయేషన్ క్యాంపులో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఎలాంటి రిమార్కులు లేకుండా ప్రొబేషనరి పిరియడ్ పూర్తి చేసుకోవడం జరిగిందని, పై అధికారుల నుంచి ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు లేనప్పటికీ ఇంక్రిమెంట్ మంజూరు చేయలేద న్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సాయిలు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శు లు రజిని కాంత్, లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, హరికృష్ణ, వెంకన్న, వసురాం, కృష్ణ, వెంకటాచారి, భాస్కర్, అనిత, విజయభారతి, గౌసియా, శ్వేత, పరుశురాం, రవి తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 6న వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ



**ప్రజాపక్షం/చండూరు :** జూన్ 6న చండూరు మండల కేంద్రంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం చండూరు మండల కార్యదర్శి ఇరిగి సంజీవ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెడుబుద్ది ఊషయ్యతో కలిసి మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్6న చండూరులోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మ భవనంలో జరుగు మండల మహాసభకు ముఖ్య అతిధిలుగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య , జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పాల్గొన్ననున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ కార్మికుల సమస్యలపై , భవిష్యత్ కార్యచరణపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు మండలంలోని వ్యవసాయ కార్మికులు, ఉపాధిహామీ కూలీలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డం లింగయ్య , చంద్రమౌళి, గడ్డం మల్లయ్య ,గడ్డం పరమేష్ , శివర్ల లింగస్వామి ఇరిగి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


## నకిలీ విత్తనాలు అమ్మితే ఉపేక్షించొద్దు

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మునుగోడు:** వ్యవసాయరంగం రైతులకు లాభసాటి సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సూచించారు. శనివారం మునుగోడు మండల కేంద్రంలో డివిజన్ వ్యవసాయ అధికారి ఏడిఏ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను సన్మానించారు.ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై నిఘా ఉంచాలన్నారు. ఫర్టిలైజర్ పెస్టిసైడ్ బయో మందుల అమ్మకాల్లో తగు సూచనలు చేయాలని కోరారు. నకిలీ బయోమందులను అంటగట్టే యజమాలను ఉపేక్షించకుండా కఠిన చర్యలు చేపట్టి వారి పైన కేసులు నమోదు చేయాలన్నారు. దేశంలో రైతాంగం బాగుంటేనే అభివృద్ధి ముందుకు సాగుతాదని అభిప్రాయం వ్యక్తం చేశారు.నిజాయితీగా పనిచేసే అధికారులకు తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడి ఏ వేణుగోపాల్,మునుగోడు ఏఓ పద్మజ, ఏఈఓ లు మౌనిక, నరసింహ, వెంకటేష్,వహీద్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బిసి గురుకులంలో డిగ్రీ అడ్మీషన్లు




**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ మహాత్మా జ్యోతిబా పూలే పురుషుల గురుకుల డిగ్రీ కళాశాల, మొదటి సంవత్సరం ప్రవేశానికి అర్హత సా ధించిన విద్యార్థులు మే 30 నుండి, జూన్ 6 వరకు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా కళాశాలను సంప్రదించవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత, ఒక ప్రకటనలో తెలిపారు . డిగ్రీలో మొదటి సంవత్సరం లో ప్రవేశానికి మొదటి విడత అడ్మిషన్స్ ప్రక్రియ జూన్ 6 వరకు జరుగుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇతర వివరాలకు 880 1521626, 8179665589 నంబర్లను సంప్రదించాలని ఆమె తెలిపారు.

# రాష్ట్రావతరణ దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

లోటుపాట్లకు తావులేకుండా అట్టహసంగా వేడుకలు



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అధికారులు పకడ్బంది ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహసంగా వేడుకలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిభింబించేలా వివిధ శాఖల ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అమరవీరుల స్తూపం వద్ద సభాస్థలి వేదికను పూలతో అందంగా అలంకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ గౌరవ వందనంతో పాటు వేడుకలలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు అదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డిఈవో అశోక్‌కు చెప్పారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లపై అధికారులతో కలిసి పరిశీలించారు. స్టేజీ, స్టాల్స్ ఏర్పాట్లకు అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట డిఆర్‌డివో వివి అప్పారావు, ఎఆర్ డిఎస్‌పి నర్సింహాచారి, ఎస్సీ కార్పోరేషన్ ఎడి శ్రీనివాస్‌నాయక్, మైనార్టీ అభివృద్ధి అధికారి జగదీశ్వరరెడ్డి, డిటిడివో శంకర్, కార్యాలయ అధికారి సుదర్శన్‌రెడ్డి, డిప్యూటి సిఈవో శిరీష, ఇంజనీర్లు కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, డిపివో యాదయ్య పాల్గొన్నారు.

**జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి :** జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ లో శనివారం జూన్ 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సము దాయ భవన ఆవరణలో ఉదయం 10:00 గంటలకు నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఆర్డి ఓ శ్రీనివాస రావు, ఏఓ భూపాల్ రెడ్డి, డి.ఎస్.పి. మొగులయ్య, తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ దశరథ్ పాల్గొన్నారు.



## ఉద్యోగ విరమణ విశ్రాంత జీవితానికి సోపానం

-యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** ఉద్యోగ జీవితంలో నిత్యం ప్రజాపాలనలో సమయం లేక కుటుంబంతో, బంధువులతో ప్రశాంతత లేకపోవడం ,ఉద్యోగ విరమణతో విశ్రాంత జీవితానికి సోపానం కావాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు.శనివారం తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో తుర్కపల్లి మండల ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీ బాయి పదవి విరమణ సభను ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీ బాయిని సన్మానించి మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీ బాయి రికార్డు అసిస్టెంట్ స్థాయి నుండి వివిధ హోదాల్లో పనిచేస్తూ, ఎంపీడీవో స్థాయికి ఎదగడం అనతి కాలంలోనే మండల స్థాయి ప్రజల మన్ననలు పొందడం ఆమె అంకిత భావానికి నిదర్శనమని అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో 43 సంవత్సరాలుగా పనిచేసిన ఎంపీడీవోను ఆదర్శంగా తీసుకొని మిగతా ఎంపీడీవో, ఉద్యోగులు జిల్లా స్థాయిని అగ్రగామిలో నిలుపుటకు తమ వంతు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పి సీఈవో శోభారాణి, డిఆర్‌డిఓ నాగిరెడ్డి, జెడ్పి డిప్యూటీ సీఈవో విష్ణువర్ధన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి మోతిలాల్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, సీఈవో రాఘవేంద్రరావు, రిటైర్డ్ డిప్యూటీ సీఈవో భగవాన్ రెడ్డి, పంచాయతీరాజ్ మినీ స్టేరియల్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, టీజీవో రాష్ట్ర కోశాధికారి మందడి ఉపేందర్ రెడ్డి రెడ్డి పాల్గొన్నారు.




## దేవరకొండ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి

డిండి పూర్తి చేస్తా....ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/డిండి:** దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం డిండి మండలంలోని చెరుకుపల్లి గేట్ వద్ద శ్రీరాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన డిండి మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల గ్రామాల వారిగా ముఖాముఖి సమావేశంలో ఎంఎల్‌ఏ బాలునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో దేవరకొండను రాష్ట్రంలోనే ఒక గొప్ప ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించేది లేదని ఎంఎల్‌ఏ స్పష్టం చేశారు. గత పదేళ్ల కాలంలో డిండి పూర్తిగా కుంటుపడిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎదుల రిజర్వాయర్ నుండి డిండి రిజర్వాయర్‌కు నీటిని తీసుకురావడం కోసం ప్రభుత్వం నుండి రూ. 1800 కోట్లు మంజూరు చేయించి, టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని త్వరలో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, పార్టీ అధ్యక్షులు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, యాదగిరిరావు, భాస్కర్ రెడ్డి, నాగార్జునరెడ్డి, రాంకిరణ్, జంగారెడ్డి, లక్పతి, గోపాల్‌రావు, సుమిత్‌రెడ్డి, మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూన్ 2న ప్రజావాణి రద్దు : కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో జూన్ 2వ తేదీన నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరగదని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని, ఫిర్యాదులు ఇచ్చేందుకు రావద్దని తెలిపారు.

## పొగాకు ఆరోగ్యనాశనకారి : డిఎంహెచ్‌ఓ



**ప్రజాపక్షం/యాదాద్రి :** పొగాకు వాడడం వలన ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు వాటిల్లే ప్రమాదం ఉందని యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యం.మనోహర్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరం ఇచ్చిన నినాదం మెరిసే ఉత్పత్తులు, చీకటి ఉద్దేశాలు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని తేది: 31.05.2025 భువనగిరి పట్టణంలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నుండి జగదేవ్ పూర్ చౌరస్తా వరకు జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డా.యం.మనోహర్ జండా ఊపి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించబడుతుంది. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం ప్రజలకు పొగాకు సేవించడం వల్ల కలిగే ఆరోగ్య నష్టాలపై అవగాహన కల్పించడం. పొగాకు ఉత్పత్తులు ఐన సిగరెట్లు, చుట్టలు, బీడీలు, గుట్కా, ఖైనీ, జర్దా మొదలైనవాటి అన్నింటి లోనూ నికోటిన్ అనే వ్యసనపరచే రసాయన పదార్థం ఉంటుంది. ఇది శరీరాన్ని అధికంగా ఆకర్షించి శారీరక, మానసిక నాశనానికి దారితీస్తుంది. ధూమపానం నేరుగా ఊపిరితిత్తులకు హాని చేస్తుంది. ఇది గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, సంతాన లేమి, మరియు నోరు, గొంతు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి అనేక ప్రమాదకర వ్యాధులకు ప్రధాన కారణంగా ఉంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డియంయచ్‌ఓ డా.యల్. యశోద, ప్రోగ్రాం అధికారులు డా.రామకృష్ణ, డా.వీణ, సైకియాట్రిస్ట్ డా.ప్రీతి స్వరూప్, డా.నిరోష వైద్యాధికారి, డెమో అంజయ్య, సిహెచ్‌ఓ జ్ఞానేశ్వర్, పి.వసంత కుమారి, డిపిహెచ్‌ఎన్‌ఓ, డి.సత్యవతి, డిపిసి జి.ఇస్తారి, డిపిసి మరియమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు , వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 లక్షల విలువైన 115 సెల్‌ఫోన్లు రికవరి

బాధితులకు అందజేత


జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మా వెల్లడి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** సెల్‌ఫోన్లు చోరీ కావడం, పోగోట్టుకున్నవారికి సంబంధించి రూ.20 లక్షల విలువైన 115 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరి చేశారు. పోర్టల్ నందు ఫిర్యాదు చేసుకున్న బాధితులకు తిరిగి వారికి అందజేశారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి కె.నర్సింహా సెల్‌ఫోన్ల రికవరి సంబంధించిన విషయాలను వెల్లడించారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్‌కు ప్రతి ఒక్కరికి నిత్యసవరమైందని, దీని కమ్యూనికేషన్ కోసం ఆన్‌లైన్, విద్య, బ్యాంక్ అకౌంట్స్, పాస్‌వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వాటిని ఫోన్లలో నిక్షిప్తం చేసుకోవడం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్లు పొగొట్టుకున్న అందులో ఉన్న సమాచారం పోవడంతో అవి నేరస్తులకు దొరికితే బ్యాంకులోని డబ్బులను కాజేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 350 మొబైల్ ఫోన్లు పోయినట్లు సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇందులో ఇప్పటి వరకు 250 ఫోన్లను రికవరి చేసి బాధితులకు అందజేశామన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా తమ శాఖ పనిచేస్తుందన్నారు. మొబైల్ ఫోన్లు పోయినా, చోరికి గురైనా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎ స్‌పి రవీందర్‌రెడ్డి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణ్‌రావు, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్ ఐటికోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

## జూన్ 3 నుండి 20 వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 3 నుండి 20 వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం ఆమె ఉదయాదిత్య భవన్లో తహసీల్దార్లు , సర్వేయర్లు,సీనియర్,జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తో రెవెన్యూ సదస్సుల నిర్వహణ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ సేవలను సరళతరం చేయడం, ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు గాను ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదన్నారు. 3 నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిస్తున్నారని తెలిపారు.ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ ,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్‌డిఓలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి ఉన్నారు.

**రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలే:**

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2 న పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులతో కోరారు.రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా శకటాలను ప్రదర్శించాలని, అదే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, అత్యవసర సేవలను అందించే వైద్య ఆరోగ్య, ఫైర్ ,ఆర్అండ్ బి తదితర శాఖలు వారి శాఖల ద్వారా ముఖ్యమైన సేవలు ప్రజలకు తెలిసే విధంగా ప్రదర్శించాలని అన్నారు.రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా పోలీస్ పరేడ్ మైదానంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని డీఈఓ ను ఆదేశించగా, వేడుకలకు వచ్చే వారందరికి కుర్చీలు, తాగునీరు ,టెంట్లు,ఇతర ఏర్పాట్లు చేయాలని కోరారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం సైతం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, వేడుకల నిర్వహణలో భాగంగా పోలీస్ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ప్రజా ఆరోగ్యానికి ప్రాముఖ్యత

**ప్రజాపక్షం/ నిడమనూరు:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇస్తుందని నాగార్జునసాగర్ శాసనసభ్యుడు కుందూరు జయవీర్ రెడ్డి తెలిపారు. శనివారం నిడమనూరు మండల కేంద్రంలో ఒక కోటి 56 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ పుట్ల శ్రీనివాస్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయ వీర్ రెడ్డి మాట్లాడుతూ నిడమనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దురదృష్టవశాత్తు విద్యుత్ ఘాతానికి నెల రోజుల్లోనే నూతన భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మండల పరిధి పార్వతీపురం గ్రామంలో 20 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ కేస రవి, తాసిల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో బోనగిరి రమేష్, మండల వైద్యాధికారి అరవింద్ కుమార్, డాక్టర్ రమ్య, సూపర్వైజర్లు స్టెల్లా,రజని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం తదితరులు పాల్గొన్నారు.



## పొగతాగితే రోగాలొస్తాయి..




ప్రజాపక్షం/సిర్పూర్‌టిః పొగతాగితేరోగాలొస్తాయి.. ప్రాణాలూ పోతాయి.. అంటూ సిర్పూర్ టిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజల్లో చైతన్యం నింపేందుకు శనివారంఅవగాహన ర్యాలీ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లాం ర్యాలీలో పాల్గొని, పొగాకు వినియోగం వల్ల కలిగే భయంకరమైన పరిణామాలను వివరించారు. కోర్టు ఆవరణ నుంచి బస్ స్టాప్ వరకు సాగిన ర్యాలీలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు. జడ్జి అజయ్ ఉల్లాం మాట్లాడుతూ, పొగాకు అనేది కేవలం ఒక అలవాటు కాదని, అది ప్రాణాంతకమైన వ్యాధులకు దారితీసే ఒక వ్యసనమని అన్నారు. న్యాయవాదులు కిషోర్ కుమార్, గంట కళ్యాణ్, సిఐ ముత్యం రమేష్, ఎస్ఐ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



ప్రజాపక్షం/కుంటాల : ఎవరైన కల్తీ ఎరువులు,నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ కమల్ సింగ్ హెచ్చరించారు.శనివారం మండలంలోని కుంటాల,అంబకంటి,ఓలలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాలు, పురుగు మందుల ప్యాకింగ్, లేబుళ్లు, అమ్మకాల రిజిస్టర్లను పరిశీలించారు.ధరల పట్టిక, విత్తన ప్యాకెట్ల వివరాలు, షాపు బోర్డుపై ఉంచాలన్నారు. విత్తనాలు,ఎరువులను విక్రయించిన సమయంలో రశీదు ఇవ్వాలన్నారు.ఎఒ విక్రమ్, ఎస్ఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.

## ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



ప్రజాపక్షం/బోధన్ః బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పట్టణ పోలీసులుదాడులు చేపట్టారు. ఈ దాడిలో ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు పట్టణ సీఐ వెంకట్ నారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి 1970రూపాయాల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

## పేదల పక్షాన పోరాడేది సిపిఐ



ప్రజాపక్షం/కోటగిరిః పేదల పక్షాన నిలబడి పోరాడే ఏకైక పార్టీ సిపిఐ అని మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో, సుద్దులం గ్రామంలో సిపిఐ మహాసభ నిర్వహించారు. విఠల్ గౌడ్ మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఈ మహా సభలు నిర్వహిస్తామన్నారు. సుద్దులంలో గ్రామ కార్యదర్శి గోపాల్ రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఐ నాయకులు విఠల్ గౌడ్, నల్ల గంగాధర్ మాట్లాడారు. రాజకీయ నాయకుల జోక్యం లేకుండా అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు ఇవ్వాలని, ప్రస్తుతం ఉపాధి హామీ పని చేసిన డబ్బులు సమయానికి రావడం లేదని ఈ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని తీర్మానం చేశారు. గ్రామశాఖ సభ్యులు బి.శంకర్ బాబురావు, గోపి, లక్ష్మణ్, గోపి, సాయిలు, దిగంబర్ పాల్గొన్నారు.

## హైకోర్టు జడ్జిని కలిసిన పోలీస్ కమిషనర్



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్య శనివారం నిజామాబాద్ ఆర్ అండ్ బి గెస్టు హౌస్‌లో హైకోర్టు జడ్జి కె. సుజనను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. హైకోర్టు జడ్జి పోలీసు కమిషనర్‌ని స్వాగతిస్తు అభినందించారు.

## కార్మికుల బకాయి బిల్లులు చెల్లించాలి




ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ జిల్లాకు కోటి నలభై మూడు లక్షల 84 వేల 13 రూపాయలు బకాయి బిల్లులు వెంటనేచెల్లించాలని ఎఐటియుసి మధ్యాహ్న బోజన కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి అన్నారు. శనివారంస్థానిక ఎఐటియుసి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి, ఏప్రిల్ నెలల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, 12 నుండి పాఠశాల పునః ప్రారంభం అవుతున్నందున బిల్లులు ఇస్తేనే వంట చేయగల అవకాశం ఉందన్నారు. ఎండిఎం బిల్లులు ఆరునెలలైనా ఇవ్వడం లేదు, రాష్ట్ర ప్రభుత్వానికి ఒకటే డిమాండ్ చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఈనెల జూన్ 9వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముట్టడి, ఛలో నిజామాబాద్ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి హనుమాండ్లు, జిల్లా కమిటి సభ్యురాలు రమ్య పాల్గొన్నారు.


## నెలరోజులు..పోలీస్ యాక్ట్ అమలు

### సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధిః జిల్లాలో నెల రోజుల పాటు 30,30 (ఎ) పోలీసు యాక్ట్ అములులో ఉన్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెలరోజుల పాటు (జూన్1వ తేది నుండి30వరకు)జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ 1861 అములులో ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు ప్రజా,ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు , ర్యాలీలు ,పబ్లిక్ మీటింగ్స్ ,సభలు ,సమావేశాలు నిర్వహించరాదని శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా ప్రజాదనానికి నష్టం కల్గించే ఏలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు ,ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబందిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలియజేశారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



ప్రజాపక్షం/సోన్ : సోన్ మండలం కద్తాల్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు.వర్షాలతో తడిసిన ధాన్యంను సైతం ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు.కల్లాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,మార గంగారెడ్డి,హరీష్ రెడ్డి,నర్సయ్య,సవీన్, గంగాధర్‌తో పాటు ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో రైతుల కష్టాలు తీరాయి

### మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ నస్పూర్ : భూ భారతితో రైతుల కష్టాలను తీర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి దనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌ఏలు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్ వెంకటస్వామి, రామారావు పటేల్, ఎంఎల్‌సిలు కొమురయ్య, దండే విఠల్, నాలుగు జిల్లాల కలెక్టర్లు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వరిధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, వానాకాలం పంట సన్నద్ధత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గత ప్రభుత్వం కాలయాపన చేస్తూ రైతులను కూలీలుగా మార్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ భారతి ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించి రైతులకు భూమి హక్కులు కల్పించిందని అన్నారు. ట్రైబల్ ఏరియాలోని ఉట్నూర్ ఐటిడిఎకు 5,000 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందాలని అధికారులను ఆదేశించారు. వానాకాలం పంట సన్నద్ధతపై సమీక్షిస్తూ, ఫర్టిలైజర్, కల్తీ విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని, కల్తీ విత్తనాలు అమ్మేవారిపై కఠినంగా వ్యవహరించాలని సూ చించారు. లబ్ధిదారుల ఎంపిక, పథకాల అమలులో అలసత్వం వహిస్తే అధికారులపై చర్యలు త ప్పవని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని, అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రైతులకు సంబంధించిన సమస్యలను, వానాకాలం పంట సన్నద్ధతకు సంబంధించిన వివిధ అంశాలను మంత్రి సీతక్క అధికారులతో చర్చిం చి తీసుకున్న నిర్ణయాలను తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిత్యం రైతులకు చేదోడుగా ఉండాలన్నారు.

## ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు సంయుక్తంగా పనిచేయాల్సిందిగా ఆదేశించారు.తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణలో భాగంగా కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, వివిధ శాఖల తరపున శకటాలు ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాలు)ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ, డీపీఆర్ఓ సంయుక్తంగా కలిసి తయారు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు తగు ఏర్పాట్లను ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యుద్దీపాలతో అలంకరించాలని కలెక్టర్ కోరారు.

## పొనకల్–బాదంపెల్లి బ్రిడ్జికి నిధులు మంజూరు



ప్రజాపక్షం / జన్నారం : జన్నారం మండలంలోని పొనకల్ నుండి పుట్టిగూడ మీదుగా బాదంపెల్లి వెళ్లే మార్గంలోని శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి నిర్మాణానికి ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ రూ.1.54 కోట్లు మంజూరు చేయించారు. దీంతో పుట్టిగూడ, బాదంపెల్లి గ్రామాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఎంఎల్ఏ వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముజఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు సయ్యద్ ఇసాక్, కస్తూరి భూమన్న, దాముక కర్ణాకర్, బెడద సత్తయ్య, పాదం రాకేష్, నాయిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక, మొరం

### నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇసుక, మొరం అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తహసీల్దార్లకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంఓ ప్రత్యేక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలకు ముందుకొచ్చే వారికి సరిపడా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇసుకను రవాణా చేసే వాహనాలకు ప్రత్యేకంగా జారీ చేసిన వే బిల్లులను అందించాలని అనుమతుల విషయంలో అనవసర ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరిట ఇసుక పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే ఎంపీడీఓలు, ఎంపీఓలను సంప్రదించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులను నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. వర్షాలు ప్రారంభమైతే వాగులు, నదులలో వరద జలాలు చేరుకుని ఇసుక లభించే పరిస్థితి ఉండదని, దీనిని దృష్టిలో పెట్టుకుని వానలు కురియక ముందే సరిపడా ఇసుక నిల్వలను ఇందిరమ్మ లబ్ధిదారులు ముందస్తుగా సమకూర్చుకునేందుకు వారికి వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఎక్కడ కూడా ఇసుక కొరత కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయనే ఫిర్యాదులు రాకూడదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

## 'యువవికాస్'ను అందరికీ ఇవ్వాలి

### బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వాళ్లందరూ కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టిన యువ వికాస్ పథకం అందరికి అందేలా చూడాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నామని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి అన్నారు. శనివారం సీపీఐ కార్యాలయాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొదటగా 50 వేలు, లక్షలోపు వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపిందని, లక్షపైన నాలుగు లక్షల వరకు దరఖాస్తు చేసిన వారందరికి సిబిల్ కోర్ ఉంటేనే ఇవ్వాలనేదే చాలా దుర్మార్గమైన పని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ప్రవేశపెట్టిన పథకంలో యువతను ఇబ్బందులకు గురి చేయడం సరి కాదని అర్హులైన ప్రతిఒక్కరికి ఈ పథకం అం దేలా చూడాలన్నారు. 16 లక్షలపై యు వత దరఖాస్తు చేసుకుంటే, ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించకపోగా స్వయంఉపాధిపొందుదామని చూస్తుం టే కొర్రీలు పెట్టడం సరి కాదన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఇవ్వాలని లేని యెడల రాని వారిని అందరిని కలుపుకుని ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సెస్సార్ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

### కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.మారయ్యగౌడ్




ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : 33 సంవత్సరాల నిరంతరం విద్య కోసం చేసిన కృషికి దక్కిన గౌరవం అటానమస్ హోదా రావటమని ఎస్సెస్సార్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.మారయ్యగౌడ్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎస్సెస్సార్ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించింది. శనివారం నగరంలోని ఖలీల్ వాడీ, ఎస్సెస్సార్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరంవిలేకరుల సమావేశంలో మారయ్యగౌడ్ మాట్లాడారు. 33 ఏళ్ల క్రితం నిజామాబాద్‌లో గిరిరాజ్ కళాశాల తప్ప మరేది లేదని అక్కడ సీట్లు రాని విద్యార్థులు ఎందరో చదువును మానేస్తున్న విషయాన్ని గ్రహించి ప్రైవే ట్ కళాశాల లేని సమయంలో మొట్టమొదటిసారిగానగరంలో ప్రైవేట్‌డిగ్రీ కళాశాల నెలకొల్పడం జరిగిందన్నారు. అలా ఏర్పడిన కళాశాల వేలాది మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దామన్నారు.దేశవ్యాప్తంగాకాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు చేస్తూ సైంటిస్టులుగా ఇంజనీర్లుగా కూడా రాణిస్తున్నారన్నారు. ఎందరో వి ద్యార్థుల జీవితాల్లో వెలుగునింపిన అధ్యా పక బృందాన్ని అభినందిస్తున్నామన్నారు. ఐదు నెలల క్రితం న్యాక బి ప్లస్, ప్లస్ బి ++ గుర్తింపు పొందామన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎస్సెస్సార్ డిగ్రీ కళాశాల నూతనంగా యూనివర్సిటీ గ్రాంట్స్‌కమీషన్(యుజీసీ)న్యూఢిల్లీ వారు స్వయం ప్రతిపత్తి హోదాను కల్పించారన్నారు. కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం ఆధునిక విద్య అవసరాలు పరిశ్రమ అవసరాలను ప్రతిబింబించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు.కొత్తగా ఎంఎల్‌టి కోర్స్‌తోపాటు ఎఐఎంఎల్ టెక్నాలజీ కోర్సు కూడా తెచ్చా మన్నారు. నూతనంగా డైరెక్టర్‌గా హర్షిత్‌గౌడ్‌ను పరిచయం చేస్తున్నామన్నారు. ఎస్సెస్సార్ విద్యాసంస్థల కరస్పాండెంట్ యాజమాన్యం హరితగౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బైక్ దొంగల ముఠా అరెస్ట్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను నిర్మల్ పోలీసులు అరెస్ట్ చేశారు.వీరి వద్ద నుంచి నాలుగు దొంగిలించిన మోటర్ సైకిళ్లు,ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఎస్పీ జి.జానకి షర్మిల్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం,మే 30న సాయంత్రం తనిఖీ చేస్తుండగా ఈ అరెస్ట్ జరిగింది.పారిపోవడానికి ప్రయత్నించిన మోషిన్ ఖాన్,ఆవిజ్ చావుస్,మహమ్మద్ సోఫియానుద్దీన్‌లను నిర్మల్ గ్రామీణ ఎస్సై లింబాద్రి పట్టుకున్నారు.విచారణలో దొంగతనాలను ఒప్పుకున్న నిందితులను పోలీసులు రిమాండ్‌కు పంపారు.నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.అనుమానాస్పద ఘటనల గురించి వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు సూచించారు.

## విద్యార్థులకు నూతన పద్ధతుల్లో బోధన



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో ఐదవ రోజున జరుగుతున్న హిందీ శిక్షణ తరగతులకు పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులుగా ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారని,శిక్షణలో నేర్చుకున్న అంశాలను,తదుపరి పాఠశాలల్లో చక్కగా అమలుపరిచి,వినియోగించుకోవాలన్నారు.తద్వారా ప్రభుత్వ పాఠశాలలో నమోదును పెంచి,ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు.ప్రతి ఉపాధ్యాయుడు వృత్తి నిబద్ధతతో పనిచేసి,విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుల శిక్షణకు పరిశీలకుడిగా వచ్చిన రాష్ట్ర పరిశీలకుడు వినాయక్ ని జిల్లా విద్యాధికారి ఘనా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిఆర్పీలు ధర్మాజి,శశిరాజ్,రమేష్,సురేష్,హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ముగిసిన ఉపాధ్యాయులు శిక్షణ**

నిర్మల్‌లోని నారాయణ పాఠశాలలో జరుగుతున్న మూడవ విడత ఉపాధ్యాయ శిక్షణలు ముగిశాయి.ఈ సందర్భంగా మూడవ విడత ఉపాధ్యాయ శిక్షణ మే 27న ప్రారంభమై మే 31తో ముగిశాయి. తెలుగు, హిం దీ, భౌతిక, జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

# నామమాత్రంగా పౌర హక్కుల దినోత్సవం




ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట మండల పరిధిలోని శనివారం రోజున రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చల్మెడ గ్రామంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రీతి అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. రాష్ట్రంలో అంటరానితనం, కుల వివక్ష, దళితులపై దాడులు, సాంఘిక బహిష్కరణలను, ఆలయాల ప్రవేశం, రెండు గ్లాసుల పద్ధతి, మనుషులంతా ఒకటే, అనే అంశాల పైన అవగాహన కల్పించాలి. కానీ అక్కడక్కడ ఇలాంటి సమస్యల పైన ప్రతినెల చివరి రోజు ప్రతి మండలంలో ఏదో ఒక గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్నిపురస్కరించుకొని సంబంధిత రెవెన్యూ శాఖ పోలీస్ వ్యవస్థ ఇతర శాఖల ద్వారా ప్రజలకు చట్టాలపై వాటిలో ఉన్నహక్కులపై అవగాహన కల్పించాలి. సమావేశాలు పెట్టి గ్రామంలో ఫ్లెక్సీ కట్టి ఫోటో మాత్రమే దిగి, చట్టాలు హక్కులు సమస్యల పైన ఎలాంటి అవగాహన కల్పించకుండా తూతూ మంత్రంగా పౌర హక్కుల దినోత్సవం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమానికి మండలంలో ఉన్న ఎమ్మార్వో ఎస్సై హాస్టల్ వార్డెన్ ఎంపీడీవో ఇతరత్రా మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సింది. కానీ కిందిస్థాయి ఉద్యోగులతో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నెరవేరుస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఎమ్మార్వో,ఎస్సై లేరు. హాస్టల్ వార్డెన్ లేరు, అభివృద్ధి అధికారులు లేరు అని అంటున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ వెంకట నరసింహారెడ్డి కారో బార్ రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# నైపుణ్యాల వెలికితీత అవసరం



ప్రజాపక్షం/జన్నారం : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి, వారిలోని నైపుణ్యాలను వెలికి తీయడానికి సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఇషిక సంస్థ డైరెక్టర్ పంచేర్పుల రఘు వర్మ తెలిపారు. జన్నారం పట్టణంలో 2024 నవంబర్‌లో స్థాపించబడిన తమ సంస్థ కంప్యూటర్ కోర్సులు, సైన్స్ ఫేర్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు, ట్రెజర్ హంట్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తోందన్నారు. శిక్షణ అనంతరంఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నామని, ఇప్పటివరకు తమ సంస్థ ద్వారా 16 మందికి ఉద్యోగ, ఉపాధి లభించాయన్నారు. గత ఐదు రోజులుగా విద్యార్థుల్లోని నైపుణ్యాలను పరీక్షించేందుకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించగా, బాలికలు కూడా బాలురతో సమానంగా పోటీ పడ్డారని రఘు వర్మ అన్నారు. గెలుపొందిన బాలుర జట్టుకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశామని ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని ఐఎస్ఒ సర్టిఫికేట్‌తో శిక్షణ పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇషిక సంస్థ సభ్యులు, విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## పట్టుబడిన 10 వాహనాలు 4న వేలం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** వివిధ కేసులలో పట్టుబడిన 10 వాహనాలను జూన్ 4న ఉదయం 11 గంటలకు పెద్దపల్లి ఎక్సైజ్ స్టేషన్ బండారి కుంట లో వేలం వేస్తున్నట్లు పెద్దపల్లి ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
వేలం వేయు వాహనాలలో టివిఎస్ స్టార్ సిటీ, టాటా సుమో, టివిఎస్ ఎక్సెల్, హీరో గ్లామర్, హోండా యాక్టివా, హోండా షైన్ వాహనాలు రోడ్డు వర్త్ కండిషన్లో, హీరో హోండా ప్యాషన్ ప్లస్, హోండా ప్యాషన్ ప్లస్, టీవీఎస్ ఎక్సెల్, టీవీఎస్ సుజుకి మ్యాక్స్ వంటి వాహనాలు స్క్రాప్ కండిషన్ లో ఉన్నట్లు తెలిపారు.
వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు జూన్ 4న ఉదయం 10 గంటల లోగా ధరావతు డబ్బులు డిపాజిట్ చేసి రసీదు తీసుకోవాలని, బహిరంగ వేలం జూన్ 4న ఉదయం 11 గంటలకు జరుగుతుందని, మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళలో మద్య నిషేధ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని పెద్దపల్లి ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** శనివారం రోజున 27వ వార్డ్ శుభాష్ నగర్ లో వార్డ్ ప్రజలకు తడి పొడి చెత్త పై అవగాహన కార్యక్రమము నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూపెద్దపల్లి పట్టణ ప్రజలు తడి పొడి చెత్తను వేరుచేసి మీవార్డు కు విజిల్ వేసుకుంటూ వచ్చే మా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని అన్నారు. అలాగే పొడి చెత్త శుక్రవారం మరియు మంగళవారం మాత్రమే తీసుకోవడం జరుగుతుందని తడి చెత్త అనగా కిచెన్ నుండే వెలువడే పదార్థాలను ప్రతిరోజు తీసుకోవడం జరుగుతుందని ప్లాస్టిక్ మరియు సీసాలు నిలువచేసి మున్సిపల్ సిబ్బందికి అందచేయలన్నారు. పట్టణ ప్రజలు చెత్తను, ప్లాస్టిక్ కవర్లు రోడ్లపైన గాని మురికికాలువలో గాని వేసినట్లయితే జరిమాన విధించడం జరుగుతుంది అన్నారు. ఈకార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్లు అనూష, అశ్విత, నవ్య ప్రణీత, అనూష, శ్రీనివాస్, ప్రదీప్, అనిల్, సుధీర్, కుమార్, అరవింద్, సంజీవ్, యశ్వంత్, హరీష్ రామ్మోహన్ రెడ్డి మరియు జవాన్ జయరాజ్ మెప్మా ఆర్పీ వును కొండ లక్ష్మి మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లెలో ప్రగతి ఏదీ?

మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** గత ప్రభుత్వంలో పల్లెలు ప్రగతి పరుగులు పెట్టాయని, గత 18 నెలలుగా పల్లెలో ప్రగతి విలవిలా అయిందని ఎన్నో ఆదర్శ గ్రామాలు, ఎన్నో అవార్డులు సాధించిన తెలంగాణ నాడు వెనుకబడిందని మాజీ హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో చిన్నకోడురు, నంగునూరు మండలాల గ్రామాల అభివృద్ధి పై మాజీ మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారిగా అభివృద్దిపై ఆరా తీశారు. గత 18 నెలలుగా గ్రామాల అభివృద్ధి ఎక్కడికక్కడే ఆగిపోయిందన్నారు. గత ప్రభ్వుత్వంలో కె సిఆర్ గ్రామాల అభివృద్ధి కోసం నెల నెల 275 కోట్లు ఏటా 3330 కోట్లు ఇచ్చామని గుర్తు చేశారు. నేడు పల్లెలు పంచాయితీలో పారుశుధ్యం లోపించి చెత్త కుప్పలుగా మారాయని, మరో వైపు పంచాయతీ అప్పుల కుప్పలుగా మారాయన్నారు. పంచాయతీ పరిపాలన గాడితప్పిందని, అధికారుల దృష్టి పెట్టి అభివృద్ధి పనులు కొనసాగించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పల్లెల్లో అభివృద్ధి కొనసాగించేందుకు సమన్వయంతో పనిచేసి గ్రామానికి సిద్దిపేటకు మంచి పేరు తేవాలన్నారు. నిధులు కొరత ఉంటే నా దృష్టికి తీసుకరావాలన్నారు.

**జూన్ 2న సిద్దిపేట బిఆర్ఎస్‌కార్యాలయంలో పార్టీ జెండావిష్కరణ**

జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కార్యాలయంలో పార్టీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి హరీష్‌రావు, జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. జూన్ 2న రాష్ట ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండావిష్కరణ ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, ప్రజాప్రతినిధులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పొగాకుతో శారీరక, మానసిక వ్యాధులు: డా.అమరేందర్ రావు




**ప్రజాపక్షం/ముత్తారం :** పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలని డాక్టర్ అమరేందర్ రావు అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న ఆదేశాల మేరకుముత్తారం మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణం నుండి అడవి శ్రీరాంపూర్ చౌరస్తా వరకు ప్రపంచ పోగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల కారణంగా అనేక శారీరక, మానసిక వ్యాధులు సోకుతున్నాయని తెలిపారు.గుండె జబ్బులు, బ్రెయిన్ లతో పాటు, నోటి క్యాన్సర్, లంగ్ క్యాన్సర్ వంటి అనేక రకాల క్యాన్సర్లు వస్తున్నాయని చెప్పారు. పొగాకు ఉత్పత్తుల వలన కలిగే వ్యాధులపై పిల్లలకు విస్తృత అవగాహన కలిగించడం ద్వారా రానున్న రోజుల్లో వినియోగాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పి. హెచ్.ఎన్. గ్రేస్ వన్, సూపర్వైజర్ రమాదేవి, ఎం.ఎల్.హెచ్.పి. లావణ్య, దీప్తి, ఏఎన్ఎంలు రమాదేవి, స్రవంతి, సునీత, కళావతి, దుర్గమ్మ, పుష్పలత, ఆశ వర్కర్లు, స్టాఫ్ నర్స్ రవళి, ఝాన్సీ, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, ఫార్మసిస్ట్ జగదీశ్వర్ తో పాటు అటెండర్ మొగిలి తో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన..



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని బొప్పాపూర్ గ్రామ రైతు వేదిక వద్ద ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం,బాబు జగ్జీవన్‌రాం శాస్త్రవేత్తలు రైతు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు రజియ సుల్తానా,శ్రీనివాస్ మాట్లాడారు.పంటలకు సిఫార్సుచేసిన మందులు మోతాదులో వాడాలని సూచించారు.పచ్చిరొట్ట,వర్మి కంపోస్టు,పేడ ఎరువులను వినియోగించాలన్నారు.పలు అంశాలను రైతులకు వివరించారు.కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్,విద్యాధికారి కృష్ణహరి,ఏఎంసీ సబేరాబేగంగౌస్,ఐకేపి సిబ్బంది,భరత్‌చంద్ర రైతులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలో 18 అర్బన్ మండలంలో 05 గ్రామాలలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి స్థాయిలో ముగించడం జరిగిందని ఎపియం వి.గంగాధర్ అన్నారు. జగిత్యాల ఎపియం వి.గంగాధర్ మాట్లాడుతూ జగిత్యాల రూరల్ మండలంలో 2770 రైతుల నుండి 153200.00 క్వింటాళ్లు, అర్బన్ మండలంలో 653 రైతుల నుండి 43678.00 క్వింటాళ్ల ధాన్యం సేకరించడం జరిగిందని తెలిపారు. జగిత్యాల జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డి.ఆర్.డి.ఏ., డి.యం., డి.సీ.యస్.ఓ., రెండు మండలాల తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ల సహకారంతో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని అన్నారు. అలాగే మండల, గ్రామ స్థాయి ఐకేపీ సిబ్బంది, కమిటీ సభ్యులు ఇట్టి కొనుగోలు ప్రక్రియలో పాల్గొని వారి పూర్తి సహకారంతో ఇబ్బందులు లేకుండా పూర్తి చేయడం జరిగిందని, అలాగే ఇట్టి కొనుగోలు ప్రక్రియలో సహకరించిన లారీ అసోసియేషన్ వారికి, మిల్లర్ అసోషియేషన్ వారికి, రైతులకు, పాత్రికేయులకు జగిత్యాల ఎపియం వి.గంగాధ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మండల సీ.సీ.లు పి.గంగారం, బి. రవీందర్, బి.మరియా, జీ.శ్రీనివాస్, పి.విద్యాసాగర్, రూరల్ మండల అధ్యక్షురాలు మారు. సత్తవ్వ, అర్బన్ మండల అధ్యక్షురాలు దేశావేని గంగభవాని తదితరులు ఉన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్యంపై తగిన దృష్టి పెట్టాలని, నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆదేశించారు. దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలని, నీటి నమూనాలను ఎప్పటికప్పుడు పరీక్షించి క్లోరినేషన్ వంటి చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీటి కలుషితం కారణంగానే ఎక్కువ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. గత సంవత్సరం ఎక్కువ వ్యాధులు ప్రబలిన గ్రామాలు, వార్డులను గుర్తించిన ఈ సీజన్‌లో జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఎక్కడైనా డెంగీ కేసులు నమోదు అయితే ఈ ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సభ ద్వారా, స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

**వనమహోత్సవం విజయవంతం చేయాలి**

జిల్లాలో అనువైన అన్ని ప్రదేశాల్లో మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. వన మహోత్సవం నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అసవరమైన మొక్కలను సరఫరాకు సిద్ధం చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.

**రాష్ట్ర అవతరణ వేడుకులకు ఏర్పాట్లు**

జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో వేడుకలకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రోటోకాల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలను వివరించే వివిధ శాఖల శకటాలు, స్టాళ్ల ప్రదర్శన చేయాలని ఆదేశించారు. వేడుకలకు వచ్చిన ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంతో పాటు వైద్య బృందం అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డిఎఫ్‌వో బాలమణి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 'బేటీ బచావో బేటీ పడావో'పై అవగాహన శిబిరాలు నిర్వహించాలి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా స్థాయి బహుళ సభ్యుల అధికారిక సమావేశం (పిజి&పిఎన్‌డిటి ఎక్ట్ 1994) జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, చైర్ పర్సన్ డి.ఎల్.ఎం.ఎం.ఏ.ఏ అధ్యక్షతన జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం రోజున నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ... బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని విస్తృతమైన ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా అవగాహన శిబిరాలు నిర్వహించాలని అన్నారు. గర్భవతిగా నమోదు అయినప్పటి నుండే ఆశా కార్యకర్తలు ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ చేయలని అన్నారు. స్కానింగ్ సెంటర్లలో గర్భవతులకు స్కానింగ్ చేసినప్పుడు విధిగా ఫారం ఎఫ్, లను నింపవలెనని దానిని ఆన్లైన్లో నమోదు చేయవలెనని, అదేవిధంగా అబార్షన్ జరిగినటువంటి వారిపైన ప్రత్యేక శ్రద్ధ చూపించవలెనని ఏ కారణం చేత అబార్షన్ అయిందో గ్రహించవలేనని ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో దరఖాస్తు చేసుకున్నటువంటి మూడు నూతన స్కానింగ్ రిజిస్ట్రేషన్ సెంటర్స్, 10 రెన్యువల్ సెంటర్స్ కు అనుమతి ఇచ్చే విషయం గురించి కలెక్టర్‌కు నివేదించడం జరిగిందనీ తెలిపారు. మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ కోసం అమలవుతున్న నియమ నిబంధనలను కమిటీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ హేమంత్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ సుధీర్, హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం, ఆరోగ్య పర్యవేక్షకులు శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీల బకాయిలపై నిరసన



**ప్రజాపక్షం/గన్నేరువరం:** మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు గత ఏడు వారాలుగా కూలీ డబ్బులు అందకపోవడంతో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక ఎంపిడివో కార్యాలయం ఎదుట సిపిఐ ఆద్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా నాయకులు మాట్లాడుతూ గతంలో పని చేసిన తర్వాత పది, పదిహేను రోజులకు కూలీ డబ్బులు వచ్చేవని, ప్రస్తుతం ఏడు వారాలు గడుస్తున్నా పని డబ్బులు రావడం లేదని మండిపడ్డారు. నిత్యావసరాల కొరకు మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఎండకు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ కనీస వసతులు లేకున్నా పనిచేశారన్నారు. కొన్ని గ్రామాల్లో జాబ్‌కార్డు డిలీట్ అవుతున్నాయని, పని కోసం పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కూలీ డబ్బులు జమ చేయాలన్నారు. లేని పక్షంలో కార్యాలయం ముట్టడి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చొక్కాల చెప్పు శ్రీశైలం, జిల్లా నాయకులు కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శులు పిప్పాల కనుకయ్య, కూన మల్లయ్యలున్నారు.

## సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌కు శుభాకాంక్షల వెల్లువ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన పంజాల శ్రీనివాస్‌కు పలువురు ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. శనివారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వూట్కూరి నరేందర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ విధ్యార్థి దశ నుంచే రాజకీయాలలో ఆసక్తితో ఏఐఎస్ఎఫ్‌లో చేరి విధ్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యారంగంలో మార్పుల కోసం అనేక పోరాటాలు శ్రీనివాస్ చేశాడని కొనియాడారు. ఏఐవైఎఫ్ నాయకుడిగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారని, వారి సమస్యలపై ఎన్నో ఉద్యమాలు నిర్మించాడని, అనంతరం సిపిఐలో జిల్లా కౌన్సిల్ సభ్యులుగా, కార్యవర్గ సభ్యులుగా, కరీంనగర్ నగర కార్యదర్శిగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసి జిల్లా కార్యదర్శి స్థాయికి అతి చిన్న వయస్సులో ఎదగడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత చేరువై వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు పాల్గొన్నారు.

## అధికారిక కార్యక్రమాల్లో మాజీ మేయర్ల పాత్ర ఏంటి?

బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర శాఖ డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ నగరంలో ఎంపి బండి సంజయ్ నిధులతో మున్సిపల్ కార్యాలయంలో డ్రిల్లింగ్ మిషన్ల పంపిణీ అధికారిక కార్యక్రమంలో వేదికపై బిజెపి పార్టీకి చెందిన మాజీ మేయర్ సునీల్‌రావు, డి.శంకర్ సహా కొంత మంది మాజీ కార్పోరేటర్లు వేదికపై సీట్లలో కూర్చోవడానికి ఆహ్వానించిన నగరపాలక కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు డిమాండ్ చేశారు. ఇష్టారాజ్యంగా బిజెపికి చెందిన నాయకులను కమిషనర్ వేదికలపై పిలిచి ప్రజలను అవమాన పరుస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి కార్యక్రమాల మాదిరిగా అధికారిక కార్యకలాపాలను కమిషనర్ నిర్వహించడం సిగ్గు చేటన్నారు. పదవీ కాలం పూర్తయినా ఇంకా మాజీ మేయర్, కొందరు కార్పోరేటర్లు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో వేదికలపై పాల్గొనకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ కార్యాలయంలో 60 మంది కార్పోరేటర్ల పదవీ కాలం పూర్తయినా బోర్డుపై ఉన్న వారి పేర్లు ఇంకా తొలగించడం లేదని, వెంటనే వాటిని తీసేయాలని వారు డిమాండ్ చేశారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** ఇటీవల హుస్నాబాద్ ,అక్కన్నపేట మండలాల్లో వివిధ కారణల వల్ల మరణించిన పలువురి కుటుంబాలను సిపిఐ జాతీయ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి శనివారం వారి కుటుంబాలను పరమార్శించారు. పట్టణంలోని 20వ వార్డులోని అర్‌టిసీ రీటైర్డ్ ఉద్యోగి మోర శ్రీహరి , 13 వార్డులోని గంగరవేని రాజయ్య, లుగుండే పోటుతో మరణించగా 12 వార్డు వడ్డెపల్లి వెంకటరమణ,అనారోగ్యంతో మరణించారు, అక్కన్నపేట మండల మాజీ ఎంపిటీసి జంగపెల్లి ఐలయ్య భార్య మొండవ్వ, మరణించగా శనివారం వారి కుటుంబాలను చాడ వెంకటరెడ్డి పరమార్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించి వారికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శ గడిపె మల్లెశ్, అక్కన్నపేట మండల సిపి ఐకార్యదర్శ కొమ్ముభాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుదర్శనచారి , మహిళ సంఘం నాయకురాలు పద్మతోపాటు నాయకులు మల్లారెడ్డి, పాపయ్య, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

## మార్పులకనుగుణంగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి

ఆల్ఫోర్స్ ఇ-టెక్నోలో ముగిసిన ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో గత ఐదు రోజులుగా నిర్వహించిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల వృత్యంతరర శిక్షణ ముగిసింది. ఈ సంధర్బంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా విద్యాధికారి(ఎఫ్ఏసి) శ్రీరాం మొండయ్య హాజరై మాట్లాడారు. సమాజంలో వెలువడుతున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు సైతం అన్ని విషయాలను నేర్చుకోవడమే కాకుండా వాటిని విశ్లేషణాత్మకంగా సమగ్రంగా అమలు పరిచి విధ్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయుల అభివృద్ధికై అనేక నిధులను కేటాయిస్తూ పాఠశాలలో ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రోత్సాహంతో అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ఆద్వర్యంలో ఈ కార్యక్రమాలను జయప్రదంగా నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆద్వర్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సారధ్యంలో నెలరోజులుగా అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అన్ని రకాలుగా వసతులు కల్పిస్తూ మూడు దశల్లో విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. మార్పులు గ్రహించి చక్కటి ప్రణాళికలతో విజయ పథాన పయనించాలని కోరారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, భగవంతరావు, ఆంజనేయులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం

మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** రాజకీయాలకు అతీతంగా చొప్పదండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మధురానగర్‌లో శనివారం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.2.63 కోట్ల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సంధర్బంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర సహకారంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు రాజకీయాలకతీతంగా కొనసాగుతాయని చెప్పారు. అనంతరం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే కొందరు రాజకీయ వ్యాఖ్యలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఐదు సంవత్సరాలు అభివృద్ధి కోసమే పోరాడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బిజెపి నాయకులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

**వడ్డెర బస్తీవాసులకు డ్రిల్లింగ్ మిషన్ల పంపిణీ**

కరీంనగర్‌లోని వడ్డెర బస్తీ వాసులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం డ్రిల్లింగ్ మిషన్లను అందజేశారు. గతంలో అగ్ని ప్రమాదం జరిగి వడ్డెర బస్తీలోని దాదాపు 25 ఇండ్లు పూర్తిగా దగ్ధమైన సంగతి తెలిసిందే. ఇంటి సామాను, సర్టిఫికెట్లు, డబ్బులు సైతం ఆ ప్రమాదంలో బూడిదయ్యాయి. నాడు బాధితులను పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ బాదిత కుటుంబాలకు తినడానికి ఇబ్బంది లేకుండా 3 నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

## తక్కళ్లపల్లిలో ఆటో బోల్తా: డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామంలో తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఆటో నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.
జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బుగ్గారం మండలం వెలుగొండ గ్రామానికి చెందిన గంధం రాజన్న 42 సం అను అతను శనివారం తెల్లవారుజామున జగిత్యాల కూరగాయల మార్కెట్ లో కూరగాయలు కొని అమ్మేందు 3 గంటలకు వస్తున్న క్రమంలో జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామ శివారులో నిద్రమత్తులో ఆటోను నడుపుతుండగా ఆటో అదుపు తప్పి పూర్తిగా కుడి వైపు వెళ్లి రోడ్డు కిందకు వెళ్లి, ఆటో బోర్లాపడి తలకు చాతిలో బలమైన గాయాలు అవడంతో ప్రమాద స్థలంలోనే మరణించినాడు అని మృతుడి భార్య గంధం లక్ష్మి ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఫోకస్

# క్రీడ

# అథ్లెట్లకు అగ్నిపరీక్ష




**పురుషులకు 100 మీటర్ల పరుగు (స్ప్రింట్), హైజంప్ విభాగాల్లో, అదే విధంగా మహిళలకు 1,500 మీటర్ల పరుగు, 5000 మీటర్ల పరుగు విభాగాల్లో పోటీల నిర్వహణ**

ప్రపంచ అథ్లెటిక్స్‌లో 'డైమండ్ లీగ్'కు ప్రత్యేక స్థానం ఉంది. అథ్లెట్లకు అగ్నిపరీక్షలా నిలిచే ఈవెంట్స్‌లో ఇది ఒకటి. వరల్డ్ అథ్లెటిక్స్ (డబ్ల్యుఎ) నిర్వహించే వార్షిక అవుట్‌డోర్ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్ ఇది. 2025 డైమండ్ లీగ్ ఏప్రిల్ 26న మొదమైంది. ఆగస్టు 28న ముగుస్తుంది. జూన్ 6న రోమ్ (ఇటలీ)లోని స్టేడియో డైంపికోలో జరిగే ఐదో డైమండ్ లీగ్ కోసం అథ్లెటిక్స్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2010లో డైమండ్ లీగ్ ఫౌండేషన్ ప్రారంభమైన తర్వాత, ఉన్నత స్థాయి అథ్లెటిక్స్ సిరీస్‌కు పునాది పడింది. సంవత్సరం పొడవునా వివిధ వేదికలపై పోటీలను నిర్వహిస్తారు. మొత్తం 15 డైమండ్ లీగ్ పోటీల్లో ఈవెంట్ల సంఖ్య 32. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ తర్వాత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో గొప్ప ఈవెంట్‌గా డైమండ్ లీగ్‌ను పేర్కొంటారు. ఈ ఏడాది డైమండ్ లీగ్ ఏప్రిల్ 26న జియామెన్ (చైనా)లో జరిగింది. జియామెన్ ఎగ్రెట్ స్టేడియం ఈ పోటీలకు ఆతిథ్యమిచ్చింది. మే మూడున రెండో డైమండ్ లీగ్ రెండో దశ షాంగై (చైనా)లో జరిగింది. యాంగ్జీ డెల్టా అథ్లెటిక్స్ డైమండ్ గాలాగా దీనిని పేర్కొన్నారు. మూడో విడత పోటీలు దోహా (కతార్)లోని సుహీమ్ బిన్ హామాద్ స్టేడియంలో జరిగాయి. మే 25న మోరాకోలోని రాబాత్ నగరంలో ఉన్న ఇంటర్నేషనల్ బహమ్మద్ VI డి'అథిటిస్మే డి రబాత్ స్టేడియంలో నాలుగో విడత పోటీలు జరిగాయి. ఆరో దశ పోటీలకు రోమ్ వేదిక కానుంది. పురుషులకు 100 మీటర్ల పరుగు (స్ప్రింట్), హైజంప్ విభాగాల్లో, అదే విధంగా మహిళలకు 1,500 మీటర్ల పరుగు, 5000 మీటర్ల పరుగు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది డైమండ్ లీగ్‌లో మిగతా దశల విషయానికి వస్తే, ఆరో విడత పోటీలు జూన్ 12న ఓస్లో (నార్వే)లోని బిస్లెట్ స్టేడియంలో, ఏడవ విడత పోటీలు జూన్ 15న స్టాక్‌హోమ్ (స్వీడన్)లోని స్టాక్‌హోమ్ ఒలింపిక్ స్టేడియంలో, ఎనిమిదవ విడత జూన్ 20న పారిస్ (ఫ్రాన్స్)లోని స్టేడాసెబాస్టియన్ చార్లెటీలో జరుగుతాయి. అదే విధంగా తొమ్మిదో విడత పోటీలకు జూలై 5న, యూజీన్ (అమెరికా)లోని హెవార్డ్ ఫీల్డ్ ఆతిథ్యమిస్తుంది. పదో విడత పోటీలను జులై 11న ఫాంట్విల్లె (మొనాకో)లోని లూయిస్ II స్టేడియంలో, పదకొండో లీగ్ లండన్ (గ్రేట్ బ్రిటన్)లోని లండన్ స్టేడియం, పన్నెండవ దశ ఆగస్టు 16న చోర్జోవ్ (పోలాండ్)లోని కమిలా స్లోయోవ్‌స్కా మెమోరియల్ సేటడియంలో, పదమూడవ పోటీసులు లాసాన్ (స్విట్జర్లాండ్)లోని స్టేడియం ఒలింపిక్ డిలా ఫౌండైన్‌లో ఆగస్టు 20న జరుగుతుంది. పధ్నాలుగో డైమండ్ లీగ్ పోటీలకు బ్రస్సెల్స్ (బెల్జియం) వేదికమవుతుంది. ఈ పోటీసలు ఆగస్టు 22న జరుగుతాయి. ఇక చివరిదైన 15వ డైమండ్ లీగ్‌ను జ్యూరిచ్ (స్విట్జర్లాండ్) ఆగస్టు 27, 28 తేదీల్లో నిర్వహించనుంది.

## తిరుగులేని సాటొమెయర్

పురుషుల హైజంప్ విభాగంలో జేవియర్ సొటొమెయర్‌కు తిరుగులేని రికార్డు ఉంది. అత్యంత మెరుగైన మొదటి మూడు ప్రదర్శనలు అతనివే కావడం విశేషం. క్యూబాకు చెందిన ఈ సూపర్ అథ్లెట్1993 జులై 27న 2.45 మీటర్లు (8 అడుగులా, 1/4 అంగుళాలు) ఎత్తును పూర్తి చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అంతకు ముందు, 1989 జులై 29న 2.43 మీటర్లు (8 అడుగులు), 1988 సెప్టెంబర్ 8న 2.43 మీటర్లు (7 అడుగులా, 11.5 అంగుళాలు) ఎత్తుతో అతను రికార్డు పుస్తకాల్లో నిలిచాడు. మొదటి రెండు స్థానాలు అతనివే కాగా, మూడో స్థానాన్ని కతార్‌కు చెందిన ముతాజ్ ఎస్సా బర్షిమ్‌తో పంచుకుంటున్నాడు. బర్షిమ్ కూడా 2.43 మీటర్లు (7 అడుగులా, 11.5 అంగుళాలు) ఎత్తును లంఘించాడు. స్వీడన్‌కు చెందిన పాట్రిక్ జొబెర్గ్ 2.42 మీటర్లు (7 అడుగులా, 11.5 అంగుళాలు) ఎత్తును పూర్తి చేశాడు. సొటొమెయర్ ఖాతాలో ఇదే ఎత్తు ఉండడంతో, బొబెర్గ్ తన రికార్డును అతనితో పంచుకోవాల్సి వస్తున్నది. సొటొమెయర్ వంటి అసాధారణ ప్రతిభావంతుడి స్థాయి ప్రదర్శన ఈసారి డైమండ్ లీగ్‌లో ఉంటుందా అనేది అనుమానమే. అయితే, హైజంప్ విభాగంలో విజేత అతని రికార్డుకు ఎంత చేరువుగా ఉంటాడన్నది చూడాలి.




జేవియర్ సొటొమెయర్

## స్ప్రింట్‌పైనే ఆసక్తి!

డైమండ్ లీగ్‌లో మొత్తం 32 విభాగాల్లో పోటీలు ఉన్నప్పటికీ, పురుషుల 100 మీటర్ల పురుగుపైనే ప్రపంచ వ్యాప్తంగా అథ్లెట్లు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ విభాగంలో తిరుగులేని 'స్ప్రింట్ రారాజు' ఉసేన్ బోల్ట్ నెలకొల్పిన రికార్డును ఎవరైనా ఛేదించగలుగుతారా? అన్నది అనుమానమే. మొదటి రెండు ఫాస్టెస్ట్ టైమింగ్స్ బోల్ట్ పేరిటే ఉండడం గమనార్హం. మూడో ఉత్తమ ప్రదర్శనను అతను టైసన్ గే (అమెరికా), యొహాన్ బ్లేక్ (జమైకా)లతో పంచుకుంటున్నాడు. జమైకాకు చెందిన ఈ 'పరుగు వీరుడు' బోల్ట్ 2009, ఆగస్టు 16న, బెర్లిన్ వేదికగా, 9.58 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ప్రపంచ రికార్డు సృష్టించాడు. రెండో అత్యుత్తమ టైమింగ్ 9.63 సెకన్లను అతను 2012 ఆగస్టు 6, లండన్‌లో నెలకొల్పాడు. అంతకు ముందు, 2008లో బీజింగ్ ఒలింపిక్స్‌లో అతను 9.69 సెకన్లలో గమ్యాన్ని చేరి, స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. ఇదే సమయాన్ని 2009, సెప్టెంబర్ 20న టైసన్ గే షాంగైలో నమోదు చేశాడు. 2012 ఆగస్టు 23న జమైకాకే చెందిన యొహాన్ బ్లేక్ కూడా 9.69 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి, ప్రపంచ మూడో ఉత్తమ ప్రదర్శనను బోల్ట్, బ్లేక్‌తో కలిసి పంచుకుంటున్నాడు. ప్రపంచ అథ్లెటిక్స్ లేదా డైమండ్ లీగ్ పోటీలు జరుగుతున్న ప్రతిసారీ, 100 మీటర్ల పరుగుపైనే అభిమానులు దృష్టి కేంద్రీకరించడం ఆనవాయితీ. ఈసారి స్ప్రింట్ కిరీటం ఎవరికి దక్కుతుందో చూడాలి.



ఉసేన్ బోల్ట్



## ఆసక్తిగొలిపే పరుగు

అంతర్జాతీయ మహిళల అథ్లెటిక్స్ పోటీల జాబితాలో 5000 మీటర్ల పరుగు ఆలస్యంగా చేరింది. 1980 దశకం వరకూ మహిళలకి ఎక్కువగా 3000 మీటర్ల పరుగు మాత్రమే ఉండేది. అయితే, 1988లో 5000 మీటర్ల పరుగు రంగ ప్రవేశం చేసింది. ప్రపంచ అథ్లెటిక్స్‌లో ఇది ఒక ఈవెంట్‌గా ఉన్నప్పటికీ, ఒలింపిక్స్‌లో చోటు సంపాదించడానికి మరో ఎనిమిది సంవత్సరాలు నిరీక్షించాల్సి వచ్చింది. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో మహిళల 5000 మీటర్ల పరుగు తొలిసారిగా ఒలింపిక్ ఈవెంట్‌గా ప్రవేశపెట్టారు. ఇలావుంటే, ఈ విభాగంలో తొలి ప్రపంచ రికార్డు వాంగ్ జున్షియా (చైనా) నమోద చేసింది. 1995లో ఆమె లక్ష్యాన్ని 14 నిమిషాలా, 28 సెకన్లలో చేరింది. అయితే, ఈ రికార్డు ఎక్కువ కాలం కొనసాగలేదు. 1997లో సుందే బాయే (ఇథియోపియా) 14:28.09 టైమింగ్‌తో కొత్త రికార్డు నెలకొల్పింది. 2008లో తిరునేష్ ది బాబా 14:11.15 సమయంతో ఒలింపిక్ గోల్డ్ గెలిచింది. గెన్జెబె దిబాబా (తిరునేష్ సోదరి) – 2015 లో 14:15.41 సమయంతో రికార్డు నెల కొల్పింది. 2020లో లేట్సెన్బెట్ గిదే (ఇథియోపియా) 14:06.62లో గమ్యాన్ని చేరడం ద్వారా దిబాబా రికార్డును బద్దలు కొట్టింది. కాగా, ఇథియోపియాకే చెందిన గుడాఫ్ సెగే 2023లో 14 నిమిషాలా, 00.21 సెకెన్లలో లక్ష్యాన్ని చేరుకొని కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఇప్పటికీ ఆమె రికార్డు కొనసాగుతున్నది. మిడిల్ లాంగ్ డిస్టెన్స్ కేటగిరీకి చెందిన ఈ 5000 మీటర్ల పరుగులో స్టామినా, టైమ్ మేనేజ్‌మెంట్, ఫైనల్ ల్యాప్‌లో వేగం అనేవి అత్యంత కీలకం. 400 మీటర్ల ట్రాక్ పై 12.5 రౌండ్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. రన్నింగ్‌లో నెగటివ్ స్ప్రింట్ స్ట్రాటజీ (మొదట నెమ్మదిగా, చివరలో వేగంగా) ఎక్కువగా ఉపయోగిస్తారు. అందుకే, ఈ పోటీలు చివరి వరకూ ఉత్కంఠ సృష్టిస్తాయి. విజేత ఎవరైనప్పటికీ, అంతర్జాతీయ వేదికలపై ఐదు కిలోమీటర్లు పరుగుతీయడం సామాన్యమైన విషయం కాదు. కాబట్టే, డైమండ్ లీగ్ మహిళల 5000 మీటర్ల పరుగులో పాల్గొనడాన్నే విజయంగా భావించాలి. వారి శారీరక, మానసిక దృఢత్వానికి జేజేలు పలకాలి.




గుడాఫ్ సెగే

# దేశ సంపద కార్పొరేట్ శక్తులైన అంబానీ, ఆదానీల వద్దే కేంద్రీకృతం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇళ్లు లేని నిరుపేదలు పెరిగి పోయారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ నగరంలోని తమ్మెర భవన్ శివనగర్‌లో శనివారం సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈసమావేశానికి గన్నారపు రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. ప్రధాని మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బిజెపి యుద్ధోన్మాదానికి కూడా తెరలేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరం అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు. గుత్తా కోటీశ్వరులకు రైట్‌ఆఫ్ లోన్స్ పేరుతో రూ.16 లక్షల 35 వేల కోట్లు రద్దు చేయడాన్ని ఆక్షేపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతు పెట్టినటువంటి పెట్టుబడికి రెట్టింపు ఖర్చు ఇచ్చినప్పుడే మద్దతు ధర లభిస్తుందని, దానికి కేవలం రూ.119 లక్షల కోట్లు మాత్రమే ఖర్చవుతుందని, దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతు ఆత్మహత్యల పాలై ఆహార కొరత ముప్పు కలుగుతుందని తెలిపారు. వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు ఆర్థిక, సాంఘిక, రాజకీయ, ఉద్యోగ, కాంట్రాక్టు రంగాలలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్ ఘడ్‌లో విప్లవ కారులను ఎన్ కౌంటర్ల పేరుతో హత్య చేయడాన్ని ఆపి శాంతి చర్చలు చేయాలని హితువు పలికారు. దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీరోచిత విప్లవాల చరిత్ర కలిగిన శ్రమ జీవుల పార్టీ సిపిఐ అన్నారు. దశాబ్దాలుగా ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటాలను సిపిఐ నిర్వహించిందని చెప్పారు.




**జూలై 30,31 వరంగల్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలి : మేకల రవి**

జూలై 30, 31 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించనున్న సిపిఐ వరంగల్ జిల్లా సదస్సును మహాసభను చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి విజ్ఞప్తి చేశారు. జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభల నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ కె బాష్ మియా, పనాస ప్రసాద్, జిల్లా నాయకులు దండు లక్ష్మణ్, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, గుండె భద్రి, గుంపెల్లి మునీశ్వర్, వీరగోని శంకరయ్య, సంగి ఎలెంధర్, కందిక చెన్నకేశవులు, జన్ను రవి తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును వెంటనే ఆపాలి

ఎమ్మెల్సీ సత్యం డిమాండ్



**ప్రజాపక్షం/మునుగోడు:** బచావత్ ట్రిబనల్ 1980 ఒప్పందాని కి వ్యతిరేకంగా గోదావరి జలాలను కొల్లగొట్టే బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును వెంటనే ఆపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం డిమాండ్ చేశారు.గోదావరి నది జలా లు సముద్రంలో వృధాగా కలుస్తున్నావన్న పేరుతో రాయలసీమ జిల్లాలకు పెన్నా నది పరివాహక ప్రాంతాలకు తరలించే విధంగా ప్రాజెక్టు గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టడం కారణంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. నివారం మునుగోడు మండల కేంద్రలో జరిగిన సిపిఐ నియోజవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ నెలికంటి సత్యం నది జలాల విషయమై మాట్లాడారు కేంద్రలో మోడీ ప్రభుత్వానికి చంద్రబాబు ప్రభుత్వం అండదండలు ఉండటంతో ఈ ప్రాజెక్టుకు అనుమతులతో పాటు ఆర్థిక సహకారం అందించే విధంగా చంద్రబాబు పావులు కలుపుతున్నారు అని ఆరోపించారు. ఇచ్చంపల్లి నుండి గోదావరి జలాలను తరలించే ప్రతిపాదనను తెలంగాణ ప్రభు త్వం వ్యతిరేకించడంతో గోదావరి జలాలు దిగువకుపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ పరిధి నుండి వాటిని తరలించవచ్చునని కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న కుట్రల కారణంగా రానున్న రోజుల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరగనుందని హెచ్చరించారు. నదీ జలాల సాధన కొరకు తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర చర్యలను వ్యతిరేకించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధి దారులకు అధికారులు పరిశీలించి నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల్లో సిపిఐ తమ బలాలను నిరూపించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశానికి మండల కార్యదర్శి చాపల శ్రీను అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి, గురుజ రామచంద్రం, బులుగూరి నరసింహ,తీర్పారి వెంకటేశ్వర్లు,నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి,దుబ్బాక భాస్కర్, బిక్షం రెడ్డి, రమేష్,బూడిద సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి ద్వారా సరిహద్దుల పరిష్కారం : తోట

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** భూభారతి ద్వారా సరిహద్దుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ఎస్‌సి కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన అత్యవసర సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూభారతి పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించిన ములుగు జిల్లా వెంకటాపూర్(రామప్ప) మండలంలో కూడా సరిహద్దుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపడం లేదన్నారు. ఇక దేశమంతటా ఎలా పరిష్కరిస్తారన్నారు. కనుక వెంటనే భూమి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కూడా పారదర్శకంగా ఉండే విధంగా ప్రతి పేదవాడికి ఇండ్లు అందించాలని సూచించారు. అలాగే మావోయిస్టుల ఏరివేతను ఆపివేసి చర్చలు జరపాలని నక్సలైట్లు ఉగ్రవాదులు కాదన్నారు. ఆర్థిక, సామాజిక అంశంగా చూడాలని, వారు పోరాడేది అందరూ సమానత్వంగా ఉండాలని కోరుకుంటారన్నారు. కనుక వెంటనే చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ కూడా పూర్తిగా అమలు కావడం లేదన్నారు. మంత్రులు, అధికారులు చెప్పే వాటికి చేసే వాటికి పొంతన లేదన్నారు. కనుక పాలకులు, అధికారులు వెంటనే తమ డిమాండ్లను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజద్ పాష, సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాగర్, తదితరులు పాల్గొన్నారు.



# మారణకాండను నిలిపివేయాలి

సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మారణ హోమాన్ని వెంటనే నిలిపివేయాలని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజల ఆకలి పోరాటం నుండి ప్రజలు చిందించిన రక్తం నుండి పుట్టింది ఎర్రజెండా అని ఎర్రజెండను అంతం చేయడం ఎవరి తరం కాదని ఆయన అన్నారు.శుక్రవారం సాయంత్రం స్థానిక భాస్కర రావు భవన్‌లో జరిగిన సిపిఐ లెనిన్ నగర్ శాఖ 28వ డివిజన్ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో లెనిన్ నగర్‌ను ఏర్పాటు చేసి డివిజన్‌లో నెలకొన్న అనేక సమస్యలపై పోరాటం చేసిన చరిత్ర ఈ ప్రాంతంలో సిపిఐకి ఉందని ఆయన అన్నారు. గత ఎన్నికల్లో 28వ డివిజన్ నుండి పోటీ సిపిఐ పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయే ఓడిపోవడం జరిగిందని ఈసారి 28వ డివిజన్‌లో అందరూ సమిష్టిగా పనిచేసే సిపిఐ ని గెలిపించుకోవాలని ఆయన కోరారు. రామగుండం నగర పరిధిలో ప్రజా సమస్యలపై పోరాడడంలో పార్టీ ఇచ్చిన పిలుపుల్లో లెనిన్ నగర్ శాఖ నాయకులు ముందు ఉంటారని అన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ పార్టీని ప్రజాసంఘాలను బలోపేతం చేయాలని ఆయన కోరారు. అలాగే సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె. కనకరాజ్ మాట్లాడుతూ గతంలో మంచినీటి పెద్దడిని వివరించాలని అదేవిధంగా డ్రైనేజీ రోడ్లు నిర్మించాలని తరపున పోరాటాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందని తెలిపారు స్వల్ప ఓట్లతో ఓడిపోయిన ఇక్కడ ప్రజల్లో అభిమానం అలాగే ఉందని రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐని ఈ డివిజన్ నుండి గెలిపించాలని అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీలో గత 50 సంవత్సరాలుగా పనిచేస్తూ పార్టీ నాయకులకు అనేక సూచనలు సలహాలు ఇస్తూ వాటిని ప్రాంతంలో ముందుకు నడిపిస్తున్న కామ్రేడ్ ఆసాల మధునయ్యను ఘనంగా సన్మానించారు.ఈ మహాసభలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి కామ్రేడ్ తాళ్ళ పెల్లి మల్లయ్య, కార్యవర్గ సభ్యులు శనిగరపు చంద్రశేఖర్, మర్కా పూరి సూర్య, రేణిగుంట్ల ప్రీతం, సిరిసిల్ల మల్లేష్, టి రమేష్ కుమార్, అసాల రమ, వై లెనిన్,చిలుముల రాజయ్య ,అసాల నవీన్, శనిగరపు తిరుమల తదితరులు పాల్గొన్నారు.అనంతరం సిపిఐ 28వ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.కార్యదర్శిగా సిరిసిల్ల మల్లేష్ సహాయ కార్యదర్శి గా తాళ్లపల్లి సురేందర్, కోశాధికారిగా బూడిద మల్లేష్ తో పాటు 21 మంది కౌన్సిల్ సభ్యులను 9 మంది కార్యవర్గ సభ్యులను నూతనంగా ఎన్నుకున్నారు.




# పార్టీలకు అతీతంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు




సిపిఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ డిమాండ్

**ప్రజాపక్షం/అచ్చంపేట :** రాజకీయపార్టీలకు సంబంధంలేకుండా ఇళ్లులేని ప్రతిపేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సిపిఐజిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ్మ అన్నారు. శనివారం పట్టణంలోని టిఎన్‌జిఓ భవనంలో సిపిఐ 18వ మహాసభలు నిర్వహించారు. ఈమహాసభలు స్థానిక నాయకులు పెరుమాల్ల గోపాల్, మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ నల్లమలలోని ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, పార్టీలపేర , వర్గాలపేరుతో ఎంతో నష్టపోతున్నారన్నారన్నారు. దశాబ్దాలకాలంనుంచి పేపర్ పరిశ్రమ, ఇతర పరిశ్రమలు పెడతామని హామీలు ఇచ్చి మర్చిపోయారన్నారు. నల్లమలలో పరిశ్రమలుపెడితే నిరుద్యోగులకు ఉపాధికల్పించిన వారు అవుతారని అన్నారు. రాజీవ్‌యువవికాస పథకం అమలుచేస్తామని ఇంతవరకు చేయలేకపోతున్నారన్నారు. రైతు రుణమాఫీ ఇంకాపూర్తిగా జరగలేదన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ఉమామహేశ్వరం రిజర్వాయర్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.30లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. బల్మూర్ మండలం జిన్నుకుంటస్టేజివద్ద లెదర్‌పార్కు 17 సంవత్సరాల నుండి మూతపడిందని వెంటనే వినియోగంలోకి తేవాలని డిమాండ్‌చేశా రు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు లేవని వెంటనే ఏర్పాటుచేయాలన్నారు. నేటికి గ్రామీణప్రాంతంలో కనీస సౌకర్యాలులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేశవులుగౌడ్, రాష్ట్ర సిపిఐ నాయకులు డాక్టర్ శ్రీను, మల్లేష్, పార్వతమ్మ, పాండు, విష్ణు, రాములు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## టిపిసిసిచీఫ్‌ను కలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/తల్లాడ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో కేటిపిఎస్ గెస్ట్‌హౌస్ నందు తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై, పార్టీ స్థితి గతులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించటం జరిగిందని, బొమ్మ మహేష్ కుమార్ పార్టీ బలోపేతానికి పలు సూచనలు చేసినట్లు ఎమ్మెల్యే రాగమయి తెలిపారు. ఆమె వెంట తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు , యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు,తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

ఎంఎల్ఎస్ పాయింట్లను అదనపు కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రేషన్ బియ్యం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. శనివారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ మండలాల ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్ల నుండి రేషన్ షాపులకు, విద్యా సంస్థలకు, అంగన్ వాడీ కేంద్రాలకు, గురుకులాలకు సకాలంలో బియ్యం సరఫరా పూర్తి చేయాలన్నారు. రేషన్ బియ్యం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం..: సిపి సునీల్‌దత్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఉద్యోగ విరమణ పొందిన కుటుంబాలకు పోలీసుశాఖ అన్నివిధాల అండగా ఉంటుందని పోలీసు కమిషనర్ సునిల్ దత్ అన్నారు. శనివారం స్థానిక సిపి కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. తొలుత విరమణ పొందిన వారికి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బాధ్యతల నుంచి విరమణ సహజమని మనోధైర్యంతో శేషజీవితం కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. విధినిర్వహణలో పోలీసుశాఖకు అందించిన సేవలను ఆయన కొనియాడారు. వారికి తోడ్పాటునందిచిన కుటుంబసభ్యులను అభినందించారు. భవిష్యతులో ఎటువంటి సహాయసహకారాలకైనా పోలీసు అధికారులు అందుబాటులో ఉంటారని వారి సేవలు వినియోగించుకోవచ్చని మనోధైర్యన్నిచ్చారు. విరమణ పొందిన వారిలో మధిర రూరల్, ఎర్రుపాలెం పోలీసు స్టేషన్‌ల ఎఎస్‌ఐలు ఎ రామకృష్ణరెడ్డి, డి. గోపాలరావు, ఆర్మీరిజర్వుడ్ ఎస్సై జే రమేష్, హోంగార్డు కె.వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, ఎఆర్‌ఎసిపి సునీల్‌సింగ్, ఆర్‌ఐ కామరాజు, సురేష్, పోలీసు అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హోంగార్డు సంక్షేమ సంఘం ఉపాధ్యాక్షుడు ఇ వెంకటేశ్వర్లు, కోశాధికారి,జాయింట్ సెక్రటరి, ఉద్యోగ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాల తనిఖీ



**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని కూసుమంచి గ్రామంలోగల విత్తన దుకాణాలను టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి మరియు కూసుమంచి మండల సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డీలర్లు విత్తన చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని, నిషేధిత విత్తనాలను విక్రయించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. బిల్లుపై తప్పనిసరిగా రైతు సంతకం తీసుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లును మరియు ఆ ప్యాకెట్లను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని తెలియజేశారు. గ్రామాలలో ఎక్కడైనా బిటి 3 విత్తనాలను సరఫరా చేస్తున్నట్లుగాని విక్రయించినట్టుగానే సమాచారం అందితే వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసువారికి సమాచారం అందించాలని కోరారు.

## వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహిళా, శిశు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉద్యోగినుల వసతి గృహం ఖమ్మం నందు ప్రవేశాల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వసతి గృహం స్వీయ నిర్వహణ పద్ధతిపై నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ప్రవేశం పొందాలనుకునే వారు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయం నందు లేదా ఏదైనా సంస్థ నందు ఉద్యోగం చేస్తున్న మహిళా ఉద్యోగులై ఉండాలని, వయస్సు 18 నుంచి 40 సంవత్సరాలు ఉండాలని, ఆర్థికంగా వెనకబడిన వారై ఉండాలని తెలిపారు. ఉద్యోగం కొరకు శిక్షణ పొందుతున్న విద్యార్థినిలు కూడా అర్హులేనని తెలిపారు. అర్హులైన వారు పుట్టిన తేదీ ధృవపత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, ఉద్యోగ ధృవీకరణ పత్రం, ఉద్యోగ శిక్షణకు సంబంధించిన పత్రం, శాలరీ సర్టిఫికెట్‌తో ఖమ్మం నగరంలోని పాత డిఆర్‌డిఎకార్యాలయం పక్కన గల ఉద్యోగినుల వసతి గృహాన్ని సందర్శించాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 7901017341 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## సంస్థ అభివృద్ధికి అందించిన సేవలు మరువలేనివి

ఆర్‌టిసి ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంస్థ అభివృద్ధికి పదవి విరమణ పొందుతున్న వారు అందించిన సేవలు మరువలేనివని టిజిఎస్ ఆర్‌టిసి ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ తెలిపారు. భద్రాచలం డిపో మేనేజర్‌గా, కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఎటిఎం కార్గోగా విధులు నిర్వహిస్తూ రామారావు, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్)గా విధులు నిర్వహిస్తున్న వీరన్న పదవి విరమణ పొందారు.ఈ సందర్భంగా శనివారం ఖమ్మం రీజినల్ ఆఫీస్‌లో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం సరిరామ్ మాట్లాడుతూ సంస్థకు వారు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. సంస్థ అభివృద్ధికి వారు చేసిన కృషి ఎనలేనిదన్నారు. పదవీ విరమణ పొందుతున్న వారు కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సంతోషంగా వారి శేష జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఖమ్మం డిపో మేనేజర్ , పర్సనల్ ఆఫీసర్ , అకౌంట్ ఆఫీసర్ , అసిస్టెంట్ మేనేజర్లు, రీజినల్ ఆఫీస్ సిబ్బంది, కార్గో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు గనుల బ్లాకులు సింగరేణికి వచ్చేలా

# ప్రజా ప్రభుత్వం కృషి



జనరల్ మేనేజర్ కార్యాలయం
ఏరియా వర్క్ షాప్‌ను ప్రారంభించిన
ఉప ముఖ్యమంత్రిభట్టి ,
కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/కొతగూడెం టౌన్:** సింగరేణి కొత్తగూడెం ఏరియా లో 3 ఇంక్లైన్ నందు నూతనంగా నిర్మించిన జనరల్ మేనేజర్ కార్యలయం ఏరియా వర్క్ షాప్ లను శనివారం నాడు ప్రారంభించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక ఇంధన శాఖామంత్రి భట్టి విక్రమార్క కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ ఈ సంధర్భముగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తెలంగాణ రాష్ట్రానికి తల మానికం అని ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ను అభివృద్ధి బాటలో నడిపిస్తున్న కార్మికులకు అభినందనలు తెలిపారు. సింగరేణి పరి వాహక ప్రాంతంలో ఉన్న బొగ్గు గనుల బ్లాకులను ఇతర సంస్థలకు వెళ్లకుండా సింగరేణికి ఆ బ్లాకులు వచ్చేలా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఎన్.బలరామ్ మాట్లాడుతూ, ఎంతో ఆనందకరమైన రోజు, సింగరేణి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు, సహాయ సహకారాలు, ప్రోత్సాహం ఉంటుందన్న భరోసా నింపేందుకు తెలంగాణ కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతోంది. సింగరేణి ఉత్పత్తి చేసి సరఫరా చేస్తున్న బొగ్గుతో దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలతో పాటు సిమెంట్, స్పాంజ్ ఐరన్, హెవీ వాటర్ ప్లాంట్, సిరామిక్స్, ఫార్మా తదితర 2 వేల కంపెనీల మనుగడ కోసం అక్కడ పనిచేస్తున్న లక్షలాది మంది ఉపాధికి బాటలు వేస్తోంది. సింగరేణి అంటే బొగ్గు ఉత్పత్తి చేసే కంపెనీగా చాలా ఏళ్లుగా గుర్తింపు ఉంది. కానీ నేడు మనం చేపట్టిన వ్యాపార విస్తరణ చర్యలతో సింగరేణి కాలరీస్ అంటే థర్మల్ విద్యుత్ రంగంలోనూ, సోలార్ విద్యుత్ ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోనూ తనదైన మార్కును చాటుతోంది. దేశంలోని బొగ్గు సంస్థల్లో థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టిన తొలి బొగ్గు కంపెనీగా గుర్తింపు పొందింది. రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి థర్మల్ ప్రాజెక్టు ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా శాశన సభ్యులు రాందాస్ మాలోత్, కొప్పుల రాజు, ఎస్‌సి ఎస్‌టి, ఒబిసి నేషనల్ కొర్డినేటర్, భద్రాద్రి జిల్లా ఎస్‌పి బి.రోహిత్ రాజు, ఐపిఎస్, డైరక్టర్ ఈఎం డి.సత్యానారాయణ రావు, డైరక్టర్ ఆపరేషన్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరక్టర్ పిపి కొప్పుల వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియుసి జనరల్ సెక్రటరీ బి.జనక్ ప్రసాద్, సిఎంఓఎఐ వైస్ ప్రెసిడెంట్ పి.రాజీవ్ కుమార్, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెమ్ రాజు, కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ సెక్రెటరీ వి.మల్లికార్జున రావు, కొత్తగూడెం వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## అసంబద్ధమైన సర్దుబాటు నియమాలు మార్చాలి

డిఇఒకు పిఆర్‌టియు వినతి



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేవిధం గా సర్దుబాటు ఉత్తర్వులు ఉండాలని, అసంబద్ధమైన రేషనలైజేషన్ నిబంధనలను మార్చాలని కోరుతూ పిఆర్‌టి యు టిఎస్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణకు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు వైవి మాట్లాడుతూ 60 మంది పిల్లల వరకు ఇద్దరు టీచర్లు అని నిబంధనలు విధించడం పూర్తిగా అసమంజసం అన్నారు. 30 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, 60 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లు ప్రాథమిక పాఠశాలలో ఉండాలని అప్పుడే ఉన్నత పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చునని తెలిపారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఉండాలని తెలిపారు. ఈనెల ఆరు నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని ఆ తర్వాత ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ఆయన కోరారు. సర్దుబాటు ఉత్తర్వుల్లో కూడా మార్పులు చేయాలని ఆయన కోరా రు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు విజయ్‌అమృత్‌కుమార్,రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుడు రాయల నర్సింహారావు, వె ంకటరమణ,తదితరులు పాల్గొనారు.

## పొగాకు రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

కొత్తగూడెం మొదటి అదనపు
జిల్లా న్యాయమూర్తి ఎస్ సరిత



**ప్రజాపక్షం/భద్రాచలం:** పొగాకు వాడకం వల్ల అనేక రోగాలభారిన పడి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని, పొగాకు రహిత సమాజాన్ని అంతా కలిసికట్టుగా నిర్మించుకుందామని కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్ సరిత అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు, కోర్టు డ్యూటీ పోలీసుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం ద్వారా కలిగే నష్టాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున అలగాహన కల్పించాలన్నారు. ఈ పొగాకు ఉత్పత్తులకు యువత పెద్ద ఎత్తున ఆకర్షితులవుతున్నారని, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వారిని గమినిస్తూ ఉండాలన్నారు. పొగాకు, సిగరేట్, ఆల్కాహాల వినియోగం వల్ల గుండె జబ్బులు, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ భారిన పడుతున్నారని, తద్వారా మనిషి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగంపై అంతా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి వినియోగదారుల్లో చైతన్యాన్ని నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జీ కిరణ్‌కుమార్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రవికుమార్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం. రాజమల్లు, పిపిపివిడి లక్ష్మీ , కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, న్యాయవాదులు, ఎజిజె , న్యాయశాఖ ఉద్యోగులు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## 6 నెలల గర్భిణీకి,తప్పడు రిపోర్టులు అందచేసిన ఘటనపై విచారణ

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/సత్తుపల్లి:**6 నెలల గర్భిణికి స్కానింగ్ చేసి తొమ్మిది నెలల గర్భిణీకి సంబంధించిన రిపోర్టులు అందించిన ఆల్ఫా స్కానింగ్ సెంటర్ నిర్వాకంపై శుక్రవారం ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురించిన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. గర్భిణీ రిపోర్టుల తారుమారు విషయంపై విచారణ చేపట్టేందుకు శనివారం డిప్యూటీ డి ఎం అండ్ హెచ్‌ఓ సీ తారాం ఆల్ఫా స్కానింగ్ సెంటర్ ను తనిఖీ చేసి, రేడియాలజిస్ట్ రాకేష్‌ను ఘటనపై వివరణ కోరారు. రిపోర్టులు ఎందుకు మారాయని ప్రశ్నించారు. రిఫరెన్స్ చేసిన గైనకాలజిస్ట్ తో ఎందుకు సంప్రదించలేదని ప్రశ్నించారు. అనుమతులకు విరుద్ధంగా మరోమారు నడిచినట్లయితే కఠిన చర్యలుంటాయని, మరోమారు ఇటువంటి ఘటనలు పునరావృత్తం అయితే ఆల్ఫా స్కానింగ్ సెంటర్ ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ధరల పట్టిక లేకపోవడం, వచ్చిన రోగులకు, కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై ఆల్ఫా స్కానింగ్ సెంటర్ నిర్వాహకులపై మండిపడ్డారు. గైనకాలజిస్ట్ కూడా తప్పు ఉందని వారి వివరణ కూడా తీసుకుంటానని డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌ఓ సీ తారాం తెలిపారు. తూతూ మంత్ర తనిఖీలతో రెచ్చిపోతున్న ఆసుపత్రి యాజమాన్యాలు జిల్లా ఉన్నతాధికారులు వార్తా పత్రికలు, టీవీ ఛానళ్ళ లో వార్తలు వచ్చిన సమయంలో మాత్రమే తనిఖీలు నిర్వహించటం, నిర్వహించే తనిఖీలు సైతం ఆసుపత్రి స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు అనుకూలంగా ఉంటుండటంతో ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వైద్యం వికటించి ప్రాణాలు పోయి సెటిల్మెంట్లు జరుగుతున్న విషయం తెలిసినా కూడా జిల్లా ఉన్నతాధికారులు ఆయా ఆసుపత్రి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఇది ఒక వ్యాపారంగా మారిందని మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు మధ్య ఏదో జరుగుతుందనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయని ప్రజాస్వామ్యవాదులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తమపై వస్తున్న ఆరోపణలకు ధీటైన జవాబు చెప్పాలంటే సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అనుమతులకు విరుద్ధంగా ఉన్న ఆసుపత్రులను సీజ్ చేయటంతో పాటు, వరుసగా మరణాలు సంభవిస్తున్న ఆసుపత్రులు, అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే అధికారులపై నమ్మకం కలుగుతుందంటున్నారు ప్రజలు.

## ప్రాచీన కళలకు ఎల్లప్పడూ ఆదరణ ఉంటుంది

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ
చైర్మన్ యారగర్ల హన్మంతరావు




**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** సమాజంలో ప్రాచీన కళలకు ఎల్లప్పుడు ఆదరణ ఉంటుందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యారగర్ల హన్మంతరావు తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఖమ్మం నటరాజ నృత్యానికేతన్ వార్షికోత్సవ వేడుకలు, వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనఎఎంసి చైర్మన్ యారగర్ల హన్మంతరావు మాట్లాడుతూ నాట్యం అనేది శరీర కదలికలను వ్యక్తపరిచే ఓ కళారూపమని తెలిపారు. ఇది సంగీతం, లయ, కదలికల ద్వారా ఓ కథను, భావాన్ని సృష్టిస్తుందన్నారు. ఇది సాంప్రదాయ, సంస్కృతి, వ్యక్తిగత శైలి ద్వారా వర్గీకరించబడతాయని తెలిపారు. కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు మాట్లాడుతూ భారత నాట్యం దక్షిణ భారతదేశానికి చెందిన శాస్త్రీయ నృత్యమని తెలిపారు. కూచిపూడి నాట్యం తెలుగుజాతికి చెందిన శాస్త్రీయ నృత్యమని ఇది లయబద్ధమైన కదలికలు, భంగిమల ద్వారా భాషను వ్యక్తీకరించడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అతిథులచే శిక్షణ పొందిన చిన్నారులకు మెమోంటో, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నటరాజ్ నృత్యానికేతన్ వ్యవస్థాపకులు, గురువు ఎస్. మాధవరావు, సీనియర్ జర్నలిస్టు మాధవరావు యేగినాటి, ప్రముఖ వైద్యులు శోభాదేవి, అసిస్టెంట్ ప్రొ॥ డాక్టర్ కనకవల్లి, కాంగ్రెస్ నాయకులు రెంటాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో డెంగీ పట్ల అవగాహన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వర్షాకాలం నేపథ్యంలో డెంగీ, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య డెంగీ వ్యాధిపై ఆరోగ్య శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు, గత సంవత్సర అనుభవాలు, ప్రస్తుతం అమలు చేయాల్సిన ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో గతేడాది 69 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. ముందస్తు అవగాహన కార్యక్రమాలు, ప్రజల్లో చైతన్యం కలిగించడం, హాట్ స్పాట్‌గా గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవడం వల్ల గతేడాది కేసుల సంఖ్య గణనీయంగా తగ్గించినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది కూడా గత అనుభవాల ఆధారంగా మరిన్ని మెరుగైన చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. గతేడాది కేసులు నమోదైన డివిజన్లను హాట్ స్పాట్‌లుగా గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో క్రిమి సంహారక పిచికారి, ఫాగింగ్, బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వంటివి ఉపయోగించాలన్నారు. డివాటరింగ్, యాంటీ లార్వా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి వెళ్లి డెంగ్యూ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

## మానవాళి అభివృద్ధికి గొడ్డలిపెట్టు పొగాకు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మానవాళి అభివృద్ధికి పొగాకు గొడ్డలిపెట్టు లాంటిదని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎనిమిది అడుగుల బాహుబలి సిగరెట్‌ను తయారు చేసి పొగాకు ద్వారా ఉత్పత్తి అయ్యే పదార్థాలను వ్యతిరేకిస్తున్నామని తెలుపుతూ వాకర్స్ సభ్యులు, యువత నడక సాధకులు, మహిళలు సిగరెట్ బొమ్మపై సంతకాలు చేశారు. పొగాకు పదార్థాలకు వ్యతిరేకంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోలవేసికు చెందిన ఒక చిన్న మొక్క ద్వారా పొగ విడుదలవు తున్నందువలన దీనికి పొగాకు అని పేరు వచ్చిందన్నారు. దీని ఆకుల నుండి సిగరెట్లు తయారు చేస్తారని దీనిని కొన్ని తరాలు తాంబులాల్లో కూడా ఉపయోగించారని వారు తెలిపారు. క్రీస్తు పూర్వం 1400 ఏళ్ల నాడే పూర్వీకులు పొగాకును ఎంతగాను అభిమానించే వారని కానీ అది మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని గ్రహించలేదన్నారు. ఇప్పుడు ఆ పొగాకు ప్రాణాంతకంగా తయారైందన్నారు. పౌర సమాజం పొగాకును వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ సభ్యులు రాకం శ్యాంబాబు, విజయ్‌కుమార్, వెంకట్, సుదర్శన్, మందా వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, దామోదర్‌రెడ్డి, మాధవి,తదితరులు పాల్గొన్నారు

# కాలుష్య కోరల్లో గోదావరి!

ఐటిసి సమీపంలో మరింత దారుణం





**ప్రజాపక్షం/బూర్గంపాడు:**గోదారమ్మ కాలుష్య కోరల్లో మగ్గుతోంది. సాగు, తాగునీటికి ఉపయోగపడే గోదావరి కాలుష్య కాసారంలా మారుతోంది. దీంతో గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు నీటి వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా సారపాక, నాగినేని ప్రోలురెడ్డిపాలెం, బూర్గంపాడు, భద్రాచలం, గోదావరి పరీవాహక సమీపంలో మరింత ఎక్కువగా ఉంది.

**దారుణంగా నీటి నాణ్యత..**

గోదావరి నీటి కాలుష్యం ఎంత దారుణంగా ఉందంటే చెప్పలేనంత. గతంలో కేంద్ర జలవనరుల సంఘం చేసిన అధ్యయనంలో కళ్లు చెదిరే నిజాలు బయటపడ్డాయి. ఈనీటిని గనుక నేరుగా తాగితే అతిసార భారిన పడటం ఖాయం. ఈ నీటితో నేరుగా స్నానాలు చేస్తే చర్మ సంబంధిత వ్యాధులు రావడం ఖాయం. బూర్గంపాడు, భద్రాచలం సమీపంలో ఐటిసి పిఎస్‌పిడి ద్వారా నదిలో కలుస్తున్న కలుషిత నీటితో పెద్ద ఎత్తున ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. మనుష్యులతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉండే పశువులు సైతం నీటి కాలుష్యం వల్ల తీవ్ర రోగాల భారిన పడుతున్నాయి. ఇందుకు కారణంగా నీటిలో నాణ్యత లోపించడమే. నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోవడం వల్ల జలచారాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. మరో ప్రక్క సూర్య కాంతి నీటిలోనికి ప్రవేశించనంత కాలుష్యం ఉండటంతో మొక్కలు సైతం పెరిగే పరిస్థితి లేకుండా పోయింది.

**చర్మ వ్యాధులు, క్యాన్సర్ ప్రభావం....**

ఐటిసి పరిసర ప్రాంతాల్లో నీరు కలుషితం అవుతోంది. తద్వారా పరిస్థితులు భిన్నంగా మారుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో చాలా మంది చర్మవ్యాధుల భారిన పడుతున్నారు. పశువులు సైతం చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఐటిసితో పాటు ఇతర కాలుష్యం వల్ల పెద్ద ఎత్తు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఐటిసి రసాయనపు నీరు గోదావరిలో కలిసేందుకు పైపు లైను ఉంది. నీరు సమీప పొలాల్లో సైతం ఉపయోగిస్తున్నారు. కనీసం వ్యవసాయాధికారులు అధ్యయనం చేసి, శాంపిల్లు సేకరించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. కానీ అది కూడా జరగడం లేదు. గోదావరి నీరు కలుషితం అవుతున్నప్పటికీ ఐటిసి పిఎస్‌పిడి దిద్దుబాటు చర్యలు చేపట్టిన దాఖలాలు పెద్దగా కనిపించడం లేదు. సమీప ప్రాంతాలకు కొద్దిపాటి నిధులు కేటాయించి చేతులు దులిపేసుకుంటున్నారు. కొన్ని కొన్ని సార్లు సిఎస్‌ఆర్ ఫండ్స్ దారిమళ్లిపోతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## 2న తెలంగాణ ఆవిర్భావ కవి సమ్మేళనం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ కవి సమ్మేళనంను జయప్రదం చేయాలని ఉమ్మడి వరంగల్లు జిల్లా అరసం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బూర భిక్షపతి,డాక్టర్ మార్క శంకర్ నారాయణ ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణా రాష్ట్ర అరసం పక్షాన తెలంగాణ 11వ రాష్ట్ర ఆవిర్భావ సందర్భంగా వివిధ కవులచే కవి సమ్మేళనం నిర్వహించ బడుతుందని, జూన్ 2వ తేదీన హైదరాబాద్ లోని నారాయణగూడ చౌరస్తాలో గల ఎఐటియుసి కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్లో సాయంత్రం గం.4లకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర అరసం అధ్యక్షులు డాక్టర్ పల్లేరు వీరస్వామి సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ సమ్మేళనంలో డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆచార్య పిల్లలమర్రి రాములు, కందిమళ్ళ ప్రతాపరెడ్డి, డాక్టర్ రాపోలు సుదర్శన్ తదితరులు పాల్గొంటారని, రాష్ట్రంలోని నిష్ణాతులైన కవులు,కవయిత్రులు ఇందులో పాల్గొని కవితా గానాలు చేస్తారని,అందరూ పాల్గొనాలని ఉమ్మడి వరంగల్లు జిల్లా అరసం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బూర భిక్షపతి,డాక్టర్ మార్క శంకర్ నారాయణ కోరారు.

## గ్రామీణ ఆటలు నిర్వహించడం అభినందనీయం :ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/చిట్యాల:**గ్రామీణ బాల్ బ్యాడ్మింటన్ ఆటలను ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో చిట్యాలలో నిర్వహించడం అభినందనీయమని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ఆవరణంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా బాల్ బ్యాట్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహించగా శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఉమ్మడి జిల్లా స్థాయిలో 24 టీములు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం కార్యక్రమం అనంతరం బాల్ బ్యాట్మింటన్ కోర్టులో క్రీడాకారులతో కలిసి ఆటలు ఆడి క్రీడాకారులలో కొత్త ఉత్సవాన్ని రేకెత్తించి సందడి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ క్రీడలు యువతలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే కాకుండా మనుషుల మధ్య ప్రేమానురాగాలు పెంచుతాయని అన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచి స్నేహపూర్వకంగా ఆటలు ఆడుకోవాలని అన్నారు. గెలిచినవారు ఓడిన వారిని హేళన చేయకుండా స్నేహపూర్వకంగా క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని ఎప్పుడైనా క్రీడలు నిర్వహించేందుకు తన వంతుగా సాయసహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే అన్నారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎన్ఆర్, ఏఎంసి చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి దంపతులు, భూపాలపల్లి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కమిటీ ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి స్వామి, వెంకట్రామిరెడ్డి, అంజాద్ పాషా, ప్రధాన కార్యదర్శి గుత్తికొండ సాంబయ్య, కోశాధికారి రవీందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య, జిల్లా నాయకులు చిలుకల రాయకోమురు, మండల కార్యదర్శి గడ్డం కొమురయ్య, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్ల కొండ కుమార్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ కవాతు

### పరకాల ఎసిపి సతీష్ బాబు

**ప్రజాపక్షం/పరకాల :** శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహిస్తున్నామని పరకాల ఎసిపి సతీష్ బాబు తెలిపారు. ఈ మేరకు పరకాల డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పరకాల మండల కేంద్రంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు చేపట్టారు. ఎసిపి ముఖ్య అతిథిగా పాల్గొన్ని జెండా ఊపి కవాతు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఎ. ఎఫ్ డిప్యూటీ కామాండెంట్ సరస్వతి, ఇన్స్పెక్టర్లు క్రాంతి కుమార్, సంతోష్, రంజిత్తో పాటు ఎస్. ఐ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## నాడు, నేడు పేదలకు ఇల్లు ఇచ్చింది కాంగ్రెస్సే



**ప్రజాపక్షం/నెక్కొండ:** ఉమ్మడి రాష్ట్రంలో ఆనాడు ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని ఆనందం మంది ముఖ్యమంత్రి అయ్యే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఇంద్ర మహిళల మంజూరు చేస్తున్నదని గత ప్రభుత్వాలు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని టిపిసిసి సభ్యుడు రంజిత్ రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డిలు అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరి పత్రాలను వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంటలో లబ్ధిదారులకు వారు అందించారు. వారు ఇరువురు మాట్లాడుతూ పేదవారి సొంతింటి కల కాంగ్రెస్ నెరవేస్తున్నదని గతంలో ఈ ఇండ్లు కూడా ఇవ్వని నేతలు అల్లుడు వస్తే ఎక్కడ పడుకుంటాడు అన్నారే తప్ప ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయని మాటల ప్రభుత్వం అది అని,ఇప్పటివరకు అల్లుడిని ఊరు బయటనే ఉంచు కోవలసిన పరిస్థితని, వారు గత ప్రభుత్వా పరిపాలనను దుయ్యపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట న్యాయస్థాన ఎజిపి బండి శివకుమార్, నెక్కొండ మాజీ ఉపసర్పంచ్ కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయి కృష్ణ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా కేంద్రంలో 'వరల్డ్ నో టుబాకో' ర్యాలీ

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:**తెలంగాణ రాష్ట్ర కుటుంబ సంక్షేమ, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ కమిషనర్ ఆదేశానుసారం వరల్డ్ నో టుబాకో ర్యాలీని ప్రధాన ఆసుపత్రి ములుగు నుండి బస్టాండ్ వరకు నిర్వహించారు. ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో నోటుబాకో ఆలోచన కలిగించి గుట్కా, తంబాకు, సిగరేట్, బిడి లాంటివికి ప్రజలను దూరంగా ఉంచడమే ఈ ర్యాలీ ఉద్దేశమని, భారతదేశంలో మూడు లక్షల పైచిలుకు మరణాలు కేవలం పొగ త్రాగడం వలనే సంభవిస్తున్నాయని, పొగాకులో ఉండే నికోటిన్ అనే పదార్థం మెదడుపై పనిచేసి మత్తు బానిసలుగా గురవుతున్నారని తెలిపారు. గుట్కా, తంబాకు, సిగరేట్, బిడి పొగ ఉత్పత్తులలో 69 రకాల క్యాన్సర్ కారక రసాయనాలు ఉంటాయని అవి వాడడం వలన తాగు వ్యక్తితో పాటు ఇతరులకు కూడా ఈ అనర్థాలు సంభవిస్తాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో బస్టాండ్లలో రైల్వే స్టేషన్లో సినిమా హాల్లో మార్కెట్లలో విద్యా సంస్థలలో, ఆసుపత్రుల వంటి ప్రదేశాల్లో పొగాకు, పొగాకు ఉత్పత్తులు వాడడం చట్టరీత్యా నేరమని ఇది ఉల్లగించిన వారిపై రెండు వేల రూపాయల జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందని తెలిపారు. అనంతరం పొగుకు దూరంగా ఉందాం, ఆరోగ్యంగా జీవిద్దాం, గుట్కాలు తినొద్దు...ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దు, పొగాకు వాడొద్దు...క్యాన్సర్కు గురికావద్దనే నినాదాలతో పాటు సమాజంలోని ప్రజలను పొగుకుకు దూరంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నాగ్ అన్వేష్, డెమో సంపత్, డిపి సాంబయ్య, ఎన్సిడి కోఆర్డినేటర్స్ వెంకట్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మానిటరింగ్ సూపర్వైజర్ సురేష్బాబు, రాయినిగూడెం దేవేందర్, రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమష్టి కృషితోనే సరస్వతి పుష్కరాలు విజయవంతం

### రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**ప్రభుత్వం ఏదైనా ఆలోచన మాత్రమే చేస్తుందని, ఆచరణలో పెట్టాల్సింది అధికారులేనని, అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేస్తేనే సరస్వతి పుష్కరాలు విజయవంతం అయ్యాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన జరిగిన సరస్వతి పుష్కరాలు డే ఆఫ్ థాంక్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పుష్కరాలు ఘనంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి అలోచన మేరకు జిల్లా యంత్రాంగం 12 రోజులు 24 గంటలు నిర్విరామంగా కష్ట పడ్డారని తెలిపారు. క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేస్తేనే అది అమలు అవుతుందని నిరూపించారని, పుష్కరాలు వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినట్లు తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని సరస్వతి పుష్కరాలఽ నిర్వహణను ప్రభుత్వం ఒక సవాలుగా తీసుకుని నిర్బహించినట్లు తెలిపారు. పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం 40 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. నిజానికి పుష్కరాల నిర్వహణ అంత తేలిక కాదని, ఏ చిన్న పొరపాటు జరిగినా, నిర్లక్ష్యంగా ఉన్నా జరిగే నష్టం అంతా ఇంతా కాదని పేర్కొన్నారు. శాసనమండలి ఎన్నికల కోడ్ అమల్లో ఉంది పనులు చేయడానికి ఆటంకం ఏర్పడింది. అయినా ఇంజినీరింగ్ అధికారులు పనులను.పూర్తి చేశారని అభినందించారు. మనకు చాలా తక్కువ సమయం మాత్రమే ఉంది అయినా మీరంతా కష్టపడి ఒకరికొకరు సమన్వయం చేసుకుని, ఒక టీం వర్క్ లా పనిచేసి పుష్కరాలను అత్యంత విజయవంతంగా నిర్వహించారని హర్షం వ్యక్తం చేశారు. సుమారు 30 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని తెలిపారు. పుష్కరాలను విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భద్రత, నీటి సరఫరా, అన్నదా నం, మెడికల్ సౌకర్యాలు, శౌచాలయాలు, విద్యుత్, పారిశుధ్యం, మీడియా కవరేజి ఇలా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చేశారన్నారు. యంత్రాంగం కృషి వల్లే తెలంగాణలో తొ లిసారిగా కాశీ పండితుల చేతుల మీదుగా ప్రతి రోజు సా యంత్రం నిర్వహించిన సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమం మొత్తం పుష్కరాలకే ప్రధాన ఆకర్షణగా నిలిచిందన్నారు.ఈ పుష్కరాల ద్వారా ఆర్టీసికి సుమారు 10 కోట్ల ఆదాయం వచ్చిందని, ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ అవకాశాన్ని వినియోగించుకొని లక్షలాది మంది సోదరీమణులు పుష్కరాలకు విచ్చేశారని అన్నారు. 12 రోజుల పాటు దాదాపు 9 వేల ట్రిప్పులు బస్సులు నడిచాయని తెలిపారు. మీడియా మిత్రుల సహకారం గురించి ఈ రోజు ప్రత్యేకంగా చెప్పుకోవాలని, ఎప్పటికప్పుడు పుష్కరాలకు సంబంధించిన సమాచారాన్ని భక్తులకు తెలియజేసి విజయవంతంగా కావడంలో కీలక పాత్ర పోషించారని అభినందించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా మి త్రులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. మీ సహకారం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నానని మంత్రి తెలిపారు. స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయం. వారికి ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఇది మొదటి అడుగు మాత్రమేనని రానున్న గోదావరి పుష్కరాలను మరింత వైభవంగా నిర్వహించాలన్నదే మా ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ విషయంలో అసలు రాజీ పడబోమని, ఈ పుష్కరాల్లోని లో టుపాట్లను గుర్తించి అవి పునరావృతం కాకుండా చర్య లు తీసుకోవాల్సిన గురుతర బాధ్యత మనపై ఉందని అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ జిల్లా యంతర్ంగా సమిష్టిగా కష్టపడి పనిచేసి సరస్వతి పుష్కరాలను విజయవంతం చేసినట్లు తెలిపారు. సరస్వతి పుష్కరాలను బ్రహ్మాండంగా నిర్వహించిన యంత్రాంగం యొక్క కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ యంత్రాంగమంతా ఒకతాటిపై నిలబడి అహర్నిశలు శ్రమించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. సమగ్ర ప్రణాళికలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. 12 రోజులపాటు సరస్వతి పుష్కరాలను అత్యంత విజయవంతంగా నిర్వహించామని ప్రతి ఒక్కరిని అభినందించారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ, సరస్వతి పుష్కరాలు 12 రోజులు నిర్విరామ కృషిచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సింగరేణి జి ఎం రాజేశ్వర్ రెడ్డి, ఆర్టీసీ వరంగల్ ఆర్ ఎం విజయ భాను, ఆర్డిఓ రవి, ఎఎస్పీ నరేష్ నాయక్, డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జూన్2వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను డిసిపి రాజమహేంద్ర నాయక్, ఎసిపి పండరి చేతన్ నితిన్లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలు అట్టహాసంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఆర్డీవో గోపిరామ్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్రావు, తహసీల్దార్ హుస్సేన్, కలెక్టరేట్ ఎఓ మన్సూర్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/ హనుమకొండ:** జిల్లాలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతంగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లో ఇందిరమ్మ ఇండ్లు, లబ్ధిదారుల ఎంపిక, పొజిషన్ సర్టిఫికెట్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, డబుల్ బెడ్రూం ఇళ్ళు, తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకంపై ఎస్సి కార్పొరేషన్ ఇడి బాలరాజు, ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ డిఇ సిద్ధార్థ నాయక్, ఆయా మండలాలలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి సంబంధించిన వివరాలను ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో మొదటి దశలో రూ. 50 వేలు, రూ.లక్షలోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను జూన్ 9నాటికి పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మండల స్థాయిలో పూర్తి చేసిన తర్వాత ఆ జాబితాను సబ్సిడీ రుణాల మంజూరు నిమిత్తం జిల్లా ఇన్చార్జి మంత్రికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి పైలెట్ గ్రామాలలో ప్రారంభమైన ఇండ్ల నిర్మాణాల పనులను వేగంగా పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికను అధికారులు పూర్తి చేయాలన్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ప్రొసీడింగ్ పత్రాలు ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేస్తారని, లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 6 నాటికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావాలన్నారు. జూన్ 9 నాటికి 100% నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఎంపిడిఒలు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అదనంగా బఫర్ లిస్టు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్లు వైవి గణేష్, మేన శ్రీను, పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు, ఎపిఎంలు పాల్గొన్నారు.

## అగ్ర కులాలకు పది శాతం రిజర్వేషన్లతో బిసిలకు అన్యాయం

### బిసి హక్కుల సాధన సమితిరాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం10 శాతంలేని అగ్రకులాలకు ప్రభుత్వవిధ్య, ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పించి అమలుజరుపుతున్నందున దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఆవేదనవ్యక్తంచేశారు. 53శాతం ఉన్న బీసీలకు కేవలం27శాతం రిజర్వేషన్లు అమలు జరపడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్ కల్పించాలని దేశవ్యాప్తంగాబీసీసంఘాలుఉద్యమాలుచేస్తున్న పట్టించుకోని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అగ్రకుల పేదల కోసమని ఆగ మేఘాల మీద 10శాతం రిజర్వేషన్ తెచ్చి అమలు జరుపుతుండటమేంటని ఆయన ప్రశ్నించారు. బీసీ ప్రధానమంత్రినని పదేపదే గొప్పగా చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ పాలనలో బీసీలకు అన్ని రంగాలలో తీరని అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీల యేడల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే అగ్రకులాల పేదల కోసమని చేసిన పది శాతం రిజర్వేషన్లు రద్దు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు డిమాండ్ చేసినట్టుగా కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కలిగించాలని, మహిళా రిజర్వేషన్ల లో బీసీ కోటా నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ జనగణలో కులగణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ ప్రక్రియను వెంటనే ప్రారంభించి, నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలతో మభ్యపెడుతూ ప్రచార ఆర్భాటాలతో కాలయాపన చేస్తే బీసీల ఉద్యమాలు ఉధృతమవుతాయని ఆయన హెచ్చరించారు.

## ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ పార్టీ


### ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:**పేదింటి ఆడబిడ్డలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని పలు మండలాలకు చెందిన కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రూ.2కోట్లు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు రెండు కోట్ల చెక్కుల పంపిణీ చేయడం బడుగు బలహీనవర్గాల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. మహిళలకు ఆర్థిక వెసులుబాటును కల్పిస్తూ వారి పురోగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వడ్ల కోనుగోలు కేంద్రాలు మొదలు ప్రభుత్వ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజి, మౌలిక వసతుల కల్పనతో పాటు పేద విద్యార్థుల కోసం రెండు వందల కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను తీసుకోచ్చానన్నారు. స్థానిక తహసీల్దారు చంద్ర రాజేశ్వరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, ఎడ్ల రమేష్, జిల్లా నాయకులు శంతన్రామరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రవి, నీరుటి సురేష్, సల్వాది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


# ఉద్యోగికి పదవీ విరమణ సహజం

### ఎస్పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని వారి శేష జీవితం సుఖంగా కొనసాగించాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆకాంక్షించారు. పోలీస్ శాఖలో 36 ఏళ్లుగా సేవలందించి శనివారం పదవీ విరమణ పొందిన ఇద్దరు ఏఎస్సైలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కిరణ్ ఖరే ఘనంగా సత్కరించి, గృహపకరణాలు అందజేశారు. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పల్నాటి సాంబయ్య, ఘనపురం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న పోరిక రతన్ సింగ్ పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. సుమారు 36 ఏళ్ల పాటు పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు మరియు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విశ్రాంత ఉద్యోగులుతమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పి ఏ నరేష్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రత్నం, శ్రీకాంత్, కిరణ్, పోలీసు అధికారుల సంఘం నేత యాదిరెడ్డి, విశ్రాంత ఏఎస్సైల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పిగా నరేష్ కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి అదనపు ఎస్పిగా ఏ.నరేష్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పోలిసు శాఖలో 1991సంవత్సరంలో ఎస్ఐగా ఎంపికయిన అదనపు ఎస్పి నరేష్ కుమార్, మొదట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సుల్తానాబాద్, రాయకల్, కోరుట్ల, వేములవాడ, కరీంనగర్ రూరల్లో ఎస్ఐగా విధులు నిర్వహించి, 2006లో సిఐగా పదోన్నతి పొంది, సిఐడి వరంగల్, ఖమ్మం, కొత్తగూడెం, జగిత్యాల, ఖానాపూర్ సీఐ గా విధులు నిర్వర్తిస్తూ, 2017లో డిఎస్పిగా పదోన్నతి పొంది, మహబూబాబాద్, మామునూర్ ఎసిపిగా విధులు నిర్వర్తిస్తూ, 2023 లో అదనపు ఎస్పిగా ప్రమోషన్ పొంది, ఖమ్మం పోలీసు కమిషనరేట్ లో అదనపు డిసిపి అడ్మిన్గా విధులు నిర్వర్తిస్తూ, భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్గా బదిలీపై రావడం జరిగింది. అదనపు ఎస్పిగా బాధ్యతలు స్వీకరించిన ఏ.నరేష్ కుమార్, జిల్లా ఎస్పి కిరణ్ ఖరేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు ఎఎస్పికి ఎస్పి కిరణ్ ఖరే శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల రక్షణ కోసం సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.

# శిక్షణ కేంద్రం నిర్మాణ పనులు త్వరగా పూర్తి

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి



**ప్రజాపక్షం/దామెర:** మండలంలోని ల్యాదెళ్లలో ఏర్పాటుచేయనున్న మహిళా నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని శనివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలోని ల్యాదెళ్లలో ఏర్పాటుచేయనున్న మహిళా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకరావాలన్నారు. ల్యాదళ్లలో సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల రూరల్, టౌన్ మహిళలకు అందుబాటులో ఉంటుందన్నారు. స్కిల్ డెవలప్మెంటు సెంటర్ ద్వారా ప్రతీఇంట్లో ఒకరికిఉపాధిఅవకాశాలు పొందుతారని, త్వరలో దామెర మండల కేంద్రంలో డైరీ సెంటర్ను ఏర్పాటుచేయ బోతున్నామన్నారు.

# క్రీడ





## గంభీర్ సెలక్ట్ చేయడు..

### రిజెక్ట్ మాత్రమే చేస్తాడు: అతుల్ వాసన్

టీమ్ఇండియా జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. ఇందులోభాగంగా అయిదు టెస్టుమ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈనేపథ్యంలో ఇటీవలే ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టును బిసిసిఐ సెలక్టర్లు ప్రకటించారు. ఇందులో శ్రేయస్ అయ్యర్‌కు స్థానం దక్కలేదు. నిజానికి అతడు మంచి ఫామ్‌లో ఉన్నాడు. ప్రస్తుత ఐపిఎల్‌లోనూ చక్కగా రాణిస్తున్నాడు. అయినా జట్టులో చోటు దొరక లేదు. ఇదే విషయమై విలేకర్లు ప్రశ్నిస్తే బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అసలు కారణం ఏంటో వివరించే ప్రయత్నం చేశాడు. కానీ టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం 'నేను సెలక్టర్‌ను కాదు..' అని జవాబిచ్చాడు. టీమ్ఇండియా మాజీ పేసర్ అతుల్ వాసన్ ఒక ఓటీటీ షోలో ఈ అంశం మీద మాట్లాడుతూ 'గంభీర్ సెలక్ట్ చేయడు.. కేవలం రిజెక్ట్ మాత్రమే చేస్తాడు' అంటూ చురకలంటించాడు. భారత జట్టు ఎంపికలో కోచ్‌కు కూడా కీలక పాత్ర ఉంటుందని వివరించాడు. శ్రేయస్ అయ్యర్‌ను టీమ్‌లోకి ఎందుకు తీసుకో లేదో అతడు వివరంగా చెప్పి ఉండాల్సిందని ఈసందర్భంగా అతుల్ వాసన్ అన్నాడు. శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయకపోవడంపై పలువురు క్రీడాభిమానులు, విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. మంచి ఫామ్‌లో ఉన్న అతడికి జట్టులో చోటు కల్పించకపోవడం సరైన నిర్ణయం కాదంటున్నారు.

## అతనితో విభేదాల్లేవ్..

### ఆ వార్తలను నమ్మొద్దు: శుభ్‌మన్ గిల్

హార్దిక్ పాండ్యాతో విభేదాలు అంటూ వచ్చిన వార్తలపై గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పందించాడు. హార్దిక్ పాండ్యాతో తనకు ఎలాంటి విభేదాలు లేవని, సోషల్ మీడియాలో చూసే ప్రతీ విషయాన్ని నమ్మవద్దని అభిమానులను కోరాడు. ఐపిఎల్ 2025 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 20 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. అయితే ఈ మ్యాచ్ సందర్భంగా శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యా ఒకరినొకరు చూసుకోకపోవడం, విష్ చేసుకోకపోవడం చర్చనీయాంశమైంది. టాస్ సందర్భంగా ఈ ఇద్దరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోలేదని, ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. హార్దిక్ పాండ్యా షేక్ హ్యాండ ఇచ్చేందుకు ప్రయత్నించినా.. గిల్



పట్టించుకోకుండా పక్కకు వెళ్లిపోయాడని, ఆ తర్వాత గిల్ ఔటైనప్పుడు హార్దిక్ దూకుడుగా సెలబ్రేట్ చేసుకున్నాడని నెటిజన్లు కామెంట్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా వైరల్ చేశారు. దాంతో ఈ ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయని చాలా మంది భావించారు. టీమిండియా కెప్టెన్సీ విషయంలో ఇద్దరి ఇగో క్లాష్ మొదలైందని చాలా మంది అనుకున్నారు. అయితే, ఈ ప్రచారంపై శుభ్‌మన్ గిల్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించాడు. హార్దిక్ పాండ్యాతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేసిన శుభ్‌మన్ గిల్.. తమ మధ్య మంచి అనుబంధం, ప్రేమ మాత్రమే ఉన్నాయని స్పష్టం చేశాడు. 'ప్రేమకు మించి ఏది లేదు.. ఇంటర్నెట్‌లో చూసే ప్రతీది నమ్మవద్దు'అనే క్యాప్షన్‌తో హార్దిక్ పాండ్యాను ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశాడు. రోహిత్ శర్మ వారసుడిగా శుభ్‌మన్ గిల్‌కు టీమిండియా టెస్ట్ టీమ్ సారథ్య బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఇంగ్లండ పర్యటనతో శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలను స్వీకరించనున్నాడు. ఐపిఎల్ 2025 సీజన్‌లో అసాధారణ ప్రదర్శన కనబర్చిన గుజరాత్ టైటాన్స్.. కీలక ఎలిమినేటర్‌లో ఓటమిపాలైంది. ఆఖరి వరకు పోరాడినా గుజరాత్‌కు విజయం దక్కలేదు.

## డబుల్ సెంచరితో అదరగొట్టిన కరుణ్ నాయర్..

కరుణ్ నాయర్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి మరోసారి ఎంట్రీ ఇవ్వనున్నాడు. డొమెస్టిక్ సీజన్‌లో అద్భుతంగా రాణించి సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. దాంతో ఇద్దరు సీనియర్ల రిటైర్మెంట్.. కీలక ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపికయ్యాడు. ఈ పర్యటనకు ముందు ఇంగ్లాండ్‌లో పర్యటించే భారతఏ జట్టులోనూ చోటు దక్కింది. కీలక మ్యాచ్‌లకు ముందు సన్నాహకంగా ఎంపిక చేయగా.. బ్యాటింగ్‌తో అద్భుతంగా రాణించాడు. ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన అనధికారిక టెస్ట్‌లో డబుల్ సెంచరీ చేరశాడు. కాంటర్‌బరీలో ఇండియా–ఏ–ఇంగ్లాండ్ లయన్స్ మధ్య నాలుగు రోజుల మ్యాచ్ నిన్న మొదలైన విషయం తెలిసిందే.
భారత సీనియర్ జట్టు పర్యటనకు ముందు సన్నాహకంగా ఇంగ్లాండ లయన్స్‌తో జరిగిన ఈ రెండు మ్యాచ్‌ల సిరీస్ కోసం బీసీసీఐ పలు



వురు ఆటగాళ్లను పంపింది. తొలి మ్యాచ్‌లో కరుణ్ మూడవ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. తొలిరోజునే సెంచరీ చేశాడు. మొదటిరోజు ఆట ముగిసే వరకు 186 పరుగులతో అజేయంగా నిలిచాడు. రెండోరోజు ఫోర్ కొట్టి డబుల్ సెంచరీ పూర్తి చేశాడు. రెండోరోజు టీమిండియా 557 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. కరుణ్ నాయర్ 281 బంతుల్లో 26 ఫోర్లు, సిక్సర్ తో 204 పరుగులు చేసి.. జమాన్ అక్తర్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. భారత్ 51 పరుగుల వద్ద యశస్వి జైస్వాల్, అభిమన్యు ఈశ్వర్ వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత సర్ఫరాజ్ ఖాన్‌తో కలిసి కరుణ్ నాయర్ మూడో వికెట్‌కు 181 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. సర్ఫరాజ్ త్రుటిలో సెంచరీ మిసయ్యాడు. 119 బంతుల్లో 13 ఫోర్ల సహాయంతో 92 పరుగులు చేసిన తర్వాత పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత కరుణ్ నాల్గవ వికెట్‌కు ధ్రువ్ జురెల్‌తో కలిసి 195 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 120 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 94 పరుగులు చేసిన తర్వాత జురెల్ అవుట్ అయ్యాడు. ఇక తెలుగు ఆటగాడు నితీశ్‌రెడ్డి ఏడు పరుగులు చేసి అవుట్ అయ్యాడు.



## జూన్ 6న అఖిల్ వివాహం

### సిఎంను ఆహ్వానించిన నాగార్జున

అక్కినేని అఖిల్ వివాహం జూన్ 6వ తేదిన జరుగనుంది. ఈమేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన అక్కినేని నాగార్జున తన కుమారుడు అఖిల్ పెళ్ళి ఆహ్వాన పత్రిక అందించారు. జూబిలీ హిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో నాగార్జున,అమల భేటి అయ్యారు. ప్రముఖ పెయింటింగ్ ఆర్టిస్ట్ జైనాబ్ రవుడ్జి అనే అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త జుల్ఫి రవుడ్జి కుమార్తె. కొద్ది రోజులు ప్రేమలో మునిగి తేలుతున్న అఖిల్ అక్కినేని, జైనాబ్ పెద్దలను ఒప్పించి పెళ్లికి ఆహ్వానించారు.

## ప్రభుత్వాలు దాసరి పేరిట అవార్డులివ్వాలి



దాసరి ఫిల్మ్ అవార్డ్స్ వేడుకలో వక్తల అభిలాష!!

దాసరి సప్తమ వర్ధంతి సందర్భంగా ప్రముఖ నిర్మాత భీమవరం టాకీస్ అధినేత తుమ్మలపల్లి రామసత్యనారాయణ దాసరి ఫిల్మ్ అవార్డ్స్ వేడుకను ఘనంగా నిర్వహించారు. దాసరి శిష్యులు ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ వేడుకలో వంశీ రామరాజు, జైహింద్ గౌడ్ దర్శకుడు బాబ్జి, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు. నాగబాల సురేష్, వైజాగ్ శేషమాంబ తదితరులు దాసరి స్మారక పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అతిథులు, సన్మాన గ్రహీతలు దాసరితో తమకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకొని, ఆయన వ్యక్తిత్వాన్ని కొనియాడారు. సినిమా రంగానికి సంబంధించి అన్ని కీలక శాఖల్లోనే కాకుండా రాజకీయాలు, పత్రికా రంగంలోనూ చెరగని ముద్ర వేసి, తెలుగు సినిమా పరిశ్రమకు పెద్ద దిక్కుగా భాసిల్లిన దాసరి పేరిట తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అవార్డులు నెలకొల్పాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

# రీల్

## గద్దర్ సినీ అవార్డ్స్ 2014.. సెకండ్ బెస్ట్ ఫిల్మ్ 'పాఠశాల'




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి 2024 వరకు విడుదలైన సినిమాలకు ప్రతిష్ఠాత్మక గద్దర్ సినీ పురస్కారాలను ప్రకటించింది. ఒక్కో ఏడాదికిగానూ ప్రథమ, ద్వితీయ, తృతీయ ఉత్తమ చిత్రాల్ని పురస్కారాలకు ఎంపిక చేసింది. 2014 గాను సెకండ బెస్ట్ ఫిల్మ్‌గా 'పాఠశాల' చిత్రం ఎంపికైయింది. రాకేశ్ మహంకాళి, పవన్ కుమార్ రెడ్డి నిర్మాణంలో మాహి వి రాఘవ దర్శకత్వం వహించిన 'పాఠశాల' ఐదుగురు మిత్రులు, ఐదు వారాలపాటు, 5000 కిలోమీటర్ల ప్రయాణాన్ని ఆవిష్కరిస్తూ, యువత, స్నేహం, ఆత్మవిశ్వాసం వంటి విలువలను అందంగా చూపించే ఒక అద్భుతమైన కథ. మనసుల్ని తాకిన గొప్ప కథనం, ఆకట్టుకునే సంగీతం, అద్భుతమైన విజువల్స్ మేళవింపుతో ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుండి విశేషంగా ఆదరణ పొందింది. ఇప్పుడు 2014 గాను సెకండ బెస్ట్ ఫిల్మ్‌గా ప్రతిష్ఠాత్మక గద్దర్ సినీ అవార్డ్‌కు ఎన్నికయ్యింది. ప్రతిష్ఠాత్మక గద్దర్ ఫిల్మ్ పురస్కారాల్లో 2014గాను సెకండ బెస్ట్ ఫిల్మ్‌గా పాఠశాల చిత్రం ఎంపికకావడం పట్ల చిత్ర నిర్మాతలు ఆనందం వ్యక్తం చేశారు. 'పాఠశాల' చిత్రం గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ 2014లో రెండవ ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ ఎంపిక కావడం గౌరవంగా భావిస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గుర్తింపు మా చిత్రానికి ఉన్న శాశ్వతమైన ప్రభావాన్ని, విలువలను మరింత బలపరుస్తోంది' అన్నారు.

## శ్రీశ్రీశ్రీ రాజావారు జూన్ 6న విడుదల



నార్నే నితిన్, చిత్ర పరిశ్రమలోకి ఎన్టీఆర్ బావమరిదిగా ఎంట్రీ ఇచ్చి వరుస విజయాలు అందుకుంటన్నారు. నార్నే నితిన్ తాజాగా జాతీయ అవార్డు విన్నర్, 'శతమానం భవతి' దర్శకులు సతీష్ వేగేశ్న దర్శకత్వంలో శ్రీ శ్రీ శ్రీ రాజావారు' సినిమా చేశారు. శనివారం ప్రసాద్ ల్యాబ్ లో ఈ సినిమా ట్రైలర్ విడుదల చేశారు. జూన్ 6న ప్రేక్షకుల ముందుకు సినిమా రాబోతోంది. హీరోయిన్‌గా సంపద నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వేధాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు నిర్మించారు. సిగరేట్ తాగే అలవాటు ఉన్న అబ్బాయి జీవితంలో అమ్మాయి ప్రవేశించిన తరువాత అమ్మాయి పెట్టిన కండీషన్ ప్రకారం సిగరేట్ తాగడం మానేశాడా? లేదా? అనే కథాంశంతో వినోదాత్మకంగా తెరకెక్కించిన సినిమా అని దర్శకుడు సతీష్ వేగేశ్న తెలిపారు. కో ప్రొడ్యూసర్ సుబ్బారెడ్డి వ్యవహరించిన ఈ సినిమాలోని ఇతర పాత్రల్లో రఘు కుంచే, రచ్చ రవి నటించారు. మళయాళ సంగీత దర్శకుడు కైలాషా మీనన్ సంగీతం అందించారు.



## వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి

### పలువురు నేతలు డిమాండ్

ప్రజపక్షం/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని పలువురు రాజకీయ పార్టీలు నాయకులు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వం వాస్తవాలు దాచి మోసం చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణచట్టాన్ని నిరసిస్తూ వందత్ ఈ ఇస్లామి ఇన్ హైదరాబాద్ జాయింట్ యాక్షన్ కమిటీ, ఉభయ తెలుగు రాష్ట్రాల అఖిల పక్ష జెఎసి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి సిపిఐ జాతీయ కార్యదర్శి , మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి, ముస్లిం సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండ రాం, మాజీ ఎంపి వి.హనుమంత రావు, ఫిరోజ్ ఖాన్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దిడ్డి సుధాకర్ సహా పలు ప్రజా సంఘాల ప్రతినిధులు ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకే బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని ఆగ్రహంవ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ అండతో ముస్లింలకు వ్యతిరేకమైన వక్ఫ్ చట్టాన్ని తీసుకొచ్చి ముస్లింలు, మసీదుల ఆస్తులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇది కేవలం వక్ఫ్‌తో ఈ సమస్య సమిసి పోదని, ఇతర మతాల ధార్మిక సంస్థలకూడ మతతత్వ కేంద్ర ప్రభుత్వం ఇదే విధంగా చొరబడి కబళించేస్తుందన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాలని ఆయన కోరారు. ఇతర నేతలు మాట్లాడుతూ దేశ రక్షణ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, కాపలాదారు సరిగా పని చేయకపోతేనే ఉగ్రవాదులు మన ఇంట్లో చొరబడుతారని వ్యాఖ్యానించారు. కేంద్ర పాలకులు దేశాన్ని హిందూ రాష్ట్రంగా కాకుండా బిజెపి రాష్ట్రంగా మార్చాలని ప్రయత్నిస్తోందనివారు ఆరోపించారు. ఎవరు అడగకుండానే ముస్లింలకు వ్యతిరేకంగా ట్రిపుల్ తలాక్, వక్ఫ్ వంటి చట్టాలను తెచ్చి బలవంతంగా రుద్దే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే సవరించిన వక్ఫ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వారు డిమాడ్ చేశారు.



నాగోల్, బండ్లగూడలోని 'ప్రజాపక్షం' కార్యాలయంలో జరిగిన సీనియర్ సబ్ ఎడిటర్ లలితా త్రిపురసుందరి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బిఎస్ఆర్ మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్‌కుమార్ ఇతర సిబ్బంది తదితరులు

## అవినీతి బిఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు

### కల్వకుంట్ల కవిత డ్రామా వెనుక కాంగ్రెస్ హస్తం
### ఆరు గ్యారంటీలపై చర్చను దారి మళ్లించేందుకే ఎత్తుగడ
### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కల్వకుంట్ల ఆర్ట్స్ పతాకంపై కాంగ్రెస్ పార్టీ దర్శకత్వంలో కల్వకుంట్ల కవిత ప్రధాన పాత్రధారిగా 'చార్ పత్తా' సినిమాను నడిపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ప్రజలకు ఎలాంటి మేలు కలిగించని ఇలాంటి డ్రామాలతో సాధించిందేమీ లేదన్నారు. ఇందులో కెసిఆర్ జోకర్‌గా మార్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, దీనిపై ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉండడంతో వారి దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి ఎత్తుగడ వేస్తోందని విమర్శించారు. శనివారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. పంటలకు మద్దతు ధర పెంచుతూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల ప్రధాని మోడీకి తెలంగాణ రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసిందన్నారు. రైతుల విషయంలో కెసిఆర్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. అన్నీ గాలికి



వదిలేసి 18 నెలలుగా టైంపాస్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీలపై చర్చ జరుగుతుంటే ఏదో ఒక అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నారన్నారు. బిఆర్‌ఎస్ సర్కారు అవినీతి విషయంలో కెసిఆర్ కుటుంబాన్ని జైలుకు పంపిస్తామన్నారని, ఫోన్‌ట్యాపింగ్, ఫాంహౌజ్, ఫార్ములా ఈ రేసు కేసుల విషయంలో కెసిఆర్, కెటిఆర్‌లను అరెస్టు చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదన్నారు. ఈటల రాజేందర్, హరీష్‌రావు భేటీ అయ్యారనే విషయం తనకు తెలియదన్నారు. ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అన్నారు. అసలు బిఆర్‌ఎస్ అంటేనే కుటుంబ, అవినీతి పార్టీ అన్నారు. కవితను అరెస్టు చేయకుండా ఉండడానికి బిజెపితో కలవడానికి బిఆర్‌ఎస్ ప్రయత్నించిందని, కానీ అట్లాంటి అవినీతి, కుటుంబ పార్టీని మేం దగ్గరకు సైతం రానియ్యలేదన్నారు. ఎన్ని డ్రామాలాడినా బిఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కలిసి బిజెపిని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, ఎన్ని కుట్రలు చేసినా బిజెపిని అధికారంలోకి రాకుండా అడ్డుకోలేరన్నారు.

## అడ్డుకోవడం దుర్మార్గం

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపిస్తుండడమే కాకుండా వారికి ఇతర దేశాల నుంచి అందుతున్న ఆహారం, మందులను కూడా అడ్డుకోవడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శనివారం 'పీపుల్స్ సాలిడారిటీ ఫర్ పాలస్తీన్' ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, తెలంగాణ జన సమితి (టిజెఎస్) అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు. అజీజ్ పాషా మాట్లాడుతూ యుద్ధం కారణంగా గాజాలో 20 లక్షల మంది ఆకలి దప్పికలతో చనిపోయే ప్రమాదం ఏర్పడిందని, ఈ ప్రజలకు తక్షణమే ఆహారం అందే విధంగా ఇజ్రాయిల్‌పై ప్రపంచ దేశాలు ఒత్తిడి తేవాలని ఆయన కోరారు. స్వాతంత్రోద్యమం ముందు నుంచి కూడా మన దేశం పాలస్తీనాతో మైత్రీ బంధం కొనసాగిస్తుందని, ఆ దేశం ఏలాంటి అపదలో ఉన్నా ఆదుకుంటూ వచ్చిందన్నారు. అయితే ప్రస్తుతం ఇజ్రాయిల్‌తో అనేక వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రధాని మోదీ తటస్థ వైఖరి అవలభిస్తున్నారని, దీనిని వీడి గాజాపై తక్షణమే యుద్ధం ఆపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని కోరారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కు తన దేశాన్ని పరిరక్షించుకోవడంలో ఎవరికీ అభ్యంతరం లేదని, అయితే గాజాలో పాలస్తీనా ప్రజలపై కొనసాగిస్తున్న అమానవీయంగా దాడి చేయడం గర్హనీయమన్నారు. ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయడమే లక్ష్యంగా కార్పొరేటింగ్ బాంబింగ్‌కు పాల్పడుతోందని, దీనిని ప్రపంచ దేశాలన్నీ తీవ్రంగా ఖండించాల్సిన అవసరముందన్నారు. యుద్ధం పేరుతో 50 వేలమందిని చంపివేయడం, లక్ష మందికి పైగా గాయాలకు గురిచేయడం సాధారణ విషయం కాదన్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పాలస్తీనాలో శాంతిని నెలకొల్పేలా మన దేశం కూడా కృషి చేయాల్సి ఉందని, ఇందుకు అనుగుణంగా ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ యుద్ధం కారణంగా గాజాలో చిన్న పిల్లలు మహిళలు చెత్త కుప్పల్లో ఆహారం వెతుక్కుని తినాల్సిన పరిస్థితులు రావడం కంటే దౌర్భాగ్యం ఏమి ఉండదని, ప్రపంచ వ్యాప్తంగా మానవత్వం అనేది నశించిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అబ్బాస్ మాట్లాడుతూ యుద్ధం పేరుతో అమెరికా గాజాను ఆక్రమించుకోవాలని చూడడం సామ్రాజ్యవాద కాంక్షకు నిదర్శమన్నారు. ఎఐ టెక్నాలజీని వినియోగించుకుని పిల్లలపై రిమోట్ గన్స్ ప్రయోగించడం అత్యంత దారుణమన్నారు. యుద్ధం ఆపకపోతే ఇజ్రాయిల్‌తో చేసుకున్న వ్యాపార ఒప్పందాలను పునర్ సమీక్షించాల్సి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దేశానికి స్పష్టం చేయాలన్నారు.

## నంబాల మృతి నష్టమే

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. మోడీ, అమిత్‌షా ల ప్రకటనల ద్వారా రక్తపిపాస నరహంతక స్వభావాన్ని చాటుకున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. శాంతి చర్చలకు పలుమార్లు లేఖలు రాసినా పట్టించుకోలేదని ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఏప్రిల్ ఒకటి నుంచి ఇప్పటి వరకు 85 మంది మావోయిస్టులను హత్య చేశారని తెలిపారు. ఏప్రిల్ 24 నుండి మే ఎనిమిది మధ్య కర్రెగుట్టల్లో 31 మందిని హత్య చేశారన్నారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడుతున్న 540 మందిని హత్య చేసి మావోయిస్టు రహిత భారత్ ఏర్పాటు కోసం 31 మార్చి 2026ను డేడ్‌లైన్‌గా ప్రకటించారని లేఖలో తెలిపారు. బసవరాజ్ 51 ఏళ్ల విప్లవోద్యమంలో వివిధ హోదాలలో పని చేశారని 1975లో వరంగల్ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాడికల్ విద్యార్థి సంఘం ఏర్పాటుతో ప్రారంభమైన ఆయన విప్లవోద్యమ జీవితం సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ కార్యదర్శి వరకు సాగిందన్నారు. గంగన్న పేరుతో దళ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టారని ఆ తర్వాత డివిజన్ కమిటీ కార్యదర్శిగా దండకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా, పోలిట్ బ్యూరో సభ్యునిగా అన్నింటి కంటే సెంట్రల్ మిలటరి కమిషన్ ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టారన్నారు. 2017 నుంచి మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బసవరాజ్ పని చేశారన్నారు. పీపుల్స్ లేబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఏ) బలోపేతానికి ఆయన కృషి చేశారన్నారు. 1972లో చార్‌మజూందర్ చనిపోయిన నాటి నుంచి ఆ తర్వాత అనేక మంది మరణించినప్పుడు విప్లవోద్యమం పని అయిపోయిందని ప్రచారం చేశారని కానీ అది ప్రచారంగానే మిగిలిపోయిందన్నారు. తమ జీవిత కాలం విప్లవోద్యమానికి అంకితమై పనిచేసిన అమరుల స్మారకార్థం జూన్ 11 నుంచి ఆగస్టు మూడు వరకు దేశ వ్యాప్తంగా బసవరాజ్ సహా 27 మంది అమరుల స్మారక సభలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తుందని లేఖలో పేర్కొన్నారు. జూన్ 10న భారతదేశ బంద్‌ను పాటించాలని మావోయిస్టు పార్టీ కోరింది. అమరుల ఆశయ సాధన కోసం విప్లవోద్యమంలో భాగస్వాములు కావాలని మావోయిస్టు పార్టీ లేఖ ద్వారా పిలుపునిచ్చింది.

## ఉక్కుపై సుంకం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ఏప్రిల్ రెండో తేదీన అమెరికా లిబరేషన్ డేను ప్రకటించారు. అనేక దేశాలు అమెరికాను సుంకాల రూపంలో దోచుకుంటున్నాయని, దీనివల్ల అమెరికా వాణిజ్య లోటు విపరీతాంగా పెరిగిపోయిందనీ, అమెరికా వాణిజ్య ఆదాయాన్ని పెంచి ఒక కొత్త శకం ఆవిష్కరించబోతున్నామని ట్రంప్ చెప్పారు. ఆ తర్వాత స్టీల్‌పై ఆయన సుంకాలు విధించారు. ఇప్పుడు వాటిని రెట్టింపు చేశారు.

### ఎలాన్ మస్క్ మాతోనే ఉంటారు

'డోజ్' శాఖ ద్వారా ఎలాన్‌మస్క్ ప్రభుత్వ వృథాఖర్చులను ట్రిలియన్ డాలర్ల మేరకు తగ్గించారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. ఆయన ఎక్కడికీ వెళ్ళిపోరనీ, తమతోనే ఉంటారని ట్రంప్ అన్నారు. పాలనాయంత్రంగ బాధ్యతల నుండి తప్పుకుంటున్నట్లు ట్రంప్ కుడిభుజంలా ఉంటూ వస్తున్న స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ రెండు రోజులక్రితం చెప్పారు. ఆయన పూర్తిగా ప్రభుత్వాన్ని వదిలి వెళ్ళడంలేదని, ఇంకా ఎన్నో ఆయన చేయాల్సి ఉందన్నారు.
''ఒక ప్రత్యేక ప్రభుత్వ ఉద్యోగిగా నా బాధ్యతలు పూర్తయ్యాయి, ప్రభుత్వ యంత్రంగంలో వృథాను అరికట్టేందుకు తనను ప్రత్యేక బాధ్యతల్లో నియమించిన ట్రంప్‌కు నా కృతజ్ఞతలు'' అని ఎక్స్ వేదికగా ఎలాన్‌మస్క్ రెండు రోజులక్రితమే ప్రకటించారు. డోజ్ వల్ల వారానికి 10 బిలియన్ డాలర్ల మేరకు డోజ్ వల్ల ప్రభుత్వ యంత్రాంగానికి వృథా ఖర్చులు తగ్గాయి. ఫెడరల్ బడ్జెట్‌లో రెండు ట్రిలియన్ డాలర్ల మేరకు కోతలు పడేట్టు చూస్తానని వృథా అరికడతానని ఎలాన్‌మస్క్ తొలుత ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని అధునీకరించి గరిష్ఠస్థాయి ఫలితాలు సాధించడం, వృథాఖర్చులు తగ్గించడం డోజ్ ప్రధాన లక్ష్యం. ట్రంప్ దేశాధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన క్షణాల్లోనే కార్యనిర్వాహక ఉత్తర్వు ద్వారా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎఫీషియన్సీ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com